

ఆంధ్రపత్రిక
సచిత్ర వార పత్రిక
4 అణాలు
24-11-5
ANDHRA PATRIKA ILLUSTRATED WEEKL

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

సంక్రాంతి సంచిక కథానికల పోటీ

మొదటి బహుమతి రు 75. రెండో బహుమతి రు 50.

వచ్చే సంక్రాంతికి (14-1-1955) ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక ప్రత్యేక సంచికగా వెలువడుతుంది. ఈ సందర్భం పురస్కరించుకుని కథానికలపోటీ జరుపుతున్నాము. పోటీకి వచ్చే కథానికలలో ప్రథమ, ద్వితీయశ్రేణి రచనలకు రు 75, రు 50 బహుమతు లివ్వబడతాయి.

నేటి మనసామాజిక వ్యవస్థలో స్త్రీల స్థితిగతులు, వారి మనఃప్రవృత్తి, వారెదుర్కొంటున్న సమస్యలను గురించిన కథానికలు మాత్రమే పోటీకి స్వీకరించబడతాయి. పోటీలో అందరూ పాల్గొనవచ్చును.

పోటీ కథానికలు మా కార్యాలయానికి 1954 డిసెంబరు 1 వ తేదీలోగా చేరాలి. పోటీ ప్రవేశరుసుము లేదు. రచనలు వారపత్రికలో ఆరుపేజీలకు మించరాదు బహుమతుల విషయంలో తుదినిర్ణయం సంపాదకులదే.

పోటీకి పంపే కథానికలకు కేప్షన్లపైనా, రచన మొదటిపుటపైనాకూడా స్పష్టంగా "ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక సంక్రాంతి కథానికలపోటీకి" అని వ్రాయాలి.

బహుమతీ నిర్ణయం అనంతరం ప్రచురణకు స్వీకరించబడని రచనలను తమకు త్రిప్పి పంపగోరే రచయితలు తిరుగుపోస్టుకు అవసరమైన స్టాంపు తమ రచనలతో బాటే జతపరిచి పంపాలి.

సంక్రాంతిసంచికకుగాను ఇతరవ్యాసాలు, కథానికలు, చిత్రాలు, ఫొటోలు పంపదలచిన వారుకూడా తమ రచనలు 1954 డిసెంబరు 1-వ తేదీలోగా మా కార్యాలయానికి అందేటట్లు పంపాలి.

రచయితలందరూ, ముఖ్యంగా వనితలు ముందంజవేసి కథానికల పోటీలో పాల్గొని మా సంకల్పాన్ని జయప్రదంగా నెరవేర్చగలరని ఆశిస్తున్నాము.

—సంపాదకుడు

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.


ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 48
సంచిక 18
24-11-54

జయ కార్తిక బహుళ చతుర్దశి బుధవారం



మత్తేభం

ఫోటో : [illegible]

కాలక్షేపం

ఇచ్ఛను వచ్చినట్లు చరియించుట,
  దైన్యములేని తిండియున్,
నిచ్చలు సాధుసంగమును,
  నిర్మలశాంతియు, శాస్త్రబోధమున్,
మచ్చిక లోనబూని చెలి
  మట్టని చిత్తముగాగ, నింతయున్
వచ్చుట యే మహోన్నత
  తపంబు ఫలంబో యెఱుంగ జెప్పుమీ!

తా॥ యథేచ్ఛగా విహరింపగల్గుటయును, తన తిండికొరకై దీనునివలె ఒకరిని యాచింపకుండుటయును, నిరాటంకముగా సాధువులను సత్పురుషుల సాంగత్యము చేయుటయును, నిర్మలమైన మనశ్శాంతిని పొందుటయును, శాస్త్రములను బోధపరచుకొనుటయును, మనస్సును స్వాధీనము చేసికొని దానిని బాహ్యవిషయములందు తగుల్కొననిదానినిగా చేయుటయును, - ఈలక్షణములన్నియు ప్రాప్తించుట యెంతటి గొప్ప తపస్సుచేయుటవల్ల లభించగల ఫలితమో యెఱుంగగలమా?

నారుపోసినవాడు నీరు పోయక మానడు అనే వాక్యం ఒకవిధమైన అభయహస్తంగా, వరదహస్తంగా, చాదస్తంగా, పెద్దవాళ్ళు పలుకుతూఉండే ధైర్యవచనంగా చలామణీ అవుతోంది. కాని, యీ ధైర్యవచనం చెప్పవలసిన అవసరం ఎందుకు ఏర్పడినది? అధైర్యం అనేది అంతర్గర్భితంగా ఉండడం వల్లనే ధైర్యవచనం అనేదిగాని, అభయహస్తంగాని అవసరమవుతుంది. వీరుడై, శూరుడై సమరనిశ్శంకుడై, యుద్ధభూమికి మహోద్ధతుడై వెళ్ళిన ఖడ్గతిక్కన వంటివాడుకూడా ఏదో తలతిక్క వచ్చి, బ్రతికిఉంటే బలుసాకైనా తినవచ్చునని భావించి, ఆహవము మాని, హాయిగా స్వగృహమునకు దారితీసిన కథాసందర్భము ఉంది. ఇటువంటి సందర్భములో అసందర్భము ఏమీలేదు. స్వతంత్రంగా జీవించడం సర్వోత్కృష్టమని మనం అంగీకరించినట్లయితే, తనకు యుక్తమనీ ఉత్తమమనీ తోచిన రీతిగా తాను ప్రవర్తించడం గాని, పరివర్తన చెందడం గాని, పరమోత్కృష్టమని అంగీకరించాలి. తన మనస్సుకు త్రికరణశుద్ధిగా ఏది అవశ్యకర్తవ్యమని తోచునో, ఏది సద్ధర్మమనెడి సంకల్పము కలుగునో, ఆప్రకారంగా ప్రవర్తించడంలో ప్రమాదమూ లేదు, పాపమూ లేదు.

"ఇచ్ఛకు వచ్చినట్లుగా ప్రవర్తించడం" సులభ సాధ్యమైన విషయం అని భావించే వాళ్లకు ఆవిషయంలో ఉన్న విశేషం లవలేశం తెలియదని నిస్సంశయంగా చెప్పవచ్చు. మన యిష్టప్రకారం ప్రవర్తించవలెననే అభిలాషకంటె మున్ముందుగా, యీ లోకంలో మనం ఉట్టికట్టుకొని నూరేళ్ళు ఊరేగినప్పటికీ, మరొక నూరేళ్లు మనమెందుకు భాగ్యభోగ్యాలు అనుభవించకూడదనే అభిలాష వెంటాడుతూ ఉంటుంది. అయితే యిటువంటి అభిలాష ఎందుకు ఉండకూడదు? మార్కండేయులంత ఆయుస్సు, బ్రహ్మంత ఆయుస్సు కలిగి చిరంజీవిగా వర్ధిల్లవలెనని ప్రార్థించి, పిల్లలకు స్నానంచేయించిన తల్లులు "శ్రీరామరక్ష" యని దీవించడం అవ్యక్తం కాదు. అయుక్తం కాదు, చిన్నవాళ్లను "చిరంజీవులు" అని సంబోధించడంవల్లనే, అర్యతత్వంలో ఉన్న అనివార్య ఆత్మతత్వం వ్యక్తమవుతోంది.

తాను శాశ్వతంగాజీవించి ఉండవలెననే కోరిక ప్రతిజీవికీ సహజసిద్ధంగా ఉంది. తాను సదా సరదాగా ఉండవలెననే కోరిక కూడా సహజసిద్ధంగా ఉంది. సదా జీవించి సదాసుఖించవలెననే కోరిక ఎక్కడఉన్నదో అక్కడ "సత్‌చిత్, ఆనందం" అనే మూడు ముఖ్యలక్షణాలూ గలిగిన ఆత్మతత్వం ఒకటి ఉన్నదని అంగీకరించక తప్పదు. శాశ్వతంగా తానొక నిత్యమైన సత్యమైన శాల్తీగా ఉండవలెననే కోరిక అందులో ఉంది. అదే జీవుని లక్షణం. అదే జీవాత్మలక్షణం అన్నారు. జగత్తంతా మిథ్య అనవచ్చు - జగత్తంతా గారడీ అనవచ్చు. ఆ విధంగా వాదించిన వేదాంతి, తాను కూడా మాయ అనిగాని, తన వేదాంతం కూడా మాయ అనిగాని, తన వేదాంతం అంతా వట్టి బూటకం అనిగాని వాదించడు. ఈ లోకం అంతా "మిథ్య" అని వాదించిన వేదాంతి, తన మాటమాత్రం "సత్యం" అని వాదిస్తాడు. తాను సత్యం-తనమాట సత్యం, అని బోధిస్తాడు. "సబ్ సాప్నా - కోయీ నహీ అపనా" అన్నాడు. "ఇదంతా స్వప్నం - 'నాది' అనబడేది ఏదీలేదు." కనుక "భజమన రామచరణ" "శ్రీరాముని పాదములనే భజించు" అన్నాడు. అంతా స్వప్నం అనేయెడల, తన దేహం కూడా స్వప్నమే అవుతుంది. తన తలకాయలోఉన్న మెదడుగాని, బుద్ధిగాని, ఆ బుద్ధికి సంబంధించిన వ్యాపారతంత్రంగాని, ఇదంతా స్వప్నలీలవంటిదే అవుతుంది. తన శరీరం, తన చిత్తప్రవృత్తి ఇదంతా స్వప్నం అయినట్లయితే, శ్రీరామచంద్రుని పాదారవింద ధ్యానం చేసేటటువంటి తన మనస్సుయొక్క భజన అంతా వట్టి నీటిమూట, గాలిమేడ, బిబ్బిలోని లిబ్బి, స్వప్నలీల, ఎండమావులలోని నీరు, టక్కుటమార గోకర్ణ గజకర్ణ యింద్రజాల మహేంద్రజాలం అని వాదించగలడా? శరీరం మిథ్య కావచ్చు - కాని అశరీరం అయినదేదో ఒకటి ఉన్నదనిన్నీ, అది అతి పవిత్రమైనదనిన్నీ, మాన్యమనిన్నీ, వాదిస్తున్నారు వేదాంతులు - దానినే ఆత్మ అన్నారు. ఈ ఆత్మ నిష్కళంకమైనదన్నారు. దీని తత్వం, దీని సహజలక్షణం,

విషయానుక్రమణిక

ముఖచిత్రం :— కృష్ణా పిక్చర్స్‌వారి "విజయగౌరి"లో పద్మిని.

పుట్టిలో ఉన్న బంగారం వంటిదన్నారు. ఈ తెన్నున మన్నులో ఉన్న పొన్నును గ్రహించవలెనన్నారు. పైన ఉన్న మన్నులో పలువిధములైన మలినములు ఉంటాయి. కాని అందులో అంతర్గతంగా ఉన్న అపరంజిమాత్రం అకళంకమైనది. స్వచ్ఛమైనది. శుద్ధమైనది. పవిత్రమైనది - మేధ్యమైనది. బంగారు కెపుమీద గంధకద్రావకం పోసినా, శంఖద్రావకంపోసినా అది చెక్కు చెదరదు. నిమ్మకాయపులుసు వేసినా దానికి చిలుమెక్కదు - దానికి తుప్పుపట్టదు. అది నిష్కళంకమైనది - అతి నిర్వికారమైనది. మిథ్య కాదు. అది పవిత్రమైనదగుటవల్ల మేధ్యమైనది. ఆత్మతత్వం ఇంచుమించుగా యిటువంటి తత్వమే అన్నారు. కాబట్టి జీవికి సహజలక్షణంగా ఉన్నటువంటి కోరికలు స్వచ్ఛమైనవే అని అంగీకరించారు.

మనము అన్నము తినవలెనను కోరికతో ఆకలితో ప్రాకులాడుట ఎందుచేత? అన్నములోని ధాతుపదార్థమువల్లనే యీ శరీరము నిర్మింపబడినదై, అన్నమయమై ఉండుట చేతనే అని గ్రహించవలెను. అన్నముకొరకై అహోరాత్రాలు కలవరించెడి యీ భౌతికశరీరాన్ని అన్నమయకోశంఅన్నారు. అదేవిధంగా జీవునియొక్క, అనగా జీవాత్మయొక్క ఆశనుబట్టి, పిపాసనుబట్టి జీవాత్మయొక్క నిజతత్వమును తత్వజ్ఞులు నిరూపించారు. అది ఎట్లున్నన్?

తాను స్వతంత్రంగా ఉండాలనే ఆసక్తి ఎందుచేత కలిగింది? ఈ ప్రశ్నకు ఒక్కటే సమాధానం - స్వతంత్రంగా ఉండే శక్తి తనలో ఉన్నది గనుక - ఆ శక్తిపేరే ఆత్మ. సుఖంగా ఉండాలనే ఆసక్తి ఎందుకు కలిగింది? సుఖంగా ఆనందంగా ఉండగలశక్తి తనలో ఉన్నది గనుక. ఆ శక్తిపేరే ఆత్మ.. శాశ్వతంగా ఉండాలనే ఆసక్తి ఎందుకు కలిగింది? శాశ్వతంగా ఉండేశక్తి తనలో ఉన్నది గనుక. ఆ శక్తి పేరే ఆత్మ. తాను మిథ్యకాదనిన్నీ, తాను నిజమనిన్నీ గట్టిగా నమ్మడం ఎందుచేత? తనలో ఉన్న సత్తా సత్యమైనది గనుక - ఆ లక్షణం దానికి ఉన్నది గనుక. అట్టి సత్స్వరూపలక్షణం గల సత్తా పేరే ఆత్మ. ఈ విధంగా ఆత్మ అనే శక్తి యొక్క లక్షణాలను ఆ విధంగా నిర్వచించి నిరూపించారు.

ఆత్మ అనేది ఒక సత్యమైన సత్తా. ఆత్మ అనేది తనలో ఉన్న ఒక చైతన్యం. ఒక చిత్ శక్తి - తాను జీవించాలనే సంకల్పదీక్ష గలది ఈ జీవాత్మ. తాను సుఖం అనుభవించాలనీ ఆనందం అనుభవించాలనీ కోరుతుంది. తాను సత్. తాను చిత్. తాను ఆనందం. తాను సత్యం. తాను జీవించాలి. తాను ఆనందం అనుభవించాలి. ఈ త్రిలక్షణాలతో తన ప్రభావం ప్రకటించేటటువంటిది ఆత్మ. అది మిథ్య కాదు. అది మేధ్యం. అది తథ్యం. అందుకనే "ఇది సత్యమురా గురుడ! సత్యమురా! ఇది నిత్యమురా గురుడ! నిత్యమురా! సత్యము, నిత్యము సత్యమురా!" అని జంగంబు దేవరలు ఇంటింటికి వచ్చి శంఖం ఊది, చెవి. విల్లు కట్టుకొని, చేగంట మ్రోగించి, వీధులు తిరిగి బోధించారు. పిడికెడు బియ్యం వేసినందుకై, యింత అమోఘమైన వేదాంత తత్వమును, అతి చౌకగా ఆబాలగోపాలం అవగాహన చేసికొనేటట్లుగా సర్వజన సులభ గ్రాహ్యంగా సరఫరా చేశారు.

అయితే, ఈ జంగంబు దేవరలకు మాత్రం ఆత్మపరిపక్వం అయినదనిన్నీ, ఆత్మజ్ఞానం కలిగినదనిన్నీ, ఆత్మసాక్షాత్కారం అయినదనిన్నీ, మిగిలినవాళ్ళకు అటువంటి ఆత్మపరిపక్వం కాలేదనిన్నీ, మనము వాదించలేము. ఎందుచేతనంటే స్థిరస్థావరంగా ఒకచోట ఉండక తిరుగుతూ ఉండేవాడు "జంగం." జంగాలు యీవిధంగా వీధులన్నీ తిరిగి సత్యం బోధించవలసిన అగత్యం సత్యానికి లేనే లేదు. జంగాలు బోధించకపోతే, ఆత్మకు ఉండే లక్షణాలు అంతరిక్షంలో అంతర్ధానం అవుతాయా? ఆత్మ అనేది తనకు తానే "సత్యం" అనిన్నీ, తన సత్తాను తానే వెల్లడించుకోగలదనిన్నీ, అది స్వయంప్రకాశమానమైన ఒక శక్తి అనిన్నీ మనం ఒప్పుకొనక తప్పదు. నీరు పల్లమెరుగును నిజం దేవుడెరుగును అనే మాట ఎంత నిజమో, "సత్యమేవ జయతే" అనే మాటకూడా అంత నిజం. ఇదే మన కాంగ్రెసు ప్రభుత్వపు "ఇజం".

గాంధిమహాత్ముని వద్దకు ఒక పర్యాయము పాశ్చాత్య ప్రముఖుడొకడు సందర్శనార్థం వచ్చి, సేవాగ్రామంలో ఆయన సాగిస్తున్న ఆశ్రమపరిశ్రమక్రమం అంతా ఆశ్యాపాంతం అవలోకించి, తల పంకించి, పండ్లు ఇకిలించి, ఒక చొప్పదంటు ప్రశ్న వేశాడు. "మహాత్ముని అనంతరం యీ రాట్నాలు తిరుగుచుండునా? ఈ ఖద్దరూ, యీ గృహపరిశ్రమలూ, యీ అహింసాతత్వమూ, యీ సత్య నిరతీ నిత్యంగా ఉంటాయా?" అని ప్రశ్నించాడు. ఆ పాశ్చాత్య ప్రముఖుని మనస్సులో ఉన్న అభిప్రాయం ఏమిటి? ఇవన్నీ ఆ మహాత్ముని అనంతరం స్థిరంగా ఉండేవి కావనిన్నీ, ఎప్పటికైనా స్థిరంగా కొనసాగుతూ ఉండగలిగినవి ఫ్యాక్టరీ యంత్రాలూ, రాజ్యాంగ తంత్రాలూ అనిన్నీ అతని భావం. మహాత్ములు అవతరిస్తారు, మహాత్ములు అస్తమిస్తారు. కాని, మానవులలో స్థిరంగా సాగుతూ ఉండేది

"మా ఇంట్లో మూడు ఆరైనా ఆరుమూడైనా నేనుచెప్పిన పని జరిగి తీరాలిసిందే — కాకపోతే ఒక్కొక్కసారి ఆపని నేనే చేసికోవాలిసి వస్తుందన్నమాటతప్ప."

* * *

భార్య భర్తతో: ఏమండీ! నేను పాడేటప్పుడల్లా మీరు వాకిట్లో వెళ్లినుంచుంటారేమండీ!

భర్త: నిన్ను కొట్టటం లేదని ప్రక్కవాళ్ళకి తెలియడం కోసం.

అసత్యమే అని అతని సిద్ధాంతం. కాబట్టి "అసత్యమేవ జయతే" అని అతని గట్టి నమ్మకం. "అసత్యమేవ జయతే" అంటే ఏమిటి? అబద్ధమే జయిస్తుంది అని అర్థం - అసత్యమైనదే చిట్టచివరకు వర్ధిల్లి, కొనసాగి, లోకంలో చలామణీ అవుతుందనిన్నీ,

★ కాలక్షేపం ★

అసత్యంలో ఉన్న నిషా, దానిలో ఉన్న మజా, దాని పాపం, దాని శిక్ష, సత్యంలో లేదనిన్నీ, అందువల్ల ఈ లోకం మడికట్టుకొని, నియమంగా నిష్ఠగా ఉండడం సాధ్యం కాదనిన్నీ, ఆ ప్రముఖుని సిద్ధాంతం. లోకానుభవజ్ఞానమును, అయన బట్టీపట్టి, దానిలోని సారాంశమును సారా తీసినట్లుగా తీసినాడు.

"ఆత్మబలం" అనేది ఎంత సత్యమో, జగత్తు "మిథ్య" అనే మాటకూడా అంత సత్యమే. జగత్తు అనేది "మాయ" అనే విషయం ఆ పాశ్చాత్య పండితుడు మనకు కొత్తగా చెప్పనక్కరలేదు. "మాయామేయ జగంబు" అనే విషయం గ్రహించినవారు కేవలం వేదాంత శిరోమణులు మాత్రమే కాదు. లౌకిక రాజ్యాంగ తంత్ర ప్రవీణులు కూడా "మాయామేయ జగంబు" అనే విషయం బాగా గ్రహించి, యీ మాయామేయ జగంబులోని జంగంబులవలె సంచరిస్తూ ఉన్నారు. కల్లమాటలు తియ్యగా చెప్పకపోతే, కల్లను నిజమని చలామణీ చెయ్యలేము. కల్లమాత్రమే కాదు-కల్లులో కూడా అంతే. తీపికల్లు అనేది ఒకటి ఉన్నదనిన్నీ తీపికల్లు తాగితే తప్పు లేదనిన్నీ అంగీకరించవచ్చు. అది సత్యం. కాని, యీ సత్యం కొంచెం పులిసినట్లయితే, అసత్యం అవుతుంది. దానికి కలరూపు కల్లరూపు అవుతుంది. దానిని బట్టీ పట్టితే, దానిలోనుంచి సారా వస్తుంది. అది అసలైన అసత్య సారాంశం. కాబట్టి, సత్యంలోనుంచి అసత్యమును తయారుచేయవచ్చు. తీపికల్లు శరీరానికి కరం, ఆరోగ్యకరం, శ్రేయస్కరం, శోభస్కరం. ఆమాట నిజమే. కాని, అమృతమే అలస్యంచేస్తే విషం అవుతుంది - ఈమాటకూడా నిజమే. అంతాకా ఎందుకు? వైద్యుడు రసవిష గంధకాదులను కట్టుదిట్టమైన మోతాదులలో వాడి ప్రాణంపోయేవానికి ప్రాణం నిలువబెట్టగలడు. పాషాణంవంటి విషము అమృతతుల్యంగా పనిచేసేటట్లు చేయగలడు. కాని దానిని సరియైన మోతాదులో నియమప్రమాణములలో కట్టుదిట్టంగా ఉపయోగించి ప్రయోగించాలి. ఆ లెక్కకువస్తే, మితం తప్పి అరగిస్తే మనము మింగిన వైటామినులే మన ప్రాణాలు తీసే కొరమీనులుగాను తిమింగిలములుగాను తయారవుతాయి. హితమైనదికూడా మితంగా తినాలి - బ్రాందీని ఆరోగ్యంకోసం ఔషధప్రాయంగా వాడవచ్చు. అతిశీతలప్రదేశాలలో చలికి నిలువలేని జనులకు కడుపులో ఒక డ్రామ్ము పడకపోతే రక్తప్రవాహము ఆగిపోతుంది. కనుక అటువంటి సందర్భములు దేశకాలపాత్రములనుబట్టి ఉంటాయి. మహాత్ముడు ఆమాట సత్యం అని గ్రహించాడు. మన దేశం బాగుపడాలంటే మనకు మద్యనిషేధం పరమౌషధం అన్నాడు. కాని, డాక్టరులు అవసరమని అంగీకరిస్తే ఎవరికైనా సారా సరఫరా చేయవచ్చునన్నాడు. "నీరా" అనబడే తీపికల్లు (అప్పుడు తీసిన తీపి కల్లు) త్రాగితే తప్పులేదు, ముప్పులేదు అని ఒప్పుకొన్నాడు. కాని, యివన్నీ కట్టుబాట్లతో సేవించవలసిన పదార్థాలు.

యథేచ్ఛగా అరగించదగ్గినది ఏదీ లేదు. యథేచ్ఛగా సేవించడం, యథేచ్ఛగా సంచరించడం, యీ జగత్తులో సాధ్యమని ఋజువుచేయగల అసాధ్య సిద్ధాంతి ఈ పృథివిలో లేడు.

నీ అంతరాత్మ "సత్యం" - కాని నీ చుట్టూ ఉన్న నీ శరీరంతో సహా యీ భౌతిక జగత్తు అంతా "మిథ్య" - అందువల్ల నీ యీ హద్దుమీర తెలిసి ఎరుకగలవారు మెలకువతో మెలంగవలెనని సత్యనిరతులు సచ్చరితులు హెచ్చరించారు. ఆంధ్ర మంత్రివర్గం ఆఖరు సమావేశంలో. ఏదో ఆవేశంలో, తీపికల్లు అనగా "నీరా" నిరాఘాటంగా త్రాగవచ్చునన్నారు. విదేశీ సారాలు త్రాగదలంచిన యెడల వైద్యుల అనుమతి పత్రాలు లేకుండా, అడిగినవారికి లేదనకుండా, సారా సరఫరా చేయవలెనన్నారు. కట్టుదిట్టాలు లేవన్నారు. "ఇచ్చవచ్చినట్లు చరియించుట" అంటే ఇదే అని నిరూపించినారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది గనుక, స్వాతంత్ర్యసారం రుచిచూపించారు.

"ఇంతయున్ వచ్చుటదే మహోన్నతతంబు ఫలంబో యెఱుంగ నేర్తుమే?"

★


ఒక సుప్రసిద్ధ నటుడు, ఒక సుప్రసిద్ధ నటీమణిని అమితంగా ప్రేమించి, వివాహం చేసుకోవాలనుకున్నాడు. అన్ని ప్రయత్నాలు జరిగిన తరువాత అనుకోకుండా పెళ్ళి ఆగిపోయింది. కారణం ఏమిటంటే అతడు చెప్పినది ఇది. "శుభలేఖలు అచ్చు వేయించటంలో నా పేరు పెద్ద అక్షరాలతో పైన ఉండాలని నేను, కాదు తన పేరే ఉండాలని ఆమె అనటంవల్ల పేచీ వచ్చింది."

* * *

"ఇంటికి ఒక్క ఘడియ ఆలస్యంగా వెళ్ళానా? ఒక చిన్న కొలుపు జరిగిందన్నమాటే."

"అదృష్టవంతుడివి. మా ఇంట్లో అయితే ఘోరంగా ఒక చిన్న యుద్ధమే జరుగుతుంది."

మీ దగ్గుకి <u>మూలకారణం</u> నిర్మూలము చెయ్యండి దానిని అణచివేయుట మాత్రమే చాలదు



దగ్గు అపాయ చిహ్నము. సిరోలిన్ దాని మూలకారణం నిర్మూలించి రోగ క్రిములను తొలగించుటకు సహకరించును.



దగ్గును ఎప్పుడూ అశ్రద్ధ చేయకండి. మీ గొంతుక లోను, ఊపిరితిత్తులలోను వుండే సున్నితమైన స్నాయువులు వాచి ఉబ్బినపుడు సిరోలిన్ పుచ్చు కోండి. సిరోలిన్ యీ బాధ నిర్మూలిస్తుంది.

సిరోలిన్ మత్తుమందుల మీద ఆధారపడదు; దానిలో ఎఫిడ్రిన్ లేదు. దీని క్రిమిసంహార శక్తి రోగక్రిములను హరింపచేసి వాపును క్రమంగా తీసివేయును. కఫము, చీమిడి మీ గొంతులో అడ్డవు—సిరోలిన్ అవి సులభముగ పైకి రావడానికి సహకరించును.

సిరోలిన్ మిమ్మల్ని క్రొత్తవారిగా చేస్తుంది

సిరోలిన్ రోగమును ఎదుర్కో డానికి అవసరమైన శక్తి నిస్తుంది. జీర్ణముగుటలో సహాయపడి మీ ఆకలిని వృద్ధిచేయును. సిరోలిన్ కుటుంబానికంతకు ఉత్తమ దగ్గు నివారిణి—పిల్లలకు పెద్దలకు గుణమిచ్చు నిరపాయమైన మందు. ఎల్లప్పుడూ ఒక సీసా మీ యింట్లో ఉంచండి.

సిరోలిన్

'రోష్'

హనోయ్ విశేషాలు: 3

5. "దేశమంటే మనుషులోయ్"

ఫ్రెంచివారి అధీనం తొలగి అక్టోబరు 10 నుంచీ పట్నం జాతీయ నాయకులచేతుల్లోకి వొచ్చింది. పిల్లవాడు నిద్రలేవగానే యిల్లు కళకళలాడినట్టు, తిరిగీ మనుషులు మెసలడంతోనే ఊరికి ఎక్కడలేనిశోభ వచ్చింది. మరోనాలుగురోజుల్లో కొట్లు తెరిచేరు. జనం మామూలుగా యెవరిపనులు వాళ్లు చూసుకోవడం మొదలెట్టేరు. అంతకుముందు ఆలనాపాలనా లేక గుట్టలుగుట్టలుగా పడివున్న చెత్తా చెదారం అంతా మాయం అయిపోయింది. ఇదివరకటిదాకా ఫ్రెంచివారి హయాంలో ఉన్న డాన్సింగుహాల్సూ, డ్రింకింగు బూత్సూ మిల్కుబార్సయిపోయేయి. పెద్ద పెద్ద షాపుల్లో సామాన్యులు కట్టుకునే ముతక బట్టలు తొస్తుతొస్తూ వెలిసేయి. ఇవి చాలకయింకా రోడ్డొడ్డునకూడా అలాంటివే చిల్లరదుకాణాలు! ఏవీధిని చూసినా పుస్తకాలషాపులూ, లైబ్రరీలున్నూ - అన్నీ వియట్నామీజ్ భాషలోనే!

ఊరూ, దానిసౌకర్యాలమేనేజిమెంటూ అంతా జాతీయసైనికులు తీసుకున్నారు. పేరుకి మిలటరీదుస్తులు వేసుకుని, తుపాకులు పట్టుకున్నా వాళ్లు యెంతో మర్యాదగా ప్రవర్తిస్తారు. గొప్పా బీదా, చదువుకున్నవాడూ చదువు రానివాడూ అన్న తేడా లేకుండా అందరికీ తోడుపడడానికి ప్రయత్నిస్తారు, పాపం, వీళ్లు. వీళ్ల మిలటరీలో మొగవాళ్లెంతమందో అంతమందీ ఆడవాళ్లు ఉన్నారు. ఉభయులూ కలిసి సామరస్యంగాపనిచేసి, ప్రజాహృదయం, అభిమానం చూరగొనడానికి ప్రయత్నిస్తారు.

దాదాదీదా పౌరులకీ మిలటరీవాళ్ళకీ సౌమనస్యం యేర్పడింది. తమ జాతీయదళాలూ వాటి సిబ్బందీమూసి గర్వపడతారు, పౌరులు. ఇంచుమించుగా ప్రతీరోజూ ఏదో ఓపేటలో, ఏదో ఓవీథులో, ఏదో ఓభవంతిలో పౌరులు మిలటరీవాళ్లని సన్మానం చెయ్యడమేను! ఒక్కొక్కప్పుడు మిలటరీవాళ్లు తమ దేశం, తమ ప్రభుత్వం, వారి ఆశయాలూ వీటిగురించి ప్రజలకి బోధ చేస్తూ ఉంటారు. అలాంటి సమావేశాలకి స్త్రీలు తప్పకుండా వెళ్ళడం పరిపాటి.

దేశస్థులకి తమ నాయకుడంటే ఎంతో భక్తీ, గౌరమున్నూ. ప్రతీ బిల్డింగులోనూ - ముఖ్యంగా పబ్లిక్ బిల్డింగ్సులో - హోచిన్ మిన్ ఫోటో పెద్దసైజుది ఉంటుంది. ప్రతీ యింట్లోనూ చిన్నదో పెద్దదో ఆయన ఫోటో ఉండితీరిందన్నమాటే. బొమ్మల దుకాణాల్లోనూ, పుస్తకాల షాపుల్లోనూ, ఫోటో స్టూడియోస్ లోనూ అయితే బొత్తిగా మరీని!

అక్టోబరు 10 ని హనోయ్ తమవశం అయింది. ఆనాటి సాయంకాలం మొదలూ అంతవరకూ వొస్తూన్న సైగాను టైము మార్చేసి, పీకింగు టైముకి సర్దుకున్నారు గడియారాలు. నవంబరు ఒకటో తేదీ సరికయితే బజార్లో హోచిన్‌మిన్ పియాస్ట్రిలే కాని (వీటిని డాంగ్సంటారు), ఇండో చైనా బేంకు పియాస్ట్రిలు పనికిరాకుండా పోయినాయి!

ఇది యిలా ఉండగా ఊళ్ళో మాంఛి జనసమ్మర్దం అయిన పేటల్లో మూడు నాలుగు పేద్ద కేంటీనులు (షాపులు) పెట్టేరు. వాటినిండా నిత్యజీవనానికి ప్రతీవాడికీ ఉపయోగపడే వొస్తువులు - అల్యూమినం గిన్నెలు, టిఫిను కేరియరులూ, తువ్వాళ్లూ, మామూలు రకం బట్టలూన్నూ. ఇందులో కొంతభాగం చీనాదేశపు సరుకు లేకపోలేదు.

6. వియట్నామీజ్ సంస్కృతి

వియట్నామీజ్ ప్రజలు - కొంతమంది ఫ్రెంచి ప్రాబల్యం మూలాన్న మతం పుచ్చుకున్న క్రైస్తవుల్ని తప్పిస్తే - సర్వసాధారణంగా బౌద్ధులు. ఊళ్లలోనూ, యిళ్లలోనూ, *Curios* షాపుల్లోనూ బుద్ధవిగ్రహాలు కనిపిస్తాయి. ఐతేఅవి మనం హిందూదేశంలోనూ అక్కడా చూసే బుద్ధవిగ్రహాల పోలికగాక, చీనాదేశపు విగ్రహాలని పోలిఉంటాయి.

బౌద్ధ మతస్థులయినా ప్రతీవాడూ మాంసం తింటారు. అందులోనూ ఎండ్రపీతలూ, నత్తగుల్లలూ, పాంవులూ సర్వసాధారణంగా తింటారు. కేవలం శాకాహారులు లేరనే చెప్పాలి. ఇహ కొత్త నాగరికత బలిసినవాళ్లయితే కోడి, కాకూయిలాంటివి రకరకాలుగా చేసుకుని తింటారు. మనకి వంకాయలాగ యిక్కడవాళ్ళకి ఎండ్రపీత, చేప లేనిదే ముద్ద నోటికి దిగదు!

ఎవ్వడూ – ఎంత పేదవాడయినాసరే - చేత్తో తినడు. రెండు వెదురుపుల్లలతో అన్నం కలుపుకోడం, తినడం కూడా జరుగుతుంది. పేదవాళ్లు వెదురుపుల్లలు ఉపయోగిస్తారు, కొత్త నాలుగువేళ్లూ నోటికి పోతూన్నవాళ్లు ప్లాస్టికు పుల్లలు ఉపయోగిస్తారు.

మన ఆంధ్రదేశంలో దొరికే కూరగాయలన్నీ యిక్కడా దొరుకుతాయి. అరటిపళ్లూ, పంపర పనాసపళ్లూ, అనాసపళ్లూ, పనసపళ్ళూ అయితే విపరీతం. పనసకాయ ఏం చేసుకోవచ్చో వీళ్ళకి తెలియదు; పండేదాకా ఊరుకుని తొనలు తింటారు. అరటి పువ్వులూ, కాయలూ కూరగాయల బజార్లో విపరీతంగా అమ్ముతారు, ఏటి ఏడాది పొడుగునాను. వేరుసెనగపప్పూ, పంపరపనాసపళ్ళూ ఏ రోడ్డుఒడ్డుమూసినా అమ్మే చిరుతిళ్లు.

ఇంకోమాట, భోజనాల ప్రస్తావనలోనే చెప్పాలి. ఇక్కడ యెవ్వడూ - బీదాబిక్కీ కూడాను!—పచ్చి మంచినీళ్లు తాగరు, అన్నం తిన్నప్పుడూ, దాహం వేసినప్పుడూ కూడాను. నీళ్ళకి బదులు పాలూ పంచదారా లేని పచ్చి టీ నీళ్లు పల్చగా చేసుకుని గోరువెచ్చగా పుచ్చుకుంటారు; లేదా "బీరు" తాగుతారు. ఇంటికి యెవరైనా వచ్చినా ఇదే మర్యాద. మన హోటిగాళ్లం ఎవళ్లమయినా "మంచినీళ్ల"ని అడిగితే రోడ్డు ఒడ్డునఉన్న దుకాణంనుంచి తెప్పించి లెంజూసో ఆరెంజ్‌క్రష్షో మరేదో యిస్తారు. మంచినీళ్లు మాత్రం పుట్టవ్— ప్రత్యేకించీ అడిగితేనే గాని!

7. దేవాలయాలు

గుడి అనగానే ఓ కోవెలనీ అందులో ఓ దేవుడు ఉంటాడనీ టక్కున అర్థం అయిపోతుంది మనకి. కాని యిక్కడ అలా

క్కాడు. బౌద్ధదేవాలయాలు (పెగోడా లంటారు) క్వాచిత్కంగా ఉన్నా, ఊళ్లో పేరుమోసిన దేవాలయాలు మాత్రం అవి కావు. ఇక్కడ "లిటరరీ టెంపిల్స"ని ఉన్నాయి; యివి ముఖ్యంగా చైనీస్ లిటరరీ టెంపిల్సు. వీటిలో పురాతనపు చీనాగ్రంథకర్తలూ, వేదాంతులూ వారి బొమ్మలుంటాయి. గుడి లోకి వెళ్ళినవాడు ఊదొత్తులు వెలిగించి, పువ్వులు విగ్రహం కాళ్లదగ్గిర పెడతాడు. "నైవేద్యం" అనే మామూలు యిక్కడ ఏగుళ్లోనూ లేదు; దక్షిణ అంతకన్నాను! పదిమంది గుళ్లోకి ఒక్కసారిగా వెళ్లి ప్రార్థన చెయ్యడానికి వీల్లేదు. (గుడి చూడ్డానికి ఎంతమందైనా వెళ్లొచ్చు మళ్ళీను!) ఎవడి మట్టుకు వాడే - ఒకడితరవాత ఒకరుగా వెళ్లి - ప్రార్థన చెయ్యాలి. ఆడవాళ్ళు విగ్రహాలున్నచోటికి (గర్భగుడిలాంటిది) వెళ్ళడానికి యెంతమాత్రం వీల్లేదు. చుట్టు పక్కల ఆవరణలో తిరగవలసిందే బంతి పువ్వులు కోసుకుంటూనో, బాదంకాయలు ఏరుకుంటూనో! ఒకకుటుంబంగా నీ ప్రార్థన చేసుకోవాలంటే ముందర తండ్రి, ఆ తరవాత పెద్దకొడుకూ, ఆ పిమ్మట వాడితరవాత వాడూ యిలాగ వరసపంపిణీ. ఇంట్లోకూడా పదిమందీ ఒక్కసారి దేవుడిదగ్గిర నిలబడి నమస్కరించి పూజ చేసుకోవడానికి వీల్లేదు.

మనలాగే వీళ్ళూ నమస్కారం చేసి, చేతులు బొడ్డుదగ్గిరే ఉంచి బాహూ ముందుకి వొంగుతారు. నిటావుగానుంచుని యెవ్వడూ నమస్కరించడు - మనిషికయినాసరే, దేవాలయంలో నైనాసరే. వీళ్ళకి సాష్టాంగపడడం తెలియదు.

గుళ్ళో గంట వాయించరు. వాయించడానికి గంట ఉండదు. కొన్ని గుళ్ళల్లో పాతవి అంటే యెన్నోవందల సంవత్సరాల పాతగంటలు, జిలుగూ నగిషీ పనుల్తో ఉన్నాయిగాని అవి దేవాలయం ప్రాంగణం లోనే ఏ పక్కగానో ఉన్నాయి - కేవలం ప్రదర్శనార్థంన్నా. అంతేకాని చూరు నుంచి ఓ గంట వేలాడగట్టడం, గుళ్ళోకి వొచ్చిన ప్రతీవాడూ దాన్ని మోగించడఁవూ యిలాంటివి ఏఁవీ లేవు. కాగా గుడిలో ఎంతో నిశ్శబ్దంగా ఉండాలి. గుడి చూపించడానికీ, మనకి నాలుగు సంగతులూ బోధపరిచి చెప్పడానికి వొచ్చిన పెద్దమనుషుల సమేతం అంతా గుసగుసే. భక్తి తాత్పర్యాలతో వొచ్చినవాడు అసలు పెదిమ కదపడు!

గుళ్ళోకి వెళ్ళినప్పుడు జోళ్లు తీసెయ్య నక్కరేదు!

గుళ్ళో పూజారీ మనుషులూ అంతా చైనా వాళ్ళలా కనిపిస్తారు, ఆ మీసాలూ, ఆ తేలుడుకళ్ళూ, ఆ నల్లటికోటూ పాగా వీటితోను.

మనకి సంస్కృతంలాగ యిక్కడ చీనా భాషకి యెక్కువ మన్నన. దేవుడుగుళ్లల్లో పూజార్లూ వాళ్లూ చీనాభాషే ఉపయోగిస్తారు. ఆ రాతవేరు; దాని సిరావేరు. అచ్చు సిరాలాగ ఉంటుంది.

గుడి కట్టడంలోనూ, ఉంచడంలోనూ కూడా చీనాదేశపు పద్ధతే. అయితే మనలో లాగే వీళ్ళకీ మూలవిగ్రహాలూ, ఉత్సవ విగ్రహాలూ ఉంటాయి. ఉత్సవ విగ్రహాలు కర్రతో చేసి లక్కతో రంగులువేస్తారు. పర్వదినాల్లో వీటినే ఊరేగిస్తారు. దేవాలయంలో అసలు విగ్రహంముందు యీ ఉత్సవ విగ్రహాలని ఉంచుతారు. వాటికి యిటుపక్కా అటుపక్కా పెద్దనెమళ్లూ, కొంగలూ, హంసలూ ఉంటాయి - యిత్తడివీ, కంచువిన్నీ. పర్వదినాల్లో యివీ ఊరేగుతాయిట, ఉత్సవ విగ్రహాల్తోపాటు.

అసలు విగ్రహానికి గర్భగుడికి బదులుగా కర్రతో చేసిన యెత్తైన మండపం ఉంటుంది. దానిమీద చిలకలూ పలవల్లూ లక్కరంగు చిత్రాలూ కోవిల ఘనతకి తగిన సైజులో ఉంటాయి. లతల పువ్వులూ తీగెలూ అందంగా కళ లుట్టిపడుతూ కనిపిస్తాయి యీ పనివాటుతనంలో. వీటితో పాటు సర్వసాధారణంగా "డ్రేగన్" కూడా కనిపిస్తుంది యీ శిల్పంలో.

(ఇంకా వుంది)

ఉభయసంధ్యలు

సూరయ్య: అంతే. ఈ నిర్ణయానికి తిరుగు లేదు. ఇంతకంటే సులభమైనపద్ధతి కూడా లేదు. నాబాధలన్నీ యీ పూటతో ఆఖరయిపోతాయి. తండ్రిలేనిపిల్లలని, యే దయామయుడైనా ఆదరించవచ్చు. ఇప్పటికి రెండురోజులనుండీ ఆలోచిస్తున్నాను. నేను చనిపోవటంకంటే ఉత్తమమైనమార్గం తోచటంలేదు. ఇప్పుడందరూ నిద్రపోతున్నారు. ఈ చిటికెడువిషం నోటిలో వేసికొన్నానంటే...అంతా సమాప్తమవుతుంది. (గాద్గదికంగా) తండ్రీ, దేవదేవా! నన్నీ సంసారబాధలనుండి తప్పించుస్వామీ!

ధ్వని: (వికటమైన నవ్వు)

సూర: యెవరది...?...ఎవరక్కడ...? ...యెవ్వరూ పలకరేం...?...(మెల్లగా) అందరూ నిద్రపోయారనుకొన్నాను.

ధ్వని: నువ్వు పొగొట్టుకొన్నావే. తప్పేముంది...? నిజంగానే అందరూ నిద్రపోతున్నారు. నువ్వేమీ తప్పుగా ఊహించలేదు.

సూర: ఊహించాను. నిజంగానే నిద్రపోతుంటే, ఈ మేల్కొనివున్న నువ్వెవరు...? 'అందరూ' అన్నప్పుడు, ఆ అందరిలో నువ్వూ ఒకడివి కావా...?

ధ్వని: కాను.

సూర: అయినా యిబ్బందిలేదు. మీరు వెళ్ళిపొండి. అవతల నాకు చాలాపనివుంది.

ధ్వని: చావబోతూకూడా అబద్ధమాడతావేం...? నిజం చెప్పండి. అవతల మీకు నిజంగా చాలాపని వున్నదా...?

సూర: (ఆశ్చర్యంగా) ఏమిటీ? నేను చావబోతున్నానా? ఎవరు చెప్పారు నీకీ విషయం...? చావవలసినఅవసరం నాకేమీ లేదు. నేనెవరో తెలుసుకోకుండా మాట్లాడుతున్నారు. దయచేసి వెళ్ళండి. నాకు చాలాపని...

ధ్వని: మిమ్మల్నిగురించి విన్నానుగాని, మిమ్మల్ని ఎప్పుడు చూడలేదు; కాని నన్ను మీరు బాగా యెరుగుదురు.

సూర: నేనా? మిమ్మల్నా? భలేవారండీ మీరు. మిమ్మల్ని చూస్తుంటే నాకు, నా యౌవనపు రోజులు జ్ఞాపకమొస్తున్నాయి. ఆ కాలంలో నేనుకూడా - అచ్చం మీలాగానే మాట్లాడేవాణ్ణి.

ధ్వని: అట్లాగా....?

సూర: మెల్లిగాఅంటారేమిటి...? మీరు మల్లేనే ఒకే మాటను అనేకసార్లు...

ధ్వని: అయితే, నన్ను మీరు గుర్తుపట్టే కారు. ఐనా మీదగ్గర దాపరికమేమిటి?... మీ అనుమానం నిజమే. నేను మీ యౌవనాన్నే! అప్పట్లో నన్ను...

రావూరి భరద్వాజ

సూర: సూర్యం అని పిలిచేవాళ్లు నిన్ను. అవునా...?

సూర్యం: అవును. అందరూ 'సూర్యం'-'సూర్యం' అంటుంటే ఆ పేరుమీద నాకు చాలా అసహ్యమేసేది. కానీ, కమల— తన తీయని గొంతుతో 'సూర్యం' అని పిలిచిందాకా, ఆ పేరులోవున్న అందం నాకు స్ఫురించనేలేదు.

సూర: ఛస్! ఆ పేరు నాదగ్గర యెత్తకు. దాని ఊసు అంటే, నాకు అసహ్యమేస్తుంది. ఆ పేరుగల వాళ్లెవరు కనిపించినా చంపబుద్ధేస్తుంది యీనాటికీ...

సూర్యం: (బాధగా) నీకూ నాకూ మధ్య యెంత వ్యత్యాసమున్నది...? కాలం ఎంత విరుద్ధ మనస్తత్వాలుగల వ్యక్తులనుగా మనలను మార్చివేసింది. కమల! కమల!! నా జీవిత నందనోద్యానం సుగంధ సంభరితం చేసి, నన్ను, అనూహ్యానంద డోలికలలో ఉయ్యాల లూచింది.

సూర: అదంతా భ్రమ. ఓ అందమైన కల. నిద్ర మేలుకొన్నాను. కల కరిగిపోయింది. కఠినమైన జీవితం నన్నెదుర్కొన్నది. (నిట్టూర్చి) సూర్యం! అప్పుడే గనుక, నువ్వా కమలను ప్రేమించకుండా ఉన్నట్లయితే, నా బ్రతుకింత బ్రద్దలయ్యేది కాదు. నేనీవిధంగా ఆత్మహత్యకు సిద్ధపడేవాణ్ణి కాదు.

సూర్యం: ఆ విషయం కనుక్కుందామనే నేనూ వచ్చాను. నేననుకొనేవాణ్ణి గదా...ఈ ఆత్మహత్యలు ప్రపంచంలో యెందుకు జరుగుతున్నాయి...? జీవితంపట్ల, దానితోలూను అనుభవాలపట్ల యీ మానవు లెందుకింత పిరికివాళ్ళయ్యారు...? అమూల్యమయిన జీవితాన్ని, యేవో బాధలున్నాయని ఊహించుకొని—

సూర: ఊహించుకొనటం కాదు. ఏవో బాధలు అనుభవించి...—

సూర్యం: (వినిపించుకోకుండా) చేజేతులా ధ్వంసం చేసుకొనేవారికంటే నీచులు, అధములు యింకెవరుంటారా అనుకొనేవాణ్ణి. అల్లాంటి నేను—

సూర: ఈనాడు, పరిస్థితులకు దాసుణ్ణయి, యింతకంటే వేరేమార్గం లేక, చివరకు చనిపోదామని నిశ్చయించుకొన్నాను.

సూర్యం: యెంత తప్పు...?

సూర: (గంభీరంగా) యెంతమాత్రం కాదు.

సూర్యం: ఆత్మహత్య దోషం కాదా...?

సూర: ఒకవేళ దోషమే అయితే, అది నాదికాదు. అంతకంటే మరొక దోవ లేకుండాచేసిన నా పరిస్థితులదే ఆ దోషమంతా. నాకూ జీవించాలనే ఉంది. జీవితాన్ని అనుభవించాలనీ వుంది.

సూర్యం: అబద్ధం. ఆ ఉద్దేశ్యమున్నవాడెవడూ చావును కోరడు. అందుకోసం శతవిధాల ప్రయత్నిస్తాడు.

సూర: అవునుగదా! ఇంత ప్రయత్నాన్నీ త్రోసిరాజని, నేను చావటానికి సిద్ధపడుతున్నానంటే, నేనెంత దారుణంగా కాలం వెళ్ళదీస్తున్నానో ఆలోచించవేం...?

సూర్యం: (అపహాస్యంగా నవ్వి) ఈ

గాదని కమలవింటే, నీ పరిశీలనాన్ని అభినందించుకొనేది.

సూర: ఆ పేరెత్తవద్దని యింతకు ముందే చెప్పాను. ఇంకోకసారి యెత్తావంటే...! ...అదేమిటి అలా వెళ్ళిపోతావేం.

సూర్యం: నే నిక్కడా అట్టేసేపుండలేను.——

సూర: ఇదిగో రా! రా!

సూర్యం: కమలమీద నీ కింత కోపమెందుకు సూరయ్యా! ఆమె చేసిన తప్పేమిటి...! ప్రేమించటమా? ప్రేమించటమే మహాపరాధమయితే, తక్కిన నేరాలను ఊహించటానికి భాషే లేదే...!

సూర: యౌవనోన్మాదం, కాముకత్వం, శరీరవాంఛ ప్రేమకాదు. అది పశుత్వం.

సూర్యం: ఇవన్నీ కాని ఆ ప్రేమకంటే నీ టన్నిటితో కూడిన ఆ పశుత్వమే నేను కోరుతాను.

సూర: ఈ భ్రమలో నేపడి, బంగారం వంటి మేనరికాన్ని కాదన్నావు. పెద్ద చదువులేదు. డబ్బులేదు. 'ప్రేమ, ప్రేమ' అంటూ బైరాగిలా తిరిగావు. నీపని హాయిగానే గడిచిపోయింది దానిఫలితం నేనిప్పుడు అనుభవిస్తున్నాను.

సూర్యం: అదృష్టవంతుడివి. ఆ జ్ఞాపకాలతో కలకాలం మధురంగా జీవించవచ్చు.

సూర: ఛీ ఛీ...యిప్పటికీ నీకు జ్ఞానం రాలేదు.

సూర్యం: ఏమాత్రం అవకాశం లభించినా, ఇప్పుడైనాసరే, కమలతో నేనా విధంగానే ప్రవర్తిస్తాను. ఎందుకో నీ ముసలి హృదయానికి తెలీదు. దానికి రసికతను గ్రహించే శక్తి నశించిపోయింది. త్యాగంలోని ఆనందమేమిటో...నీ వట్టి హృదయానికి యెంత బోధించినా అర్థంకాదు. ఒకనాడు——

* * *

కమల: సూర్యం! యెందుకలా దిగులుగా వున్నావ్...!

సూర్యం: ఏమీ లేదు.

కమల. నిష్కారణంగా యెవరైనా దిగులుగా ఉంటారేమో నాకు తెలియదు.

సూర్యం: కారణం లేకపోలేదు కమలా...!

కమల: మరి - యేమీ లేదంటావేం...!

సూర్యం: ఉన్నా అది నువ్వు పరిష్కరించేదికాదు గనుక, యేమీ లేదన్నాను.

కమల: అయితే, అది కారణంకాదు. సమస్యయి ఉంటుంది.

సూర్యం: అదేమిటో? ... అట్లా యెందు కనుకొన్నావు కమలా...!

కమల: కారణం తెలుసుకొంటాం. సమస్యను పరిష్కరిస్తాం. మీరు పరిష్కరమన్నారు గనుక, అది సమస్యఅయివుంటుం దనుకొన్నాను.

సూర్యం: నిజమే. నాకది సమస్యగానే వుంది. ఏమి చెయ్యటానికీ తోచటం లేదు.

కమల: అది రహస్యం కాకపోతే —

సూర్యం: ఒకరకంగా కాదు. చెప్పటానికి నాకే సిగ్గుగా వుంది. మరేంలేదు కమలా! మా నాన్న నాకు సంబంధం కుదిర్చాడుట. పెళ్లివారు గురువారం వస్తారుట. నన్ను చూడటానికి రమ్మని ఉత్తరంరాశాడు.

కమల: ఇందులో దిగులు పడవలసిన సమస్యంటూ యేముంది సూర్యం. నిక్షేపంగా వెళ్ళి చూసిరండి.

సూర్యం: వెళ్లటానికి కాదు. అక్కడికి వెళ్ళినతరువాత, నేను కాదనటం, వారు 'ఊ' ననటం...నానాగొడవలూ జరుగుతా యేమోనని భయపడుతున్నాను.

కమల: అందుకని మీరు వెళ్ళటం మానేస్తారా...!

సూర్యం: మానేదామనే అనుకొంటున్నాను.

కమల: కనీసం...

సూర్యం: (నవ్వుతూ) నీకోసమనే నేను వెళ్లటం మానేస్తున్నాను. కమలా నేను వాళ్లకునచ్చి, ఆపిల్ల నాకునచ్చి, పుటుక్కున లగ్నం స్థిరపడితే?

కమల: నిశ్చయమే అయితే, నేను చాలా సంతోషిస్తాను సూర్యం.

సూర్యం: నిజంగానే సంతోషిస్తా అంటున్నావా కమలా...!

కమల: నేనెప్పుడైనా మీతో, అబద్ధ మాడానా...!

సూర్యం: ఈ విషయం విని, ఆశ్చర్యపడతావనుకొన్నాను. ఆ పెళ్లిచూపులకు వెళ్లవద్దంటావనుకొన్నాను.

కమల: ఇంతకాలం పరిచయం వుండీ కూడా - నన్నిట్లా అర్థం చేసుకొంటావా సూర్యం...!

సూర్యం: లేదు. ఇకముందైనా చేసుకోను. కానీ, నీలో యింతటిసహనం ఉంటుందనికూడా నేను ఊహించలేదు.

కమల: నేను నిన్ను ప్రేమించినట్లే, మరొకరుకూడా నిన్ను ప్రేమించకూడదా సూర్యం...? నిజమైన ప్రేమలో అసూయకు చోటు వుండదు. ఎక్కడయితేనేం? నువ్వు సుఖపడటమే నాకు కావాలి. నువ్వా సంబంధం చేసుకొంటేనే గానీ, సుఖపడవనే పక్షాన, నిరభ్యంతరంగా చేసుకో...

★ ఉభయ సంధ్యలు ★

సూర్యం: (గాద్గదికంగా) యింత మంచి దాన్ని, నిన్ను, కాదని—త్రోసిపుచ్చి, మరొకరిని పెళ్ళిచేసుకోలేను. భగవంతుడు కూడా మెచ్చడు.

కమల: మరి - యిలాగే వుండిపోతారా?

సూర్యం: ఊహూ...కమలను చేసుకొంటాను.

కమల: థాంక్స్. కానీ, కమల ఓ కులం లేనిదని మీకు తెలియదనుకొంటాను.

సూర్యం: ఇంతకాలం పరిచయంలో— కనీసం ఈవిషయమున్నా తెలుసుకోలేనంత మందమతిని కాను. నాకోసం నువ్వింతటి త్యాగం...—

కమల: ఇందులో త్యాగమేముంది సూర్యం. అథవా వున్నా, అది మనకోసమే గానీ, మరొకడికోసం గాదు.

సూర్యం: నా విషయం మీ నాన్నగారికి తెలుసా...?

కమల: తెలియవలసిన అవసరం లేదు. ఇది నా స్వవిషయం. ఇందులో మా నాన్నగారి జోక్యమేమీ లేదు.

సూర్యం: ఆయన యిష్టానిష్టాలను కనుక్కోవద్దా...?

కమల: నా యిష్టాన్ని ఆయన గౌరవించనప్పుడు, ఆయనగారి యిష్టాన్ని నేను మట్టుకు యెందుకు గౌరవించాలి సూర్యం..?

సూర్యం: మరి పెద్దవాళ్ళని ఉన్నతరువాత...?

కమల: నాకోసం ఆయనగారే ఆలోచించి, నాకోసం ఆయనగారే భోజనం చేసి, ఆయనగారే గుడ్డకట్టుకొని, ఆయనగారే చదివేస్తే - యిక నేనెందుకు...? నేను యెక్కడ మిగులుతాను...?

సూర్యం: నీలాంటి అమూల్యవరాన్ని నేను పోగొట్టుకోలేను. ఈ ప్రపంచమంతా యేకమైకాదన్నా, నేను నిన్ను విడిచిపెట్టను కమలా! లోకంలో చాలామంది సూర్యములున్నాడు. కానీ, కమలమట్టుకు ఒక్కతే సుమా! నిన్ను నా హృదయంలో భద్రంగా దాచుకొంటాను - పద.

కమల: కృతజ్ఞురాలను సూర్యం.

*　　*　　*

సూర్యం: అన్నది. చాలామంది నన్ను గురించి దుష్ప్రచారం చేశారు. నాన్నగారికి ఉత్తరాలు రాశారు. వాళ్ళధోరణి చూస్తుంటే, నేనేదో మహాపకారం వాళ్ళకు చేసినట్లుంది. కమల యీసంగతులేమీ పట్టించుకొనేదికాదు. ఎందుకైనా మంచిదని, నేనే బలవంతాన కమలతోసహా ఆ ఊరు వదిలేశాను. కొంతకాలంపాటు, జీవితాన్ని మహోజ్వలంగా అనుభవించాను. నా జీవితంలో యెక్కడైనా ఉత్తమాధ్యాయం ఉంటే, ఆ కొంతకాలమే. మిగతాది వట్టి పత్ర.

సూర: అని నువ్వనుకొంటున్నావు. కానీ, ఆ 'కొంతకాల'మే నా బ్రతుకును తునాతునకలు చేసింది. ఆ చరిత్ర అందరికీ తెలిసింది. మేనమామ పిల్లనివ్వనని తెగేసి చెప్పాడు. యాభైవేల రూపాయల ఆస్తి చేజారిపోయింది.

సూర్యం: అందుకు నువ్వు విచారిస్తున్నావనుకొంటున్నాను. నీ మాటలుబట్టి చూస్తుంటే - పెళ్ళి చేసుకోవటమునేది, పిల్లనుకాక, ఆ డబ్బునే మోహ వనిపిస్తుంది.

సూర: అంత డబ్బే వుంటే, నాకీ బాధలుండేవేకావు. తెలుసా...?

సూర్యం: ఈ బాధలు పడటానికైనా నేను వొప్పుకొంటానుగాని, ఆ పిల్లను మట్టుకు పెళ్ళాడేందుకు ఒప్పుకోను. ఇష్టంలేని వివాహం చేసుకొని, సంసారం వెలగబెట్టటమంటే, యెంతదోషమో నీకు తెలిసినట్టు లేదు.

సూర: లక్షమంది దాన్ని అంగీకరిస్తారు.

సూర్యం: పదిలక్షలమంది అంగీకరించినా దోషం దోషమే కానీ, మరొకటి కాదు. అంతమంది తప్పు అంటున్నారు గనుక ఒక ఒప్పు యెప్పుడూ తప్పుకాదు. తెలియక వాళ్లు అనవచ్చు. పదిమంది పిచ్చివాళ్ళు, సూర్యుడు చల్లగా వున్నాడంటే, నువ్వు ఔనంటావా?

సూర: అంటే నేను పిచ్చివాణ్ణే అవుతాను.

సూర్యం: అవునుగదా. మరి యెవరో లక్షమంది దాన్ని అంగీకరిస్తారని నాతో వాదిస్తావేం...?

సూర: ఈ తలబిరుసుతనమే నన్ను నిలువునా ఆర్పింది. ఇప్పటికైనా వదిలిపోవేం...?

సూర్యం: పిచ్చివాడా, నే నేనాడో పోయాను. అసలు నీబాధంతా నేను నీదగ్గర లేనసే అల్లా మూలమూలకు వొదిగినంత మాత్రంచేత, ముసుగులో మూల్గినంతమాత్రంచేత నాకు దూరం కాలేవు. నన్ను స్మరించుకుంటూ బ్రతకడం నేర్చుకుంటే గాని నీకు శాంతి లేదు.

సూర: ఆగు ఆగు వెళ్ళిపోతావేం?

సూర్యం: నేను వెడితే తిరిగి రాను.

సూర: పోతే పో...

సూర్యం: నేను లేకుండా నువ్వు లేవు.

సూర: నీ లేకుండా నువ్వు మాత్రం ఉంటావా?

సూర్యం: తప్పకుండా వుండగలను. కాని నీలాగే సగం సగం బ్రతుకు.

సూర: అరెరే వెళ్ళిపోయాడు. ఇదిగో విన్నో ఉండు.

సూర్యం: (నవ్వుతాడు) నే నెక్కడా అక్కడే వుండనని చెప్పలా?—

సూర: ఇదేమిటి చల్లగా వుంది. చలేస్తుంది. హాయిగా కప్పుకుని పడుంటాను.

సూర్యం: అదా అది నా నీడ. చల్లగా స్మరించుకుంటూ వెచ్చగా పడుకో. ★

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

నవలా రచనలో పోటీ

బహుమతి రు. 250

రచనలు చేరవలసిన ఆఖరు తేదీ

ఫిబ్రవరి 1, 1955

తెలుగులో నవలారచనను ప్రోత్సహించడానికిగాను ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక నవలా రచనలో పోటీ నెలకొల్పుతున్నది. పోటీకి వచ్చే నవలల్లో ఉత్తమ రచనకు రు 250/- బహుమతి ఇవ్వబడుతుంది.

పోటీ సందర్భంలో రచయితలు ఈ క్రింది వివరాలను గమనించ కోరుతున్నాము.

* రచన వారపత్రికలో 80 లేక 90 పేజీలకు మించకూడదు. రచన, కథ స్వతంత్రమైనవైఉండాలి.

* నవల తెలుగుదేశంలో సామాన్య కుటుంబ జీవితానికి సంబంధించినదై ఉండాలి.


* రచనలు మా కార్యాలయానికి ఫిబ్రవరి 1, 1955 తేదీలోగా అందేటట్లు పంపాలి.

* ఈ పోటీకి పంపే రచనలకు రేపర్ పైనా, రచన మొదటి పుటలోనూ కూడా స్పష్టంగా "ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక నవలారచన పోటీకి" అని వ్రాసి పంపాలి. ఈ రచనలను, "ఎడిటర్, ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక, మద్రాసు 1." చిరునామాకు పంపాలి. రచనలు అందినట్లు తిరుగు జవాబు కోరేవారు రిజిష్టర్డ్ బుక్ పోస్టు (ఎక్నాలెడ్జిమెంట్ డ్యూ) లో పంపవచ్చును. లేదా రచనతో బాటు తమ స్వంత చిరునామాకల కార్డు జతపరిచి పంపాలి.

* బహుమతి పొందిన నవలను సీరియల్‌గా ప్రచురించే హక్కు ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రికకే ఉంటుంది. పోటీ ఫలితం మార్చి మూడోవారం వారపత్రికలో ప్రకటించబడుతుంది.

* పోటీకిగాని, ప్రచురణకుగాని స్వీకరించబడని రచనలను త్రిప్పి పంపడానికిగాను రచయితలు తమ రచనలతోబాటే అవసరమైన స్టాంపులు జతపరిచి పంపాలి. లేదా స్టాంపులు అంటించిన స్వంత చిరునామా వ్రాసిన పెద్ద కవరు పంపడం మంచిది.

* బహుమతిగురించిన తుది నిర్ణయాధికారం సంపాదకులకే ఉంటుంది.



పనగల్లుదాటి ఒడ్లపొంటబడి ఉరుకుతా వుండు మల్లిగాడు. అనయ్య ఆ వెంటబడి తిరుముతుండు. ఒడ్లపంటబడి ఉరుకుడా పెద్దమనిషికి చాతగాలేదు. ఏడ జారి పొలం బురుదలబడ్డనో అని బుగులుపడ్డ అయ్య, ఒక పెద్ద దమ్ముదీసుకోని ఎనుకకు మల్లిండు. "ఇగ దొరకనే దొరకవా?" అని కీకపెట్టు దూరానున్న కొడుక్కు ఇనబడేటంత పెద్దగ కీకవెట్టిండు. పొలం చుట్టు తిరిగి బాని కొనాకు జేరిండు పెద్దమనిషి. గెట్లపొంట ఉరికీ ఉరికీ అడివికే చేరినడు మల్లిగాడు. 'దొరికితివిరా' అన్న అయ్య అంకె ఇనంగనే పక్కకున్న మోటబాయిల ఒక్కదుంకు దుంకిండు మల్లిగాడు. అయ్యకు మల్ల చెమటలు బుట్టినయి. గొంతె తగ్గిండు పెద్దమనిసి. "ఎందుకు తిప్పలు పెడతవురా, ఇంటికాడ మీ అవ్వ గోడుగోడున ఏడుస్తుంది. బుక్కెడంత దినిపోదువురా" అని బతిలాడిండు. "చాతనైతె ఊకుంచుపో, అవ్వ నామీదజేసుకుంటదా నీమీదనా!" అని బుడుంగున మునిగిండు. పెద్దమనిసి నోరు తెరవలె. పెన్నాన్ని కుంట చాతగాకోడు కొడుకు కోసం అడ్డునబెడుడు. తిరిగీతిరిగీ కడుపుల గాత్రె ఆకే వత్తడు ఇంటికి. అనుకోని ఎనుకకు మల్లిండు. పనులు పాడుజేసుకోని అని కోసం ఎంతకని దిరుగుతడు. కొడుకుతె పోకిర్లగొట్టాన్నన్నంత కోపం వస్తుంది. వానెవ్వు లేదు. తనంటె చొప్పదెండు కంటె అల్కనాయె ... అని రోగం అజీ తిరుగుడ్తి. దానికోగం గూడ దేతిరుగుడ్తి. ఏడ్చేడిచి అటే ఊకుంటది. పోరడెక్కవా తనాకి బతిలాడి ఊకుండే అంటె యాడూరుకుంటది. అడ్డమైన తిట్లన్ని తననే తిడ్తది. పోరన్ని జాత్తెనే తనక్కన్నతుంటవట. అడు తనకుమాత్రం కొడుగ్గాకపాయెనా? అని మంచికోసమేనాయె తను అన్ని గోస్పడ్తది. తనను తన మంచికోసం తనయ్య ఎన్ని దెబ్బలు గొట్టలే. అన్న సగం దెబ్బలన్న బడ్డయా తన కొడుకుమీద. ఇట్ల ఏందేందో ఆలోచిచ్చుకుంట తన పనిమీద తాను పోయిండు.

నిన్న మల్లిగాడు సోపకొట్టి, గుట్టమీదికి పోయిండు. తనొక్కడే పోయిండా తన సోపతిగాన్లెంతమంది రాలేదు! అల్లం దరిని అల్లయ్యలు గిట్ల కొడుతుంరా? కోజానోయే సోపల కొగనాడు పోకపోతేం గాదు. గుట్టమీదికి కోజా పోతడు గను కవా? ఏడాదికి ఒక్కనాడు బక్కరెండు నాల్లు. పొద్దెక్కి బోవుకుంట తాతీలున్నవాడు బోతేందంటడు అల్లయ్య. తాతీలున్నవాడు గోటీలు బొంగరాలేంగావాలె. తాతీల్లు ఆడుకునుటానికి తరుగని గుట్టమీదికి బోవుటానికి రాకె? గుట్టమీదినుంచి రాంగనే ఈవు బగుల్తదేమోననుకున్నడు మల్లిగాడు. బుగులు పడుకుంటనే ఇంట్ల కాలువెట్టిండు. ఆయాల్లకు అల్లయ్య ఇంట్లలేడు. అవ్వ దగ్గరికిపోయి, అవ్వ చెట్టె చుట్టుకోని తలె ముంగలకూకున్నడు. అవ్వగూడ గోస్పడ్డది. అయ్యవచ్చేటాల్లకు గుట్టమీదికి పోయినందుకు అయ్య రెండు కొడుగానో మల్లిగాన్కి మనసు కెక్కలే. అయ్య సంపాయించందే అల్లకొక్కడాడికెల్లిపోతది. అందుకని అయ్య జెప్పినట్టినా అన్నడి అల్లవ్వ. అల్లయ్య అయినెను వెట్టిండు అయినె తనకు వెట్టిండు. తాను బుక్కె

ముందు గిన తనతోటి తనయ్య కరాయనాను గిన రాయించుకున్నడా. కన్నందుకు తెకుతుండు......అల్లయ్య తన మంచికోసమే చెపుతుండట. అందుకని అయినె జెప్పినట్టినా నాన్నన్నది అల్లవ్వ. తన మంచికోసం జెపుతె తానుమాత్రం ఎందుకినడు. చిన్నప్పుడు తన మంచికోసం తనను సోపలకు పోమ్మన్నడు. తను పోతలేడా! తన మంచి తనకు దెల్వదా?...బుక్కెడంత దిని సోపలకు పోదామనుకుంటనే వుండు. ఇంతల యాన్నుంచో రానే వచ్చిండానయ్య. బుక్కెడు నోట్ల పెట్టుకున్నడో లేదో 'ఎక్కడ లోపట' అని అయ్య అంకె యినపడ్డది. తాను బువ్వదింటున్న సంగతి దెల్వంగనే 'అన్నియ్యల్ల ఎండెబ్బు బువ్వత్తది.' అని ఒక్క అరుపరిసెటాల్లకు మల్లిగాడు ఒక్క గంతేసి దిడ్డిగుంట అటల బడ్డడు.

అన్నుంచి అల్లయ్యను ఉరికిచ్చి, ఉరికిచ్చి తా నురికీ వురికీ అయ్య నలిపిచ్చిండు. బాయిలనుంచీ గడ్డెక్కి, తడిసిన బట్టలుతు కొన్ని పిండుకోని తడి బట్టలే తొడుక్కున్నడు. పెయిమీదియ్యి ఎండుతయి. అటూ ఇటూ చేసన్నా చెల్కల్ల పడి తిరిగిండు. దోసచేన్ల పడి నాల్గు దోసకాయలు దెంపుక తిన్నడు కడుపుల గాత్రె. ఇగేం జెయ్యాలె. ఏంపని దోసతే మల్లిగానికి. మల్ల గుట్టమీదికి పోదామనుకున్నడు. నిన్నంటె సోపతిగాన్లతోటి పాయె ఇయ్యాల్టి తేమున్నది గుట్టమీద. పిల్లబాటపొంటి బాటెటుపోతె అటు దారిపట్టిండు. ఒక చింతచెట్టుకింద పచ్చగడ్డిమీద పండి గొడి పేవు కన్నుమూసి కునుకుదీసిండు. ఎండ మొత్తిమీద కెక్కింది. కన్ను నలుసుకోని లేసి సూసిండు. మల్ల బయిలెల్లిండు. నడిదారి పొన్న జెగమెరుసుకుంట ఏందో కోకతి దొస్సు పాము బారుతుంది. మల్లిగానికి చల్ల చెమటలు పోసినయి. దండం పెట్టె పాము పారిపోద్దని కతలిన్నడు మల్లిగాడు. రెండు చేతులు జోడిచ్చి దండం పెట్టవోయిండు. చేతులు రాలే. పాము తన దారిన తాను పోయింది. మల్లిగా డనుకున్నడు. తాను దండం పెట్టినందుకే పాం తనను దయదలచి పారిపోయిందని. తను మనుసుల దండం పెట్టాలని అనుకున్న సంగతిగూడ పాముకు దెలిసింది. రేపు పొద్దుగాల నాగమయ్య గుల్లెకు పోయి దండం పెట్టాలనుకున్నడు. మల్ల కాల్లు ఆడిచ్చిండు. నడుత్తా వుండు దూపయితుంది. ఎండల ఏడ పీల్లున్నదో ఎరుక లేదు. అటీటు మోట బాయిలన్న లేవు. పక్క పొంట ఒక ఒర్రె బారుతుంది. పోయి కడుపునిండ నీలుదాగిండు. పక్కపొన్న వున్న గుండుమీద కూకుండి అలసట దీర్చుకుంటుండు. గుండు దొర్లింది. పక్కకు ఉసికెల పడ్డడు. గుండుకింద ఒక బూరుదేలు విర్రురవోతుంది. పక్కకున్న రాయి దీసికోని దానిమీద ఇసిరిండు. తేలు నజ్జునజ్జయింది. ఒర్రెపిల్లు బోలోలిగ లావు కమ్ముకున్నయి. ఘుల్లబుక్కెడు నీలుదాగుతామని ఒర్రెల చెయిపెట్టిండు. నీరుకట్టె తలకాయి లాదెటుకోకని ఈదుకుంట వస్తుంది. రాయిదీసుకోని దాని తలకాయమీద వాటంగ గొట్టిండు. దచ్చింది. తోక గొల్లకోని కొల్లకోని దాన్ని దీసి గట్టుకు బారేసిండు. నడెక సాగిచ్చిండు. తన కాల్లు తనకు దెల్వకుంటనే ఊల్లెకు దీసుకపాయినయి. ఊల్లెకు పోంగనే సోపయాది కచ్చింది. సోపతి పిలగాన్లతోటి పోయి ఆడుకుందామనుకున్నడు. గునగున సోపలు కురికిండు. పంతులు లేడు పిలగాండ్లందరు చెట్లకు నీల్లవోత్తుండు. పొద్దుట్నుంచి

(49-వ పేజీ చూడండి)



పెద్దకథ

సుగుణ

జి. సి. రామకృష్ణ

10

సుధాకర్, స్కూల్ ఫైనల్ పరీక్ష పాసయాడని తెలియంగానే, అందరూ ఆనందంలో తన్మయులైపోయారు శేషమ్మ, చుట్టుపక్కల వాళ్ళతో చెప్పి, చెప్పి సంతోషించింది.

"అక్కయ్యా, నీకేం భయం లేదు నేను, మద్రాసు పోయి, సినిమాల్లో చేరి డబ్బు సంపాదించి పారేస్తా బాగా కట్నం ఇచ్చి మంచి చదువుకున్న వాణ్ణి తీసుకొచ్చి నీకు పెళ్ళిచేస్తా నీకేమీ దిగులుపడాల్సిన అవసరమే లేదు" అన్నాడు సుధాకర్ సుగుణ పిచ్చినవ్వు నవ్వింది

పోస్టు జవాను వచ్చి, ఒక జాబు ఇచ్చి వెళ్ళాడు సుధాకర్, ఉత్సాహంతో తల ఊపుతూ, జాబు చించి చదివాడు.

"ప్రియమైన బావగారికి చంద్రం నమస్కారములు—మీరందరు క్షేమంగా ఉన్నారని నమ్ముతున్నాను నన్ను రెండు నెలల క్రిందట అరెస్టుచేసి జైల్లో పెట్టారు. పోలీసు హింసలు చెప్పుకుని, నాయకులెక్కడున్నారో చెప్పమని చాలా బాధలు పెట్టారు లాఠీలతో ఒళ్ళంతా కుళ్ళబొడిచారు గోళ్ళలో గుండుసూదులు దిగగొట్టారు అన్నీ సహించాను ఫలితం శరీరం నాశనం అయిపోయింది గుండె, ఊపిరితిత్తులు, పూర్తిగా చెడిపోయాయి ఇక నేనెందుకూ పనికిరానని తెలుసుకొని వదలిపెట్టారు కొంతమంది స్నేహితుల సహాయంతో మదనపల్లి ఆస్పత్రికి చేరాను మీరు నాకోసం దిగులుపడాల్సిన అవసరం ఏమీ లేదు - బావా, సుగుణకు పెళ్ళి చేశావా? ఇంకా లేదా? మీరు ఆమె పెళ్ళి సంగతి ఎప్పుడూ నాదగ్గర హెచ్చరించనే లేదు కానీ నాకుమాత్రం ఆమెను పెళ్ళి చేసుకోవాలనే దురాశ మనసులో ఉండేది అక్కయ్యగూడా నన్ను ఆ సంగతి అడగనేలేదు పోనీలే, వాళ్ళకి ఇష్టంలేదు కాబోలు, అనుకున్నాను జరిగిపోయిన దానికి నేనేమీ చింతించటంలేదు. ఎందుకంటే, నన్ను పెళ్ళిచేసుకొని ఆమె సుఖపడేది ఏమీ ఉండదని నాకు బాగా తెలుసు అందువల్లే నేనుకూడా ఆ సంగతి మీతో అనలేదు.

"సుధాకరుణ్ణి ఏదైనా ఉద్యోగంలో చేర్పించు అనవసరంగా డబ్బు [illegible]పెట్టి చదివించటమే తప్ప, ఏమీ లాభం [illegible].

"వెంటనే జాబురాయి అక్కయ్యా, సుగుణా, అడిగానని చెప్పండి.—

మీ, చంద్రం."

సుగుణ చెరగులో ముఖం దాచుకొని గిజగిజలాడుతూ దిక్కులేని పక్షిలాగా విలపించింది. సుధాకర్ దుఃఖాన్ని దిగమ్రింగటానికోసం పెదవులు పంటితో కొరుక్కుంటూ, గుటకలు వేస్తూ తల్లిదగ్గరికి వెళ్ళి మళ్ళి ఒకసారి జాబు చదివి వినిపించాడు

సుధాకర్ జాబు చదువుతూంటే, ఒక్కొక్క మాట ఒక్కొక్క బాణంలాగా తగిలి, శేషమ్మ దుఃఖంతో క్రుంగిపోయింది

రాఘవయ్యగారు ఆఫీసునుంచి ఇంటికొచ్చి, జాబు జూచి, ఒక మూల కళ్ళు తుడుచుకొని, కూనిరాగంలోకి శూన్యంలోకి చూస్తూ కూచున్నాడు.

చంద్రం "బావా, బావా" అని వినయంతో మాట్లాడుతూంటే, ఆ రెండు

★ సుగుణ ★

అక్షరాల్లో, ఏదో అర్థంకాని అపారమైన అనురాగం, ఉట్టిపడుతూండేది. ఇంతా చూస్తే, చంద్రం, రాఘవయ్య భార్యకు, తమ్ముడు. కానీ బావమరదుల మధ్య, ఇద్దరికీ తెలియకుండానే అపారమైన ప్రేమ గౌరవాలు ఏర్పడ్డాయి. ఎంత అణుచుకొన్నా రాఘవయ్యకు ఆవేదన అణగలేదు.

"వద్దురా నీకీ రాజకీయాలు, అని నేను కొత్తిన నోరుపెట్టుకొని కొట్టుకున్నాను. వాతేమైనా విన్నాడా? కాంగ్రెసులో చేరి సత్యాగ్రహాలుచేసి, జైళ్ళలో మ్రగ్గిపోయాడు. స్వరాజ్యం వచ్చింది గదా, ఊరుకోగూడదూ? మళ్లీ కమ్యూనిస్టు పార్టీలో చేరడం ఎందుకు? గవర్నమెంటుతో జగడం పెట్టుకోవడం ఎందుకు? ఆఖరికి వాడి సంగతి అనుకొనేవాళ్లు ఒక్కరైనా ఉన్నారా? వాడి జీవితం అగచాట్ల జీవితం అయిపోయింది" అని చెమ్మగిలిన కళ్ళను రాఘవయ్య తుడుచుకొన్నాడు. వెంటనే జాబు రాశాడు. డబ్బుకు చాలా యిబ్బందిగా ఉందనీ, పదిరోజుల్లో మదనపల్లి వస్తాననీ రాశాడు.

చంద్రం మామయ్య రాసిన జాబు సుగుణ భద్రంగా దాచిపెట్టుకుంది. సుధాకరుడిచేత ఒక కవరు తెప్పించుకొని జాబు వ్రాయడానికి కూచుంది.

"ప్రియమైన మామగారికి సుగుణ నమస్కారములు. మామయ్యా, నీ జాబు చూచి నేను [illegible] సంతోషించాను. నీకు నామీద నిజంగా ఇష్టం ఉంటే, నాతో ఎందుకు చెప్పకూడదు? ఎందుకు మామయ్యా ఈ దొంగ మాటలు? నాకు తెలుసులే ఈ కుంటి దాన్ని చూస్తే, నీకు ప్రేమ ఎలా కలుగుతుంది చెప్పు?

"నేను నీమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. నాకు పెళ్ళి చేయలేక, అమ్మా, నాన్నా అష్టకష్టాలు పడుతుంటే, నీవు ఏమీ పట్టనట్లు తిరిగావు. ఇంటికి రావటం కూడా మానేశావు. పెద్దవాడివయితే అయ్యావు. నన్ను పెళ్ళిచేసుకొని, మా అమ్మకూ నాన్నకూ బరువు తొలగిస్తావు గదా అనుకొన్నాను. కాని నీవు నా మాటే తల్చుకోలేదు. నీఅంత కఠిన హృదయుడు లోకంలో ఇంకెవరైనా ఉంటాడా? నీవు మాత్రం, బాగుపడిం దేముంది? దేశాన్ని ఉద్ధరించాలని చదువు ముగించుకొని జైళ్లకు పోయి మగ్గిపోయావు. స్వరాజ్యం వచ్చిన తర్వాత ఊరుకోకుండా అందరి కష్టాలూ పోగొడతానని బడాయిలుకొట్టి, అవస్థల పాలయ్యావు. నేను నిన్ను దేవుడితో సమానంగా నాహృదయంలో ఆరాధించుకొన్నాను. ఒక ఆడదానిమనసు అర్థం చేసుకోలేనిమగవాడు మనిషేనా? ఒక అమాయకురాల్ని అన్యాయంచేస్తే దేవుడు మాత్రం ఊరుకుంటాడా? నాకూ ఈ లోకంలో బతకాలని ఆశలేదు. నీవు మళ్ళీ జాబు రాయవద్దు.

నీ సుగుణ."

వణికేట చెరగుతో కన్నీరు తుడుచుకొని, బుసలు కొడుతూ, అమ్మ చూస్తుందేమోనని జాబు గబగబా మడిచి, కవరులో పెట్టి సుధాకరుడిచేతికిచ్చి పోస్టులో వేసి రమ్మంది.

సుధాకర్ కవరుపైన అడ్రసుచూచి ఆశ్చర్యపడి, పోస్టాఫీసుకుపోయి, జాబు జాగ్రత్తగాతీసి చదివి, విచారంతో మళ్ళీ జాబు కవరులో పెట్టి, అంటించాడు. జాబు పోస్టులో వేస్తామా, వద్దా అని అలాగే నిల్చొని చాలాసేపు ఆలోచించాడు. చివరికి అక్కయ్యను మోసం చెయ్యడం ఇష్టంలేక, జాబు తపాలువ పెట్టెలో పడేశాడు. కాని ఇంటికి తిరిగి వస్తుంటే, "జాబు పోస్టులో వెయ్యకుండా ఉంటేనే బాగుండేదే" అనిపించిం దతనికి. జాబు చదివి మామయ్య ఎంత కష్టపడతాడో; అసలే ఇంతకుముందు రాసినజాబు చాలా దిగుల్తో రాశాడు; అని సుధాకర్ ఆలోచిస్తూ ఇంటికి చేరి, మనసు ఉండబట్టక, అమ్మ దగ్గరికివెళ్లి "అమ్మా, అక్కయ్య చంద్రం మామయ్యకు జాబు రాసింది" అని గుసగుస చెప్పాడు. శేషమ్మ అదిరిపడి "ఏమని రాసింది" అని ఆసక్తితో అడిగింది.

"మామయ్యా, నీవు వట్టి దుర్మార్గుడివి. నన్ను పెళ్ళిచేసుకోలేదు. కాబట్టే నీకు దేవుడు తగిన శిక్ష వేశాడు." అని ఏమేమో కోపంగా రాసేసింది" అన్నాడు సుధాకర్. శేషమ్మకు ఒళ్లు జల్లుమంది. కొంతసేపు కళ్లు చీకట్లు కమ్మాయి. ఆమె జాగ్రదవస్థలోకి వచ్చాక సుగుణదగ్గరికి వచ్చి, "ఏమిటే సుగుణా! వాడొక పక్క జబ్బుతో బాధపడడమేమిటి? నీవు చీవాట్లు పెడుతూ జాబు రాయడం ఏమిటి?" అని జాలిగా అడిగింది. సుగుణ మూగదానిలా కూచుంది.

సుగుణ జాబు రాసినసంగతి రాఘవయ్యగారికికూడా కొన్నాళ్లకు తెలిసింది.

"ఇన్నాళ్లు దానిమనసు గ్రహించలేకపోయాను. చంద్రం చాలా పెద్దవాడు గదా, వాడికి ఈ దెక్కడవుతుంది, అనుకున్నాను. అదీగాక వాడు స్థిమితంగా ఉంటేగా! జైళ్లకు పోనూ రానూ సరిపోయింది వాడి జీవితం కాస్తా. ఏంచేసేది తల్లీ! ఈ దరిద్రుడి కడుపునపుట్టి మీరిన్ని బాధలు పడాల్సొచ్చింది" అని గద్గద స్వరంతో అన్నాడు. వకీలుగారిదగ్గరకు వెళ్లి, కాళ్లా వేళ్లా పడి, యాభైరూపాయలు బదులు తీసుకొని మరునాడే మదనపల్లి ప్రయాణమై వెళ్లాడు.

11

నాన్న తిరిగి ఎప్పుడొస్తాడా అని కళ్లు కాయలు కాచేట్లు చూస్తూ

కూచుంది సుగుణ. రెండురోజులకి నాన్న తిరిగివచ్చాడు. ప్రయాణపు బడలిక వల్ల పిచ్చివాడుగా మారిపోయాడు నాన్న. రాఘవయ్య ఇంట్లోకి రాగానే, అందరూ ఆత్రుతతో ఎదురుగా వచ్చి నిలబడ్డారు. సుధాకర్ అందరికంటె ముందుకివచ్చి "మామయ్య ఎలా ఉన్నాడు నాన్నా? అక్కయ్య రాసినజాబు చదువుకొని ఏమన్నాడు?" అని అడిగాడు. రాఘవయ్యగారు కుర్చీ మంచంలో కూలబడ్డాడు. సుధాకర్ కళ్లలోకి పిచ్చిగా చూస్తూ వాడిని దగ్గరికి తీసుకొన్నాడు. "ఏమిటండీ?" అని శేషమ్మ గిజగిజ లాడుతూ అడిగింది.

"ఏముంది? అన్నీ అయిపోయాయి. వాణ్ణి చూచే ప్రాప్తికూడా లేకుండా పోయింది." అని కన్నీరు పంచెతో తుడుచుకొన్నాడు.

ఒక్క క్షణంలో ఆ యిల్లు ఒక దుఃఖ సాగరంలో మునిగిపోయింది.

రాఘవయ్య దుఃఖాన్ని కొంతసేపు ఆపుకొని, చేబులోంచి ఒక కాగితంతీసి,

"ప్రాణంపోయిన తర్వాత చూస్తే, ఈ జాబు వాడి గుండెలపైన ఉందట" అని కిందపడేశాడు. అది సుగుణ చంద్రానికి రాసిన జాబు.

సుగుణ ఒక్కసారి తలెత్తి ఆ కాగితం చేతిలోకి తీసుకొని వలవలఏడుస్తూ తల వంచుకొని, తనను భూమిలోకి తీసుకొనిపొమ్మని భూదేవిని ప్రార్థిస్తున్నట్లుగా తల నేలకేసి కొట్టుకొంది.

శేషమ్మ తిటాలున కూతురి తల పట్టుకొని కౌగలించుకొని, దిక్కులేని దానిలాగా గిజగిజలాడి పోయింది

ఇల్లంతా జనంతో నిండిపోయింది. పక్కింటివాళ్లూ, రాఘవయ్య స్నేహితులూ, వచ్చి విచారించి, ఓదార్చి వెళ్ళిపోయారు...

"అయ్యో పాపం!" అన్నారు కొందరు.

"ఆ బడుద్దాయి కమ్యూనిస్టుపార్టీలో చేరి విచ్చలవిడిగా తిరిగి అరెస్టయాడు. బావగొట్టి చెవులు మూసి జైల్లో వేశారు. జబ్బుచేసి చచ్చిపోయాడు" అని ఇంట్లో నుంచి బయటికొచ్చి కొంతమంది మర్యాదస్తులు అనుకొన్నారు.

12

చంద్రం ఈ లోకంనించి, నిష్క్రమించాడని అక్కగారికి బెజవాడకు జాబు రాశాడు రాఘవయ్య.

రంగమ్మ వచ్చి అందరి ముఖాలు చూచి, "అయ్యో, ఇలా అయిపోయారేమే?" అని విచారించింది. అందరినీ ఓదార్చడానికి ప్రయత్నించింది. ఓదార్చేవాళ్లుంటే దుఃఖం గట్లు తెగిపొంగుతుంది. ఒదార్చేవాళ్లు లేకపోతే మనిషి మనోవ్యథతో కృశించిపోతాడు. దుఃఖం మానవులకు శత్రువు.

"చిన్నప్పుడే తల్లీ, తండ్రీ చచ్చారు. ఇక అడిగేవాళ్లెవరూ లేరని యిష్టం వచ్చినట్లు తిరిగాడు. బతికినన్నాళ్లు, జైళ్ళలో అవస్థలుపడి, అన్యాయం అయిపోయాడు. ఆఖరుకు వంశం నిలబెట్టే దిక్కు లేకుండా చేసిపోయాడు" అని శేషమ్మ ఆక్రోశించింది.

"సుగుణ రాసిన జాబు వాడి చేతుల్లో ఉందట" అని నాన్న పలికినమాట, సుగుణ హృదయంలో శాశ్వతమైన గాయమై నిల్చిపోయింది.

"జాబు చదువుకొని ఏమనుకొన్నాడో, ఎంత బాధపడ్డాడో. పాపిష్టిదాన్ని కోపం అంతా వెళ్లబోస్తూ ఏమేమో రాశాను. ఆజాబు చదివి, ఆ వేదన భరించలేక మామయ్యకు గుండె ఆగిపోయి ఉంటుంది. చేతులారా మామయ్యను నేనే చంపుకున్నాను" అనుకుంటూ సుగుణ కుంగిపోయేది.

రాఘవయ్య నిద్రలేచింది మొదలు, పొట్టకోసం తంటాలుపడుతూ క్రుంగిపోతున్నాడు. తమ్ముడు పోయినప్పటినుండి, శేషమ్మ మనసు రాయైపోయింది. ఆమె సుగుణను, నిర్దాక్షిణ్యంగా చూడడం ప్రారంభించింది.

కొంతమంది తల్లిదండ్రులకు తమ బిడ్డల మనోవ్యథను గ్రహించే సామర్థ్యంవుండదు. నిత్యదారిద్ర్యంతో బాధపడేవాళ్లు దిన మొక యుగంగా గడుపుతుంటారే గానీ, తమ కడుపున పుట్టిన బిడ్డల హృదయాల్లో ఎంత సంఘర్షణ జరిగేదీ తెలుసుకోలేరు.

ఒకనాడు రంగమ్మ సుగుణను దగ్గర కూచోబెట్టుకొని జడవేస్తూ అంది. "పిచ్చిపిల్లా; చిన్నప్పుడు చదువుకోవే, చదువుకోవే అని ఎన్నిసార్లు చెప్పానుకినీవేమైనా విన్నావా? బెజవాడలో మొన్న ఆసుపత్రికి పోతే ఒక నర్సు ముచ్చటగా అలంకరించుకొని అటూ ఇటూ కుంటుకుంటూ తిరుగుతూఉంది. నీవు జ్ఞాపకానికొచ్చావు. లక్షణంగా ఏదో థర్డుఫారందాకా నన్నా చదువుకోనుంటే, ట్రైనింగు చదివినా ఎంత బాగుండేది? నా మాట ఎవరికి పట్టిందమ్మా?" రంగమ్మ సుగుణను ఓదారుస్తున్నట్లు, జరిగిపోయినదానికి పశ్చాత్తాప పడుతున్నట్లూ మాట్లాడింది.

ఇంతలో సుగుణ బాల్యస్నేహితురాలైన సరోజని గుమ్మడిపండులాంటి ఒక బిడ్డను చంకనెత్తుకొని వచ్చింది. అందరూ ఆశ్చర్యంగా చూచారు.

"ఏమండీ, రంగమ్మగారూ ఎప్పుడు రావడం?" అంది సరోజ.

"నాకు మొన్ననే ఇక్కడికి ట్రాన్స్ఫర్ అయిందమ్మా. ఇంక ఎప్పుడొస్తుందో వస్తుంది మళ్ళీ, అరెస్టువారంటు వస్తుంది, బెజవాడ రమ్మని" అని రంగమ్మ చమత్కారంగా జవాబు చెప్పింది.

సరోజనికి ఏమీ అర్థంకాలేదు. "ఏమైనా ఉద్యోగంలో చేరారా ఏమిటి?" అంది. "ఆ. నా ఉద్యోగంలాంటి ఉద్యోగం ఇంకెవరికైనా దొరుకుతుందా? అందరికీ వురుళ్లు పోయడం, వంటచేయడం; ఎక్కడికి ట్రాన్స్ఫర్ చేస్తే అక్కడికల్లా వెళ్ళడం; అమ్మో నా ఉద్యోగంలాంటి ఉద్యోగం, మీకెవరికైనా దొరుకుతుందా?" అని రంగమ్మ వెటకారంగా నవ్వింది. సరోజని కిలకిలా నవ్వింది. రంగమ్మమాటలు శేషమ్మ మనసులో మంటలు రేపాయి. నోరు తెరవకుండా గుట్టుగా కూచుంది

సుగుణలేని సంతోషాన్ని తెచ్చుకుంటూ, సరోజని చంకలో ఉన్న పసిబిడ్డను ఎత్తుకొని ముద్దాడింది. పసిబిడ్డ స్పర్శ ఆమె హృదయంలో చక్కిలిగింతలు పెట్టింది. శరీరం గగుర్పొడిచింది.

"అబ్బా, ఏడితో వేగలేకుండా ఉన్నానమ్మా; ఎప్పుడూ ఎత్తుకొనే ఉండాలి. వాళ్ళనాన్న ఆఫీసుకు పోయొచ్చి, కొంచెం సేపు ఆడిస్తారేగాని, బిడ్డ ఏడిస్తే ఊరుకోబెట్టడం ఈ మగవాళ్ళకి చేతకాదమ్మా. దానికి మనమే సరి"అని కొంచెంసేపు ఆగి గుక్క తిప్పుకొని, "సరేకానీ, సుగుణా ఏమి ఇంత తగ్గిపోయావు? పిచ్చిదానిలాగా మారిపోయావు? నిజం చెప్తున్నాను సుగుణా, పెళ్లిచేసుకొని సుఖం అనుభవిస్తామనుకోవడం భ్రమ. నేనేం సుఖపడుతున్నానో చూడు. పొద్దస్తమానం ఇంటో చాకిరీతో సరిపోతుంది. ఈ వెధవను సముదాయించుకోవాలి. ఆయనకు ఆఫీసు టైముకు వంటచెయ్యాలి. వచ్చే జీతం డబ్బులు పదిహేను రోజులకు గూడా చాలవు" అని గుక్కచాలక సరోజని కొంతసేపు అలుపు తీర్చుకొంది.

సరోజని అసలే మాటలపుట్ట. ఎందువల్లనో, పెళ్లిఅయిన తర్వాత మాటలు ఇంకా జాస్తి అయినాయి.

"సకలశాస్త్రములు చదివియు..."

చుట్టూ గోదావరి చాలా ప్రశాంతంగా వుంది. ఈ గోదావరేనా అంత భీభత్సం చేసింది. ఇప్పటి తీరు చూస్తే ఆమాట నమ్మశక్యంగా లేదు. దూరంగా కొవ్వూరు తీరం సంజెవెలుగులో క్రీనీడలా కనబడుతోంది. శర్మ ఆకాశం కేసి చూస్తూ, ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు.

ఆర్ట్సు కాలేజిలో ఇంటరులోనూ, బి. యస్ సి. లోనూ కూడా నాకు సహాధ్యాయి. అతనికీ, నాకు, కొద్ది తేడాతో చాలా సామ్యం వుండేది. క్లాసులో అన్నిటిలోనూ మొదటివాడతను. అన్నిట్లోనూ వెనుకనుండి మొదటివాడిని నేను. గేమ్సులో, ఎలక్యూషన్లో, అన్నిటిలోనూ బహుమతులు కొట్టేసేవాడతను. నేను కొట్టేసేవాడినేమోకాని, వొక్కదాంట్లోనూ పాల్గొనలేదు నేను. అతన్నెరగనివాడు లేడు, నన్నెరుగున్నవాడు లేడు. మరి మాయిద్దరికీ పొత్తెలా కలిసిందో చెప్పడం కష్టం. అన్నిటిలోనూ మొదటి మార్కులెలా సంపాదించగలుగుతున్నాడా అని అతనిగురించి నేననుకుంటే, అన్నిట్లోనూ ఆఖరిస్థానమతనెలా మేనేజ్ చేయగలుగుతున్నాడా అని నాగురించి అతననుకునేవాడుట. బహుశః వొకళ్లపై ఇంకొకళ్లకున్న ఈ క్యూరియాసిటీయే మా స్నేహానికి మూలం కావచ్చు. అతనికీ నాకు ఒక్క విషయంలో మాత్రం ఏకీభావం వుండేది. ఇద్దరమూ కూడా భవిష్యత్తునిగూర్చి కలలు కంటూండే వాళ్ళం. చివరకి అనుకున్నట్లే బి. యస్ సి. లో అతను యూనివర్సిటీ ఫస్టు, నేను థర్డుక్లాసుతో యూనివర్సిటీ లాస్టుగా కాలేజిలోంచి బయటపడ్డాం. అతనా డిగ్రీ, గోల్డుమెడలే కాక, కాలేజిలో ఎన్నో బహుమతులు సంపాదించి, కట్టిన కాలేజి ఫీజు వస్తురూపంగా కూడా గిట్టించుకున్నాడు. ఇంక నేను - సరే ఆ విషయం దేనికి? - అతనింజనీరుంగులో చేరడమెరుగుదును. ఆ తరువాత అతని విషయాలు తెలియలేదు. నా థర్డుక్లాసు డిగ్రీ ఆంధ్రలో ఎలాగూ చెలామణి కాదని తెలుసు కాబట్టి, అది పుచ్చుకుని బొంబాయి పోయాను. అప్పటికింకా బొంబాయిలో కొద్దో గొప్పో ఉద్యోగాలున్నాయి కాబట్టి, నా డిగ్రితో అక్కడ లక్షలాది జనప్రవాహంలో కలిసిపోయాను. తరువాత, కిటకిటలాడే ఎలక్ట్రిక్ రైళ్ళూ, బస్సులూ, ట్యాక్సీలూ

ప్రకాశరావు

తప్ప వేరేమీ మార్పు లేకుండా జీవితం గడిచిపోయింది. అందుచేత ఎవరి విషయాలూ నాకంత తెలియలేదు. అంతకాలానికిప్పుడు సెలవుమీద రాజమండ్రి వెళ్లాను. శర్మ వాలకం నా కాశ్చర్యం కలిగించింది. వెనుకటి వుత్సాహం లేదు మనిషిలో. మాతో మామూలుగానే చమత్కారంగా మాట్లాడతాడు, నవ్వుతాడు. కాని అతని కళ్లు - ఎప్పుడూ శూన్యంలోకి చూస్తూవుంటాయి. వాటిని చూస్తే స్పష్టమవుతుంది, అతని నవ్వులాటలూ, చమత్కారాలు, కేవలం పైకి మాత్రమేనని. బహుశః మనిషిలో మనిషంటే ఇదేనేమో. శర్మ లోపలి మనిషి ఎప్పుడూ దేనినో అన్వేషిస్తున్నట్లే కనబడతాడు. కాలేజి రోజులలో, ఇతని మనిషిలోని మనిషిని చూసిన గుర్తు లేదు నాకు.

ఇక్కడే లాంచిటాపుమీద, నే నెరుగున్న శర్మని కాదు, నే చూస్తూంట, కొత్త వ్యక్తి, అతని మనిషిలోని మనిషిని. నేను తనని పరీక్షగా చూస్తున్నట్లు కనిపెట్టాడు కాబోలు శర్మ. నాకేసి తిరిగి చిరునవ్వు నవ్వాడు.

"ఏమోయ్, నే నింజనీరింగు మూడేళ్లు చదివి మానేశానని నీకాశ్చర్యంగా వుందేం? [illegible] గించింది. మా నాన్నగారికి కోపం కూడా వచ్చింది."

"కోపమా? దానివల్లాయనెంత బాధ పడ్డారో తెలుసా? నీ కేదో మతి చలించిందని ఆయ నిప్పటికీ అనుకుంటున్నారు. అసలు దానికి కారణమనేదేమైనా వుంటే ఆయనకి చెప్పరాదూ?"

"కారణం నాకే తెలియదోయ్ సరిగ్గా. ఒకవేళ నే చెప్పడానికి ప్రయత్నించినా, వాళ్లకది అర్థం కాదు. అందుకనే ఎవరికీ ఆ విషయం చెప్పలేదు. అయినా ఇంజనీరింగ్ పాసయి ఏమిటోయ్ చేయడం?"

"గాడ్! నీకున్న అవకాశాలు నాకుంటే నే నెప్పుడో ఇంజనీర్నయి వుండేవాడిని. పంచవర్ష ప్రణాళికంతా మీదే కదుటోయ్?"

"అమాటే నేనంటూంట. ఇంజనీర్ననవుతానోయ్. అయింతర్వాత? జానెడు పొట్ట పోషించుగోడానికి వందలు కావాలా, వేలు కావాలా?

"శర్మా, నువ్వేనా ఆమాటలంటూంట? నిన్నింత మార్చేయగలిగిన బలవత్తర సంఘటనేదో జరిగివుండాలి. అవునా?"

"నిజం చెప్పావ్ ప్రకాశం. నేనా సంఘటన ఎవరికీ చెప్పలేదు. చెబితే అర్థం చేసుగోలేరుకూడాను. కాని నీకు నాసంగతి బాగా తెలుసు. పైగా కొంతదేశం చూసివచ్చినవాడివి. ఇంజనీరింగు కళాశాలలో వుండగా విమానప్రమాదంలో నేను చిక్కుకున్నానని నీకు తెలుసా?"

"అవును మీ నాన్నగారా విషయం చెప్పారు. కాని దానికీ, దీనికి సంబంధం వుందని ఆయన అనుకోలేదు. ఆ ప్రమాదమసలెలా జరిగింది?"

అతను తనకథ ప్రారంభించాడు. గోదావరిలో చిన్న చిన్న అలలు లేవడం మొదలుపెట్టాయి. మేం కూర్చున్న లాంచి ఇటూ, అటూ వూగుతోంది.

* * *

ఇంజనీరింగు మూడవ సంవత్సరంలో వుండగా నేను మద్రాసునుండి ఢిల్లీ విమానంలో వెళ్లడం సంభవించినది. ఆ విమానంలోని కో పైలట్ నాకు పరిచితుడు. నేను ఇంజనీరింగు విద్యార్థిని కావడంతో, క్యూరియాసిటీవల్ల కాక్‌పిట్ లోకి వెళ్లాను. కేప్టెన్ చాలా హుషారయిన వ్యక్తి. ఎన్నో చమ [illegible]

సుగుణ

"సరేగాని, మీ చంద్రం మామయ్య పోయాడని ఎవరో అన్నారమ్మా" అని సరోజని, సుగుణ కళ్ళల్లోకి సానుభూతితో చూచింది.

సుగుణ మనసులో అదిమిపెట్టుకొన్న దుఃఖం అగ్నిపర్వతంలాగా ఒక్కసారి పొంగింది. బిడ్డను సరోజని చేతికిచ్చి, ముఖానికి గుడ్డ అడ్డంపెట్టుకొని సుగుణ క్రుంగిపోయింది.

సరోజని కొంతసేపు ఓదార్చి యింటికి వెళ్ళింది.

(ఇంకా వుంది)

కాపతువాళ్ళే కనుక యిద్దరికీ స్నేహమవ్వ డానికి అట్టే కాలం పట్టలేదు. విమానం గాలిలోకి వెళ్ళాక, దానికోర్సు, సెట్ చేసేసి, ఆటో పైలట్ ని వేసి ఇద్దరు పైలట్లూ తీరిగ్గానే వున్నారు.

ప్రకాశం! ఆనాటి సంఘటన ఇప్పటికీ పూర్తి వివరాలతో నాకు కళ్లకు కట్టినట్లుంది. ఆ కెప్టెన్, విమానం నడవడానికి సంబంధించిన యంత్రాలన్నీ చూపించాడు. అన్నీ ఆయాక బాతాఖానీ ప్రారంభించాడు. విమానంలో ప్రయాణీకులు కూడా అట్టేమందిలేరు.

"ఏయ్, రిపోర్టు సైడునికూర్చున్న పిప్పళ్ల బస్తాగా డెవడోయ్?" అన్నాడు పైలట్.

"పిప్పళ్ల బస్తా, గిప్పళ్ల బస్తా కట్టిపెట్టు. ఆయన బొంబాయిలో పెద్ద ఇండస్ట్రియలిస్టు. లక్షాధికారి. తెలిసిందా? అంత చులకనగా మాట్లాడుతున్నావ్?" అన్నాడు నా మిత్రుడు.

"ఎవడయితే నాకేం గాని, అలాంటి వాళ్లు విమానప్రయాణం మానేస్తే మనం బ్రతికిపోతాము. అవైపు బరువెక్కి పోయి, ఎయిలిరాన్సుతో తిప్పలు పడుతున్నా మొదటినుండీను."

"పోవోయ్ నువ్వు మరీ చెప్తావు" అని నవ్వేశాడు నా మిత్రుడు. తరువాత చాలా సేపు నవ్వుకున్నాం.

"సరే వాడి మాటకేం గాని, ఎవరో క్రొత్త హోస్టెస్ వచ్చినట్లుందే?"

"అవును. మిస్ సీమ్సు మనతో ప్రయాణం చేయడ మిదే మొదటిసారి. క్రొత్తగా ప్రవేశించింది" అంటూ ఆవిడని గూర్చి కొన్ని వివరాలిచ్చాడు నామిత్రుడు.

"ఇన్ని పర్టిక్యులర్సెప్పుడు సేకరించావోయ్? కాని, ఆమె అట్టేకాల మీపనిలో వుండదు."

"అంటే?" అని ప్రశ్నించాడు నా మిత్రుడు.

"నీ వేమంటావు మిష్టర్?" అని నాకేసి చూశాడు.

"మీరు మాటల్లో యింత పిసినిగొట్టుతనం చూపడ మేమీ బాగులేదు. మీ భావం కొంచం విశదీకరించండి, మీ కభ్యంతరం లేకపోతే."

"మీరు వట్టి తెలివిమాలినవాళ్లు. ఇంకో నాలుగయిదు ట్రిప్పులిలా వచ్చిందంటే ఏ రెగ్యులర్ పాసింజరో ఆమెని కట్టేసుకుంటాడు. ఆ నీలం సూటేసుకున్న పెద్దమనిషవస్థ చూడలేదూ? ఫుడ్ హౌస్ కారెక్టరు, బింగోలాగా, ఆవిడకేసి కుడ్డప్పగించి, ఎలా నూటత నవస్థ చెప్పతరం కాకుండానే వుంది. మాకు వచ్చేలా నవ్వు వచ్చింది.

ఇంతలో విమానం పైకి, క్రిందకి, ఇటూ అటూ వూగడం మొదలుపెట్టింది. ఎదురుగుండా పెనుభూతంలా కారుమేఘాలున్నాయి. నేను కంగారుపడి చిన్న కేక వేశాను. "మిష్టర్ మరేం భయం లేదు. నీ సీటులోకిపోయి కూర్చో." అన్నాడా

"సకలశాస్త్రములు చదివియు…."

పైలట్. నేను ఇవతలకి వచ్చేశాను. వున్నాయి. విమానమూ మేఘంలో ! కాని వాళ్ల వాళ్ల మాటలు వినబడుతూనే పోయింది. చుట్టూ అంధకారం. రైలు

పర్వతగుహలోకిపోతే ఎలావుంటుందో? అలావుంది. "స్థానికంగా ఇలా వుంటుందని వాళ్ల ఫోర్కాస్టు. వైఫుట్. ఆ స్థానిక మిడే ఆవాలి ఖర్మ." అంటూ గొణుగుతున్నాడు పైలట్. చుట్టూ మెరుపులక్కడక్కడ కన బడుతున్నాయి. అల్లంత దూరంలో పిప్పళ్ల బస్తా 'జై సీతారామ్' అనుకుంటున్నాడు. నీలం సూటాయన బెల్టుతో అవస్థపడు తూంటే హోస్టెస్ సహాయంచేస్తోంది. నాకు వికారం పెట్టడం మొదలుపెట్టింది. దానికితోడు భయమొకటి. ఇలా వున్నా కాక్పిట్లోని ఇద్దరూ ఏమీ కానట్లే వున్నారు. పైలట్, ఎయిలిరాన్ కంట్రోలు మీద దృఢమైన చేయివుంచి, సాధ్యమైనంతవరకు కుదుపులేకుండా చేస్తున్నారు. హఠాత్తుగా విమానం కొన్ని వందల అడుగులు క్రిందకి దిగిపోయింది.

"ఓ, హెల్! ఇదెక్కడి బంపీవెదరోయ్?" అంటూ అర్చాడు కేప్టెన్, ఎలివేటర్సు బాగా లాగుతూ. తిరిగి విమానం మామూలు ఎత్తుకు వచ్చేసింది. కొంతసేపటికా భీభత్సంలోంచి బయటపడ్డారు. క్రింద అలలులాగ మేఘాలు, పైన నీలాకాశం. విమానం మళ్ళీ మామూలుగా వెళ్ళడం మొదలుపెట్టింది

"కమ్హియర్, మిస్టర్" అని నాకు కాక్పిట్లోకి పిలుపు వచ్చింది.

"మీకేం భయం వేయలేదూ?" అంటూ అమాయకంగా ప్రశ్నించాను నేను. ఇద్దరూ అతి చులకనగా నవ్వేసి వూరుకున్నారు.

"ఇది మాకు పరిపాటేనోయ్" అన్నాడు నా మిత్రుడు. తిరిగి సరదాగా కబుర్లు ప్రారంభించాము. అంత బాతాఖానీలో వున్నా, వాళ్లు అక్కడున్న మీటర్లమీదో కన్నేసి వుంచుతూనే వున్నారు. ఎత్తు మామూలుగా వుందో లేదో, ఫ్యూయల్ (పెట్రోల్) సరిగ్గా రెండింజన్లకీ అందుతోందో లేదో, విమానమే వేగంతో వెడుతూందో ఇవన్నీ చూస్తూనే వున్నారు. ఇంతలో "ఫోర్ట్ సార్బోర్డు సైడింజను పనుకున్నట్లుంద"న్నాడు. అది నిజమే. మొదట ఫ్యూయల్ ఇండికేటరు తగ్గడం ప్రారంభించింది. వరుసగా ఆ యింజనుకు సంబంధించిన మీటర్లన్నీ జీరోదగ్గరకి రాసాగాయి. నాకు కంపం పుట్టింది.


"దగ్గర్లోవున్న ఎయిరోడ్రోమ్ మేపులో చూసి, వొక ఎస్. వో. ఎస్. పంపవోయ్. అక్కడ దిగుదాము"ని నా మిత్రుడికి చెప్పి, వణుకుతూన్న నాకేసి తిరిగి చిరునవ్వు నవ్వాడు. "ఏమిటిదారి?" అని ఖంగారుగా అతడిని ప్రశ్నించాను నేను. "ఎందుకంత భయపడతారు? ఇదో లెఖ్ఖలోనిది కాదు.

పడ్డాను. ఒకసారి, అంటే నేను *R. I. A. F.* లో వున్నప్పటిమాట, బర్మా ఫ్రంటులో ఒక సంఘటన జరిగింది. నేనో ఫైటరువిమానంలో మా యూనిట్ కి వెడుతున్నాను. ఇంతలో వో శత్రువిమానం తరుము కొచ్చింది. అది నా విమానంకంటె వేగవంతమైనది, పెద్దది కూడాను. అది దగ్గరకొచ్చేదాకా దాన్ని గమనించలేదు. నా విమానపు సైడంతా, దానితుపాకుల కెదురుగా వుంది. సరిగ్గా సమయానికి నా విమానపువేగాన్ని, శక్తిని హెచ్చుచేసి, హఠాత్తుగా పైకి లేచేశాను. ఆ విమానంనుండివచ్చిన గుండ్లు రాసుకుని పోయాయి. నా విమానానికో సార్ప లూప్ ఇచ్చి -"

"క్షమించండి, లూప్ అంటే?"

"అంటే విమానాన్ని నిటారుగా వదిలేసి వెనక్కి తిప్పేయడం. అలా చేయడం వల్ల వొక వలయం ఏర్పడుతుందన్నమాట."

"మరి అలా వెనక్కి త్రిప్పినప్పుడు విమానం తలక్రిందులవదూ?"



"...నేను కవిత్వాన్ని ద్వేషిస్తానని కొంతమంది నిందిస్తున్నారు. "లే తాం మొదర్న్" (సార్త్రే సంపాదకత్వాన వెలువడే పత్రిక) లో చాలా తక్కువగా పద్యాలు పడుతున్నాయనేది దీనికి నిదర్శనంగా వారు చూపిస్తున్నారు. నిజానికి ఆ పత్రికలో పద్యాలు తక్కువగా పడుతున్నాయనేదే నాకు కవిత్వమంటే ఇష్టమనే సంగతిని ఋజువు చేస్తుంది. ఈ మాటపై నమ్మకం లేకపోతే, సమకాలిక కవితోత్పత్తిని ఒక్కసారి పరికిస్తే తెలుస్తుంది..."


జాఁపాల్ సార్త్రే.

('వాటీజ్ లిటరేచర్' నుండి)

"అవుతేనేం? అలా చేయడంతో శత్రువిమానం మా తుపాకులకి ఎదురుగా వచ్చింది. ఇప్పుడు వాడు ప్రమాదంలో పడ్డాడు. కాని అది వేగవంతమైన విమానమవడంతో, నా కందకుండా పోయింది. అయినా దానిని వెంబడించాను. ఒకచోట వాడు తన విమానానికి లూప్ ఇచ్చి నామీదకి రాబోయాడు. కాని వాడి ఎత్తుని సరిగ్గా ఏంటిసిపేట్ చేసి నా తుపాకులని కాల్పించాను. శత్రువిమానం గిరగిర తిరుగుతో మంటలతో క్రింద పడిపోయింది. కావయితే నాతుపాకులు పేల్చిన ఇంపాక్టుకి, నా విమానపు ముందుభాగానికి బరువెక్కువయి అదికూడ క్రింద పడింది. నేనుమాత్రం విచిత్రంగా చావకుండా బైటపడ్డాను. అయితేనేం, రెండునెలలు మంచంమీదుండవలసివచ్చింది. నాతలమీద వెంట్రుకలు నిండుతున్నాయి యీ కథకి.

"నిజమే మీరు చాలా ప్రమాదకరమైన వృత్తి తీసికున్నారు."

"ఏం ప్రమాదం లెద్దురూ? నా ముందు నా తండ్రి, ఆయన తండ్రి, అలా ఎంతో మంది పుట్టారు, గిట్టారు. వాళ్ళేవిమానాలెక్కడంవల్ల పోయారు? చదువుకున్నవారు, మీరూ అలాంటే ఎలా?" యీ వాదన సమంజసంగానే వుంది. ఏమిటో



నక్షత్రం

★ "సకలశాస్త్రములు చదివియు...." ★

చావన్నది ప్రతివాడికీ వున్నదే. మరి యీ విమానాలంటే భయ మెందుకో?

"ఇటువంటి ప్రమాదపరిస్థితిలో కూడా, వెనుకటి విషయాలని తీరిగ్గా చెప్పగలిగిన మీ మనో నిశ్చలత, చాలా శ్లాఘనీయం." అన్నాను.

"థాంక్సు. దీంట్లో పెట్రోలు సరిపోవాలి కాని లేకపోతే మిమ్మల్ని చెక్కు చెదరకుండా క్రిందికి దింపే పూచీ మాది. మీరు వెళ్లి మీ సీట్లో కూర్చోండి." తరువాత ఫ్యూసిలేజిలోని ప్రయాణీకులకు, విమానం ఫోర్సు లాండు అవుతోంది కనుక బెల్టులు బిగించుకుని జాగ్రత్తగా కూర్చోండని కబురుచేశారు.

ఇంతలో రేడియో టెలిఫోను లో కాబోసు ఎదో విమానాశ్రయంతో మాట్లాడుతున్నారు.

"ఎయిర్‌క్రాఫ్టు విక్టర్... కాలింగ్... టవర్" అంటున్నారు వాళ్లు.

ఇంతకంటె అస్పష్ట స్వరంలో ఆ విమానాశ్రయపు ఫ్లయింగు కంట్రోలు కాబోసు, తిరిగి విమానాన్ని పిలిచారు. యీ ఉపోద్ఘాతాలయ్యాక,

"స్టార్ బోర్డు సైడింజను పాడయింది మీ విమానాశ్రయంలో దిగడాని కనుమతి కావాలి. అక్కడి లేన్డింగు కండీషన్సేమిటి?"

"లేండింగ్ కండీషన్సేమీ బాగు లేవు. విమానాశ్రయమంతా పొగమంచుతో కప్పబడివుంది. దృశ్యం (*Visibility*) అతి హీనంగా వుంది. 50 గజాలకంటె ఎక్కువ కనబడటం లేదు. ఆకాశంకూడా కనబడటం లేదు. అందుచేత ఇక్కడ దిగటానికి వీలు లేదు. పెట్రోలు ఎండ్యూరెన్సు వుంటే... విమానాశ్రయానికి తిరిగిపొండి."

"హెల్. ఎండ్యూరెన్సుంటే ఇక్కడికి రావటం దేనికి? ఇక్కడే దిగాలి."

"అలా అయితే, యీపైనే తిరుగుతూండండి. పొగమంచు విడడానికి అవకాశాలున్నాయిట."

"రోజర్" అని చెప్పి, మా ఒంటింజను విమానాన్ని, విమానాశ్రయం చుట్టూ త్రిప్పారు. నిజానికి క్రిందంతా పొగమంచు దటంగావుంది. ఏమీ కనబడటంలేదు. మా విమానమే వుల్లిపొరలాంటి మేఘాల్లోంచి పడుతూంది. మా అంతం సమీపించిందని మేమంతా భయపడ్డాము. ఆ కాక్‌పిట్‌లో వున్న వ్యక్తులకేసి చూస్తూ కూర్చున్నాను. వాళ్లేమిటో మాట్లాడుకుంటున్నారు. నవ్వుకుంటున్నారు. వాళ్ళని చూస్తే నాకు కోపం వచ్చింది. ఇలాంటి సమయంలో కూడా నవ్వుకుంటూ ఎలా కూర్చోగలరో? "కాని యిప్పుడాలోచిసే వాళ్ళు అలా వుండడమే సమంజసమనిపిస్తోంది. ప్రకాశం, పూరికే కంగారుపడిపోయి, ఆవేశం చెంది మనం చేయగలిగేదేమిటి? పరిస్థితు లెంత గడ్డువైనా వాటిని శాంతంగా ఎదుర్కొంటే—"

"అదంతా ఆపవోయ్. నా విమానాన్నలా గాలిలో వదిలేసి యీ వుపన్యాసాలేమిటి? తరువాతేమయిందో చెప్పు. లేకపోతే—" అన్నాను నేను.

"అలాగే, అలాగలే. కొంచెంసేపటికి పైలట్ ముఖం చాలా సీరియస్ అయిపోయింది.

"మైగాడ్, పెట్రోలు హారతి కర్పూరంలా హరించుకుపోతోంది. ఎలాగో అలాగ దిగాలి." అంటూ భూమితో సంభాషణ ఆరంభించాడు. వాళ్లు ఆగడానికి సన్నాహాలు చేశారు. మేమంతా ఎప్పుడో బెల్టులు బిగించేసి కూర్చున్నాం.

'ఛస్, యీ భూమికి దూరంగా వున్నంత కాలం బాగానే వుంటుంది. దగ్గరపడగానే అన్నీ అవస్థలే.' అని విసుక్కుంటున్నాడా పైలట్. ఇంతలో అల్లంత దూరాన్నో తాటి చెట్టు కనబడింది. దాని కెళ్ళి కొట్టేసుగోవలసిందే కాని, ఎలివేటర్సుని బలంగా లాగి, ఫుల్ హార్సుపవరు పెట్టేసరికి బ్రహ్మాండమైన శబ్దంతో విమానం తిరిగి పైకివెళ్లింది. ఎయిలిరాన్సుని దృఢంగా కంట్రోలులో వుంచి, ఆకస్మికి విమానం రెండోవైపునకు వాలిపోకుండా ఆపారు. పరిస్థితులకు వాళ్లకీ మధ్య జరుగుతున్న సంగ్రామం ఎలా అంతమవుతుందో చూడాలని కూర్చున్నాం, భగవత్సహాయానికి దరఖాస్తులు పంపుకుంటూ. విమానం తిరిగి దిగడం మొదలు పెట్టింది. అటు ఫ్యూయలిండికేటరుకూడా దిగజారి పోతోంది. అల్లంత దూరాన రన్‌వే ఓమాదిరిగా కనబడుతోంది. 'హమ్మయ్య' అనుకున్నాం. కాని ఇంతట్లో ఏమయిందో తెలియదు. విమానం నెమ్మదిగా దిగడం మానేసి, ఒక్కసారి క్రింద పడిపోయింది. తరువాత నాలుగురోజులకి ఆసుపత్రిలో నాకు మెలుకువ వచ్చింది. స్టారుబోర్డింజను రెక్క భూమిని బలంగా తాకడంవల్ల అందులోని పెట్రో లంటు

కుంది. అది విమానం నడవటానికి ఉపయోగ పడకపోయినా, విమానాన్ని దగ్ధం చేయ డానికి వుపయోగపడింది. విమానం పూర్తిగా దగ్ధమయ్యేలోపున ఫైరింజన్లూ, రెస్క్యూ పార్టీలు వచ్చి రక్షించాయిట. పైలట్లిద్దరూ కొందరు ప్రయాణీకు లక్కడే మరణించా రుట; ఇద్దరాసుపత్రిలో పోయారు. నేనూ, నీలంసూటు, పిప్పళ్ళబస్తామాత్రం బతికాం. కాని పిప్పళ్ళబస్తాకాలు ఏంప్యూటు చేయ వలసి వచ్చింది. అతనికున్న లక్షలేవీకూడా, యీ అంగవైకల్యంనుండి రక్షింపలేకపోయా యతనిని. ఆతరువాత యీ ప్రమాదంగూర్చిన ఎంక్వయిరీలు, అవీ, ఇవీ అయాక ఇంటికి వచ్చాను. అదీ జరిగినది. అక్రితందాకా ఎంతో ఉత్సాహంగావుండి, చమత్కా రంగా మాట్లాడిన ఆవ్యక్తి ఏమయినాడు? నిజానికింతకం టె ప్రమాదపరిస్థితుల నెన్ని టినో ఎదుర్కొ గలిగానే? ఇప్పుడేమైంది? అదే ప్రమాదంలో చెప్పుకోతగ్గ దెబ్బలైనా లేకుండా నేనెలా బైటపడ్డాను? ఏమిటి దీనికి కారణం? మన జీవితాలని త్రాళ్ళతో బంధించి తోలుబొమ్మలాగా ఆడించే ఆవిధిముందు మనమెంత?" యీ చివరి ప్రశ్నలు తనకితనే వేసుకున్నట్లున్నాడు. నిజంగా శర్మకి మతి చలించిందనుకున్నా. నాదగ్గిరనుండి ఏవిధమైన సమాధానమూ అపేక్షించకుండా నే తిరిగి ప్రారంభించాడు.


"ఎప్పుడో అప్పుడు మన జీవితమూ, ఆ జీవితంలో మనంపడే తాపత్రయాలూ అంతమైపోతా యని తెలిసికున్నప్పుడు, ఇంక వేరే ఘనకార్యాలు చేసేయాలనే ఆసక్తి అణగంటుతుంది."

"ఏడిసినట్లుంది. అంతా యీవిధంగా ఆలోచించి, కాళ్లు జాపేసి కూర్చుంటే, యీ సృష్టి కర్థమేమిటి? మన ప్రోగ్రెసంతా నశించిపోతుందే?"

"ప్రోగ్రెస్? హుఁ దానికేంలే. కాని ఇలా కాళ్లు జాపేసి కూర్చునే వాళ్ళరుదు. యీవిధంగా తీవ్రంగా ఆలోచించడంలో కన్నా, వాటిని హోమాలకి పెట్టి, బాదరబందీతో సతమతమవుతూ, జీవితంలో మన మేదో సాధించేసున్నా మనుకోడంలో చాలా తృప్తి వుంది."

"అయితే, యీ రాజకీయాలు, శాస్త్ర పరిశోధనలూ, ఇత్యాది ఐహిక విషయా లతో బుర్రలు పగలుకొట్టుకుంటూందే వాళ్లంతా జీవితాలు అశాశ్వతాలని తెలుసు కోలేనంత మూఢు లంటావా?"

"అబ్బే, అది కాదు నే ననేది. యీ సత్యాన్ని తెలుసుకోలేనివా డెవడుంటాడు? కాని ఆ విషయం సాధ్యమైనంతవరకూ విస్మరించటానికి ప్రయత్నిస్తారు. ఇతర విషయాలతో వారి మనస్సులను లగ్నం



దీపభారతి

—డి. రామలింగేశ్వరరావు.

చేస్తారు. అక్కడే వుంది మన పిరికితనం."

"పిరికితనమా?" అంటూ అతనికేసి తీవ్రంగా మూశాను.

"అవునోయ్. కాకపోతే ఏమిటి? నూరేళ్లు బతికినా, యింకా కొంతకాల ముంటే బాగుండునని దేవుళ్ళాడుతాడు మానవుడు. అయినా యీ వాదనలు మన కెందుకులే. నడు యింటికి పోదాం. చీకటి పడింది."

"ఇంటికి పోవచ్చులే. ముందు నీ సంగ తేదో తెలుస్తేకాని లాభంలేదు. మానవుడు చిరంజీవిగా వుండటానికి పరిశోధనలు జరుగుతున్నాయిట కొన్ని దేశాలలో తెలుసా?"

"అది మన కనవసరం. మన మతం ప్రకారం మన ఆత్మలు చిరంజీవులుట. అవి వాటి కర్మానుసారంగా వొక్కొక్కసారి వొక్కొక్కరూపంతో భూమిపై పడతా యిట. అటువంటి త్రిపాదులైన మన ఆత్మలు, ఎప్పుడూ వొకే వేషంలో వుండ టాని కొనందిస్తా యంటావా? కొంతకాల మయేసరికి, విసుగెత్తిపోతుంది. కాని అప్పుడు చేయకలిగిందేమీటీ వుండదు. మన పరిశోధనలకి ఫలం రా బాబూ అంటూ నోరు నొక్కుకుని ఏడవటం తప్పించి."

"మన మతంగురించి, ఆత్మలగురించి నాకు తెలియదు కాని, బతికినంతకాలం, అది కొద్దికాలమైనా, బుర్రని పాడుచేసి కోకుండా సంతోషంగా బతకాలంటాను. నీ పైలట్ నైనా చూసి నేర్చుగో."

"ఇప్పుడు నే సంతోషంగా లేనని ఎవ రన్నారోయ్? మీరంతా నేనేదో బాధపడి పోతున్నా ననుకుంటున్నారు. సంతోష మనేది మన మనుకోడంలో వుంది. అయినా సంతోషంగా వుండటానికి యింజనీర్ను వాలిపోయ్?" తిరిగి మొదటికి వచ్చాడు. దీనికి ఘాటుగా సమాధాన మిద్దామనుకున్నా.

"ఏమయ్యోయ్, పెద్దమనుసులూ, రాత్రల్లా ఇక్కడే కూర్చు నేటట్టున్నారేమి?" అంటూ క్రిందనుండి పడవవాడు కేకేశాడు. దాంతో మా చర్చ కట్టిపెట్టి ఇంటి కి పోయాము. తిరిగి చర్చకి అవకాశమివ్వ లేదు శర్మ. ★



వనితాలోకం

నవ్వు

★ ★

వాసిరెడ్డి సీతాదేవి

"నీ ముఖం అందంగా ఆకర్షణంతంగా వుండాలని కోరితే, ఎప్పుడూ సంతోషంగా, నవ్వుతూవుండు. చిరునవ్వు చిందులాడే నీ పెదవులు, ఆత్మతృప్తితో మెరిసిపోతున్న నీకళ్ళు, నీ ముఖానికి లిప్‌స్టిక్, క్రీమ్, పౌడర్లు యివ్వలేని అపూర్వ సౌందర్యాన్ని ప్రసాదించగలవు."

మా పక్కింటి కాంతమ్మగార్ని చూసి నప్పుడల్లా ఎక్కడో చదివిన ఆ పై వాక్యాలు గుర్తొస్తుంటాయి. చూసిన ప్రతి వాళ్ళూ 'లక్ష్మీదేవిలా ఎంత చక్కగా వుందమ్మా' అనేవారు. ఆమెకు నగలూ నాణ్యాలు, ఖరీదు గల చీరెలూ లేవు. అందగత్తె అంతకంటే కాదు. మెడలో ఒక పేట బొందుగొలుసూ, మామూలునూలుచీర, ముఖాన యింత కుంకంబొట్టు, చామన చాయగా అతిసాధారణంగా వుండేది. ఆమె అందమైనదని భ్రమ కలగటానికి కారణము - చిరునవ్వు తొణికిసలాడే ఆమె పెదవులూ, ప్రసన్న వదనమే.

కాంతమ్మ తోడుకోడలు కమల వున్న యింటి ఆడపడుచు. పళ్ళుని శరీరచ్ఛాయ. మెడ తిరగని నగలతో, పట్టుచీరెల బరబరల్తో, చిరుబురులాడుతూ తిరుగు తుండేది. ముఖంమీద ఎప్పుడూ వడ్లగింజ వేస్తే పేలగింజ వేసేటూండేది! చిరచిర లాడే ఆముఖంలో స్త్రీ సహజమైనమార్దవం చచ్చిపోయింది. న్యాయంగాకమాట కాంతమ్మ కంటే ఎంతో అందమైనదే. కాని ఆమె ఎవర్నీ అందం ఆకర్షించలేకపోతుంది.

కాని మనం సాధారణంగా, ఎప్పుడూ నవ్వుతూండే ఆడపిల్లల్ని పెద్దవాళ్ళు మందలించటం చూస్తుంటాము. 'పెకిలితనం ఆడదానికి పనికిరాదనీ, నవ్వు నాలుగిందాల చేటు' అనీ అంటూంటారు.

ఒకవైపు నవ్వే అలంకారమని చెబుతూ, రెండోవైపు వెకిలితనమంటూ మందలించటం చూస్తుంటే నిజంగానే ఆశ్చర్యం కలుగుతుంది. కాని ఆలోచించిచూస్తే పెద్దలు చెప్పిన పై రెండు వైరుధ్యాలలో, సామంజస్యము కన్పించకపోదు.

శాస్త్రంలో నవ్వు ఆరువిధాలుగా చెప్పబడింది.

స్మిత, హసిత, విహసిత, అవహసిత, అపహసిత, అతిహసిత, అనేపేర్లతో విభజించారు.

పెదవుల కదలికతోపాటు, కళ్ళలో కొంత కాంతి కలిగించే నవ్వును 'స్మిత' అనీ, పై రెండు గుణాలతోపాటు పళ్ళు కూడ కన్పిస్తే 'హసిత' అనీ అంటారు. ఈ రెండురకాల నవ్వునుకూడ మనం చిరునవ్వు అనే అంటాము. ఈ నవ్వు సాధారణంగా గొప్పవాళ్ళలో, మహాత్ముల్లో, నిండుకుండలాగ కష్టసుఖాలకు తొణకని వారిలో, కన్పిస్తుంది.

'హసిత' లో వున్న గుణాలతోపాటు మధురమైన ధ్వనికూడ వుంటే 'విహసిత' అనీ, మధుర ధ్వనితోపాటు శరీరంలో కొంత కదలిక కూడ వుంటే 'అవహసిత' అనీ అంటారు. వీటినే మనము కిలకిల నవ్వట మంటాము. ఈ నవ్వు హిమాలయం నుండి ప్రవహించే నిర్మల గంగా ప్రవంతిలాగ, అమాయకపు, సాధారణ వ్యక్తుల హృదయాలనుండి వెలువడుతుంది.

ఇక పోతే 'అపహసిత' 'అతిహసిత' అంటే (పకపక నవ్వడం) వెకిలినవ్వు, అట్టహాసం అంటారు. ఈ నవ్వులో ధ్వని కర్కశంగానూ, ముఖం అంతా వికారంగానూవుండి, శరీరంలో ఎక్కువ కదలికలు కన్పిస్తాయి ఈ నవ్వు సాధారణంగా కృత్రిమ స్వభావం గలవారు నవ్వుతారని చెబుతారు.

గణితశాస్త్రంలోలాగ పై సిద్ధాంతాలు అందరికీ, అన్ని నియమాలు ఒకటిగా వుండకపోవచ్చును. కాని సాధారణంగా పై లక్షణాలనుబట్టి వ్యక్తులను అర్థంచేసుకోవటానికి ప్రయత్నించవచ్చును.

అసలు నవ్వు ఎందుకు వస్తుందని ప్రశ్నిస్తే, ఎదుట వ్యక్తి 'ఆత్మానందమే కారణ' మని వెంటనే జవాబు యిస్తారు. మన హృదయంలోని ఆనందానికి ప్రతిబింబమే నవ్వు అంటారు. 'నిజంగా నవ్వు ఆత్మానందానికి అభివ్యక్తియేనా? మనం నవ్వుతున్నప్పుడల్లా మన హృదయాల్లో ఆనందం తొణికిసలాడుతున్నదా? మన ప్రతి నవ్వులో మన హృదయంలోని మాధుర్యం చిలకరిస్తుందా?' అని మనలను మనమే ప్రశ్నించుకుంటే 'లేదు' అనే జవాబు మన హృదయంలోని ఏదో మూల నుండి వస్తుంది.

రోడ్డు మధ్యలో ఓ పెద్దమనిషి కాలు జారిపడటం చూసి మనం పక్కున నవ్వుతాము. ఇతరులు మనలను సభ్యత తెలియనివారు అనుకుంటారేమోనన్న భయంతో మాత్రమే కొన్ని సమయాల్లో ఆపుకోవటానికి ప్రయత్నిస్తాము. ఆ నవ్వు మన ప్రసన్న హృదయాల అభివ్యక్తి కాదు అది మన హృదయాలలో దాగివున్న అహంభావాన్ని వ్యక్తపరుస్తుంది ఆ నవ్వులో 'నీకు రోడ్డు మీద నడవటం చేతకాదు, నాలాగ నీవు కూడ నడిస్తే ఎందుకు పడతావు?' అనే భావం దాగివుంటుంది ఈ నవ్వు మన వ్యక్తిత్వంలోని బలహీనతను వ్యక్తపరుస్తుంది. ఇలాంటి సన్నివేశాల్లో నవ్వలేని వారి హృదయాలు పరిపక్వస్థితిని పొందినవని చెప్పవచ్చును.

కొన్ని సందర్భాలలో మనలోని స్వార్థభావమే మన నవ్వుకు కారణభూతమౌతుంది. ఒకసారి నాకు తెలిసిన ఒక ఆమె ఒక సభలో మాట్లాడుతుందని తెలిసి వెళ్ళాను. ఆమె ప్లాట్‌ఫారము ఎక్కింది. గుండెలో దడ, కాళ్ళలో వణుకు, ముఖం మీద చెమట్లు పోస్తున్నాయి. మాటలు తడబడుతున్నాయి. ప్రేక్షకులలోనుండి నవ్వులూ, కేకలూ ఒకటేమిటి ఎన్నో రకాలుగా అల్లరి ప్రారంభించారు. ఆమె స్థితి చూస్తుంటే నవ్వవచ్చింది నాకు కూడ. అలాంటి సమయంలో మనలో మనమే అనుకుంటాము-"ఇంకా నయము. ఆ స్థానంలో వున్నది నేను కాదు!" అని. ఆ భావమే సభలో అల్లరికి కారణం.

తాను చాలా వున్నతస్థితిలో వున్నానను కోవటం కూడ ఇతరులను చూసి నవ్వటానికి కారణమౌతుంది. ఈ రకమైన నవ్వులో వ్యంగ్యం యిమిడివుంటుంది. ఒక్క వ్యంగ్యంతో కూడిన చిరునవ్వు విషబాణంకంటే ఎక్కువగా హృదయాన్ని గాయపరుస్తుంది.

కేవలం అహంభావం, అహంకారం, స్వార్థం గర్వమే కాకుండా ఆత్మహీనత కూడ కొన్ని సమయాల్లో నవ్వుకు కారణమౌతుందంటే ఆశ్చర్యం కలగవచ్చును. మన అజ్ఞానాన్ని, అల్పత్వాన్నీ, బలహీనాన్నీ, ఇతరులనుండి దాచటానికికూడ నవ్వును అడ్డంగా పెట్టుకో ప్రయత్నిస్తాము. మనకు తెలియని విషయాలను గురించి చర్చవచ్చినప్పుడు "పోనిద్దూ, ఇల్లాంటి తేలిక లేక చౌకబారు విషయాలంటేనే నాకు తలనొప్పి" అంటూ ఆచర్చనీయాంశాన్ని నవ్వులాటకింద మార్చటానికి ప్రయత్నిస్తాము. అలాగే చెవిటివాళ్లుకూడ ప్రతిదానికీ నవ్వుతూ తమకు వినపడని విషయాలను దాస్తుంటారు.

మనం చాలా గొప్పవాళ్లనుకొనే వారి ముందు మాట్లాడేప్పుడు మన స్వంత వుద్దేశాలను ధైర్యంచేసి చెప్పలేము. వాళ్ళు చెప్పిన ప్రతివిషయానికీ లేని నవ్వును తెచ్చిపెట్టుకొని ఆలకిస్తుంటాము. వారు నవ్వితే నవ్వు రాకపోయినా మనమూ నవ్వుతాము. ఆ నవ్వు విశ్వలేక నవ్వటమే. ఆ నవ్వు ముఖానికి అందాన్ని యిచ్చేమాట అలా వుంచి పైగా వికారాన్ని కలుగజేస్తుంది.

మనకు యిష్టంలేనివాళ్లతో, ఇష్టంలేని విషయాలను గురించి మాట్లాడేప్పుడుకూడ అర్థంలేని వ్యర్థపునవ్వును తెచ్చిపెట్టుకుంటాము. మన విముఖత్వాన్ని నవ్వుచాటున దాచ ప్రయత్నిస్తాము.

కొంతమంది ప్రతి చిన్నవిషయానికీ పెద్దగా, వికృతంగా నవ్వుతారు. వారి వ్యక్తిత్వం కొన్ని అసాధారణ పరిస్థితుల కారణంగా పూర్తి వికాసం చెంది వుండదు. మనస్సులో అహార్నిశలూ అతృప్త కాంక్షలేవో అల్లరి చేస్తుంటాయి. ఆ అల్లరితాలూకు హోరు ఎదుటివ్యక్తుల చెవులకు సోకకుండావుండటానికే మేఘాలు గర్జిస్తున్నట్లు నవ్వుతారు. ఇలాంటివారు యితరులముందు తాము చాలా తృప్తికరమైనజీవితాన్ని గడుపుతున్నట్లు నటించ ప్రయత్నిస్తారు. అందుకే ప్రతి చిన్న విషయానికీ పెద్దగా నవ్వుతారు. కాని అది ఒక్క అట్టహాసంమాత్రంగానే వుండిపోతుంది.

కొంతమంది అసభ్యకరమైన మొరటు మాటలకు, చేష్టలకు నవ్వుతారు. ఈ నవ్వులో వారి హృదయాంతరాళాల్లో బలవంతంగా అణచబడివున్న కోర్కెలుద్యోతకమౌతాయి. ఇలాంటి నవ్వు కొన్ని సందర్భాల్లో మంచినే కలుగజేస్తుంది. బలవంతంగా అణచబడిన ఆ కోర్కెలు యీవిధంగానైనా బయటపడకపోతే కొన్ని సమయాలలో దుష్కృత్యాలకు దారి తీయవచ్చును.

★ నవ్వు ★

నవ్వు అంటుజబ్బులాంటిది. మీరునవ్వితే మీతోవున్న వాళ్ళుకూడ నవ్వుతారు. ఒకో సారి కారణం తెలియకుండానే ఒకరు నవ్వితే మనమూ నవ్వుతాము.

నిర్మలమూ స్వాభావికమూ సరళమైన నవ్వుజీవితానికిఎంతో ఉపయోగపడుతుంది. స్వచ్ఛమైన నవ్వులో శరత్ కాల చంద్రిక లోని చల్లదనము, ఉషఃకాల స్వర్ణకిరణాల లోని సౌందర్యము, పుష్పములోని మాధుర్యమూ, యిమిడివుంటాయి. పసిపిల్లల బోసి నోటినుండి వచ్చే ఆ అమాయకపు నవ్వు లోని అమరత్వమే నిర్మల హృదయంనుండి వచ్చే చిరునవ్వులో యిమిడివుంది. అలాంటి నవ్వే కాంతమ్మగారి ముఖానికి మహా త్తర శక్తిని ప్రసాదించింది.

ఇలాంటి ప్రకృతి దత్తమైన అమూల్య వరాన్ని మనము అర్థంచేసుకోలేక దుర్వినియోగం చేసుకుంటున్నాము. సమయాసమయాలు చూడక నవ్వుతూ ఇతరులను బాధ పెడుతున్నాము.

కొంతమంది ప్రతి చిన్న విషయానికి అర్థంలేకుండా నవ్వుతారు. అలాంటి వారు చాలా అమాయకంగా కూడ కన్పిస్తారు. కాని వారి నవ్వు కొన్ని సమయాల్లో ఎంతోమందిని బాధ పెడుతుంది. ఒక రోజు బస్సులో నా మిత్రురాలు సరోజ ఎందుకో నవ్వింది. ఆమె నవ్వితే తెలియకుండానే నేనూ నవ్వాను. వెంటనే మా ప్రక్కనే కూర్చున్న ఓ పళ్ళుఎత్తు ఆమె కర్చీపును నోటికి అడ్డం పెట్టుకుని బయటకుచూడ ప్రారంభించింది. ఎదురుసీటులో ఆ వారా బుష్‌కోటులో వున్న ఓ యువకుడు, ఒకసారి చిన్నగా దగ్గి, కూలింగ్ గ్లాసు తీసి మరల పెట్టుకొని, చిరునవ్వుతో బస్సులో వున్నంతసేపూ మావంకే చూడటం ప్రారంభించాడు. నాకు కోపంవచ్చి సరోజను తిట్టాను. ఎప్పుడూ కమలంలాగ వికసించి వుండే ఆ అమ్మాయి ముఖం ముడుచుకుపోయింది. చూశారా 'నవ్వు నాలుగిందాల నష్టమనే' సామెత మన పెద్దలు ఎందుకు చెప్పారో!

ఆ అమ్మాయి నవ్వు ఒకర్ని అనవసరంగా బాధపెట్టింది. ఇంకో విధంగా తనను యితరులు అపార్థం చేసుకోవటానికి సహాయపడింది.

"పుట్టింట్లో ఉన్నప్పుడు ని మొహాన ఒక్క చింకిపాత లేదు గుర్తుందా?"

"ఫరవాలేదు అత్తవారింట్లో చాలా అమరినాయిగా!"

* * *

"మా ఇంటావిడకూ నాకూ ఎప్పుడు తగాదా వచ్చినా సరే చివరికి నామాట నెగ్గవలసిందే ఇందులో రహస్యం మరేమీ లేదు. చివరకు నేను మెల్లిగా తప్పునాదే లెమ్మని ఒప్పుకుంటాను."

ఎప్పుడూ నవ్వుతూ వుండు అంటే ఎప్పుడూ నీ ముఖాన్ని ప్రసన్నంగా వుంచుకోమని అర్థం. పుష్పం వికసించింది. దానిలోని సౌరభం నలువైపులా వ్యాపించి వాతావరణాన్ని మాధుర్యంతో నింపింది. చంద్రుడు ఉదయించాడు. అతనిలోని వెన్నెల నలువైపులా వ్యాపించి ప్రపంచానికి చల్లదనాన్ని ప్రసాదించింది. అలాగే గృహలక్ష్మియొక్క ప్రసన్న వదనము, చిరునవ్వు చిందులాడే పెదవులు, గృహాన్ని స్వర్గసీమ చేయగలవు. కష్టసమయంలో సహితం ఆత్మబలంతో మెరిసిపోతున్న ఆమెకళ్లు కుటుంబానికి వెలుగుబాట చూపగలవు.

స్వచ్ఛమైన నవ్వు వరప్రసాదంలాంటిది. కష్టాల్లో నవ్వగలవారే దృఢవ్యక్తిత్వం కలవారు. పసిబిడ్డ నవ్వటానికి ప్రయత్నించదు. నవ్వటానికి ప్రయత్నించ నవసరంలేదు. అప్రయత్నంగా నవ్వగలిగేవ్యక్తి ఎన్ని కష్టాలనైనా తేలిగ్గా ఎదుర్కోగలడు.

మహాపురుషుల నవ్వులో యిలాంటిదే ఏదో మహత్తరశక్తి వుంది. వారినవ్వు కోట్లకొలది ప్రజలహృదయాలలో ప్రతిధ్వనించి, నిర్గాణమైయున్న వారి మానసిక శక్తులను మేల్కొలిపి, కర్తవ్యపరాయణులుగా చేయగలదు. 'బాపూజీ' బోసినోటినుండి వెలువడే ఆ చిరునవ్వే కోట్లకొలది నిరాశాపీడితహృదయాల్లో నూతనజీవాన్ని పోసింది. ★

★ అపరాహ్ణం - విజ్ఞానం ★

ప్రపంచం మొత్తంమీద జరిగే వ్యవహారాలన్నింటినీ తెలుసుకుని విషయ పరిజ్ఞానాన్ని పొందటం సామాన్యులకి అందుబాటులో వుండదు. అటువంటప్పుడు పత్రికలు, సినిమా, రేడియో ద్వారా 'కొంత' తెలుసుకుందామని ప్రయత్నించటం సహజం. ఓ పత్రిక బల్లమీద పడున్నా, రేడియోలో గొంతుకలు శబ్దం చేస్తున్నా ఏదో, తెలుసుకుందామనే కుతూహలం సహజంగా కలుగుతుంది.

సినిమా చూడాలంటే వాహనమెక్కి తరలి వెళ్ళాలి. తీరా అంతదూరం వెళ్ళిన తరువాత టిక్కెట్టు దొరుకుతుందనే హామీ లేకపోవచ్చు. చిత్రం బాగుండకపోతే తలకాయ నొప్పి రావటమే కాదు, డబ్బు వృథా అవుతుంది. ఏదైనా సమావేశానికి వెళ్ళాలన్నా అలాటి తంటాయే వస్తుంది. మీటింగు తొందరగా అయిపోవచ్చు. జనం క్రిక్కిరిసి వుండి స్థలం దొరక్కపోవచ్చు. ఉపన్యాసాలు బాగుండకపోతే పైకి తిట్టుకోవటానికి వీలుండదు గనుక బస్సుడబ్బులు దండగయ్యాయని యింటికి తిరిగివస్తాము. కానీ ఈ చిక్కులేమీ వుండవు రేడియోలో! పొద్దస్తమానం రేడియోని మ్రోగించినా నెలకి కరెంటు డబ్బు ఎక్కువ అవదు. పదిహేనిడాదికి ఒక్కసారే గా లైసెన్సు కట్టడం! చక్కగా పడుకునే చెవిదగ్గర రేడియో స్విచ్ వేస్తే మంచిపాటలు వినిపిస్తాయి. హేమాహేమీల ఉపన్యాసాలు వినిపిస్తాయి. వాళ్లు ఎంతసేపు అవి వినిపించ సంకల్పిస్తారో అంతసేపూ నిరుత్సాహపంచకుండా కార్యక్రమాన్ని సాగించేస్తారు. ఒకవేళ ఎప్పుడైనా అనుకున్న వ్యక్తి రాలేకపోయినా మరొకరు ఆ విషయాన్ని గురించి వారికి తోచినవి 'నాలుగు' చెప్పేస్తారు.

ఆడవాళ్ళకసలు ప్రపంచానికి సంబంధించిన అనేక విషయాలని గురించి తెలుసుకునేందుకు అవకాశాలు తక్కువ. సంసారం, వంటయిల్లూ వున్నవారికి దినపత్రికనైనా పూర్తిగా చదివేందుకు వీలుండదు. అటువంటప్పుడు మధ్యాహ్నంపూట హాయిగా నడుంవాల్చి రేడియో త్రిప్పితే వారికని ప్రత్యేకంగా జరిగే కార్యక్రమం, వారికి ఉపయోగపడే అనేక విషయాలని గురించి ప్రసంగాలు, విజ్ఞానపరిషత్తులు జరుగుతుండడం ఎంతో ఆనందించవలసిన విషయం. నిత్యజీవితానికి అవసరమైన వంటయింటి విషయాలనే మరచిపోయి బుద్ధి మందగించేవారు ఆ విషయాలను సవిస్తరంగా వర్ణించే రేడియో కార్యక్రమాలని వినే అవకాశం ఎప్పటికీ పోగొట్టుకోకూడదు. ఇంతకీ మహిళల అభ్యున్నతికి తోడ్పడే 'శక్తుల' లో రేడియో ఒకటని అనుకోవచ్చు

స్త్రీలకు సంబంధించిన ఆరోగ్యరక్షణ, పిల్లల పెంపకం మొదలైన సర్వసాధారణమైన విషయాలు కొన్నివున్నాయి. వాటిని గురించి చర్చించవలసి వచ్చినప్పుడు వైజ్ఞానిక దృష్ట్యావిషయ మొకటే అయినప్పటికీ, స్వానుభవాన్ని బట్టీ, దృక్పథాన్ని బట్టీ ఒకొక్కరు ఒక్కొక్కరకంగా చెబుతారు. కొంత విసుగు కలిగించినా వారు చెప్పేదానిలో కొత్తవిషయాలుండి తీరు

"రోహిణి"

తాయి. నాట్యం, సంగీతం, దుద్దుల అలంకరణ, చీరకట్టు మొదలైన వేగాళ బొద్దింకలని గురించీ కప్పలనిగురించీ ఉపన్యాసాలిప్పించి, శ్రోతలకొత్సుకాన్ని ప్రేరేపించి, వారికి అందుబాటులోవుంచేటట్లు చేయటం కష్టం. వాటిమీద ప్రత్యేకమైనపరిశోధనలు చేసి జ్ఞానాన్ని సముపార్జించిన వ్యక్తులని సంఘటితపరచి విజ్ఞానపరిషత్తులని ఏర్పరచటం మరీకష్టం.

ఆమధ్య సినిమాతారల పరదాలనీ, అభిరుచులనీ ముఖ్యంగా జీవితాశయాన్ని తెలిపేందుకు స్త్రీల కార్యక్రమాల్లో కొన్ని యింటర్వ్యూలు నడిపారు. శ్రోతలు అసంతృప్తి ప్రకటించటమువల్లనో మరేకారణం చేతనో అవి కొనసాగలేదు. ఒక సినిమాతార అనుభవాలనిగురించిగానీ రాజకీయవేత్త కార్యదక్షతనుగురించిగానీ మనకేమీ తెలియకపోవచ్చు. అవి వారిస్వానుభవాలు. వారు ఎంత అసంతృప్తికరంగా ప్రసంగించినా విమర్శించేటప్పుడు మనం జాగ్రత్తపడటం అవసరం. బాగులేదని చప్పరించటము సులభమే. కాని అవి పూర్తిగావారి వ్యక్తిగత అనుభవాలు. ఆకుకూరలు, పచ్చళ్లు, మొదలైనవి వేరు. ఎక్కడోతప్ప ప్రతిస్త్రీకి అంతో యింతో వంటచేయటం వచ్చివుంటుంది. అలాగే కుట్టుపనులు, సంగీతం నాట్యం నేర్చిన మీదా, నాట్యం అంటే ఎలా వుండగలదో తెలియని స్త్రీచేత ప్రాచీన దేశపు నాట్యరీతులమీదా, కొంత సాహిత్యాభిరుచివున్న యిల్లాలిచేత ఆకుకూరలమీదా ప్రసంగాలు యిప్పిస్తే వినటానికి కష్టంగా వుంటుంది. అంతే కాదు, బొద్దింకలు యింట్లోకి రాకుండా ఏమి చెయ్యాలి? అనే విషయంమీద నలుగురి స్త్రీల మధ్య ఒక విజ్ఞాన పరిషత్తు నడిపించినా వినటానికి గమ్మత్తుగా వుంటుంది. "పెళ్ళికూతురు", 'వినాయకుడు' మొదలైన విచిత్రమైన ప్రసంగాలు గూడా చాలా హాస్యాస్పదంగా పరిణమిస్తాయి.

'ఆకుకూరలను మూడు భాగాలుగా విభజించవచ్చు. ఒకటి తోటకూర, రెండు బచ్చలకూర, మూడు గోంగూర' అని చెప్పుకుపోతుంటే చెప్పేవాళ్ళకీ వినేవాళ్లకీ గూడా నీరసం పుట్టక తప్పదు. నిద్రనుగురించి ప్రసంగిస్తూ ఓ గొంతు 'నిద్ర మానవులందరికీ సామాన్యముగా వచ్చును. అది వచ్చినప్పుడు కన్నులు మూతబడును' అని ప్రారంభించింది. ఆ వాక్యాలు నన్ను కలవరపెట్టాయి. నాట్యాన్నిగురించి కొంత తెలిసినవారు 'స్త్రీలు నాట్యం చేస్తే బాగుంటుందా లేక పురుషులు నాట్యంచేస్తే బాగుంటుందా?' అనే విషయాన్ని గురించి ఎప్పటికీ ఆలోచించరు. సౌందర్య పిపాస మోతాదు కొంత ఎక్కువగా వున్న వారికి కూడా 'పురుషులు అందముగా వుండెదరా లేక స్త్రీలు అందముగా వుండెదరా?' అనే చర్చ ఆహ్లాదాన్ని కలుగజెయ్యదు.

బజారుకి పురుషులే స్వయంగా వెళ్ళి బేరాలుచేస్తే లాభకరంగా వుంటుందా లేక స్త్రీలా? స్త్రీలు భర్తల పేర్లను తమ పేర్లతో జతపరచుకోవటం బాగుంటుందా? హాస్యరసం స్త్రీలుఎక్కువకనబరుస్తారా లేక పురుషులా? అనే విషయాలమీద న్యాయాన్యాయాలతో సంబంధంలేకుండా 'కొందరిని చర్చించమని, వాటికి 'విజ్ఞాన పరిషత్తు' లని పేరుపెట్టడం హాస్యాస్పదంగా వుంటోంది. ఇటీవల స్త్రీలు యింట్లోనే వుండి నాట్యాన్ని అభ్యసించేందుకు రేడియోవారు ఒక అవకాశాన్ని కల్పించారు. ఊహా తెలిసిన ప్రతిబాలికా పాఠ

రాజా - పేద

వెల రు. 2-0-0

తపాల ఖర్చు ప్రత్యేకం.

ఆంధ్రగ్రంథమాల, మద్రాసు.

★ అపరాహ్ణం - విజ్ఞానం ★

కాలము వెళుతుంది గనుక యిండ్లలో మధ్యాహ్నం పూటల తీరుబడిగా కూర్చునే ముసలమ్మలూ, గృహిణులూ దానివల్ల కాలక్షేపం చేసేందుకు మంచి అవకాశం ఏర్పడింది.

స్త్రీల ఆరోగ్య రక్షణకూ, గృహనిర్వహణకూ సమాజ స్నేహాభివృద్ధికీ పనివచ్చేందుకు అనేక ప్రసంగాలు పెట్టవచ్చు. తొక్కుడు పచ్చడిని గురించి ఒక యిల్లాలు పదినిముషాలు అనర్గళంగా మాట్లాడినా, సూదిలో దారం ఎలా ఎక్కించాలో ఒక

24-11-54

ఉన్మత్తుని ఆదర్శలోకం

సి. ధర్మారావు

సాయంకాలము నాలుగు గంటలకు కొండగట్టుకు షికారు బయలు దేరాను. ఓ చిన్న ఇసుకవాగులో కాలి బాటకు ప్రక్కగా చతికిలబడ్డాను. ఆకాశం కొంచెం మేఘావృతమై వాతావరణం చల్లగావుంది. కొండచరియల్లోంచి చెల్ల మీదుగా గాలి తెరలు తెరలుగా చల్లగా వీస్తున్నది. ఇసుకలో మేనువాల్చి, చేతి మీద తల ఆనించి గులకరాళ్లతో ఆడుతూ, పడుకున్నాను. ఉల్లాసకరమైనవాతావరణం కావటంమూలాన మనసు రకరకాల ఆలోచనలతో గంతులేస్తూవుంది.

కొంచెందూరంలో - ఓ యువతి - బట్టలు కొంచెం నలిగినట్టున్నా - ఆధునికపద్ధతిలో వేషధారణ గావించి ఆలోచనాపూర్వకంగా ప్రక్కనున్న దారివెంబడి వస్తున్నది. సహజంగా అందమైన ఆ యువతికి చెదురుతున్న ఆ ముంగురులు, విలాసమైన ఆ నడక మరింత సోయగాన్ని చేకూరుస్తున్నవి. కాళ్లకు చెప్పులున్నాయి. చదువుకున్నదని తోచింది. దరిదాపుల్లోకొచ్చింది. ఆమె నా వునికిని గమనించిన సూచనలు కన్పిస్తున్నవి. మొహాము క్రిందకు దించి, అప్పుడప్పుడు అవతలవైపుకు తిప్పుతూ నడకవేగం కొద్దిగా హెచ్చించి చరచరా నడిచివస్తున్నది.

నేనలాగేపడుకునివుండి "ఏమండోయ్! అన్నాను. వినిపించలేదేమో మరి, కొద్దిగా కదలికలో మార్పున్నా—ఆమె అలాగే వెళ్ళిపోతున్నది. ఇప్పటికా యువతి నన్ను దాటి నాలుగైదు గజాల్లో వుంది.

"ఏమండోయ్, మిమ్మల్నే!" అన్నాను గొంతు పెంచి. ఆమె వెనక్కి తిరిగి నావంక చూసి మళ్ళీ తలప్రక్కకు తిప్పి అన్నది. "మీ రెవరో నాకు తెలియదు...ఎందుకు పిలుస్తారు?"

"మీరెవరో నాకూ తెలియదు, అయినా పిలిచాను" ఆమె కొంచెంసేపాగి మళ్ళీ నావైపు చూసింది. కొంత కలవరపాటుతో అన్నది:

"మీదీ వూరే అనుకుంటాను. నేను... వూరు పోవాలి. ఇక్కడికింకా రెండు మైళ్లదాకా వుంది. చీకటి పడ్తోంది, వెళ్తాను."

"మీరు వెంటనే వెళ్ళిపోవటానికి కాదు నేను పిలిచింది"అన్నాను. తటపటాయించి మళ్ళీ అంది:

"మీ వుద్దేశ మేమిటో...అర్థం కావట్లేదు"

"అబ్బే, ఏం లేదు...నాకేమీ తోచటం లేదు. కొంచెం కబుర్లు చెప్పుకుంటూ కూర్చుందామని."

ఈసారామె వదనంలో కొంత ప్రసన్నత తొంగిచూసింది.

"మీరు స్టూడెంటులా వున్నారు... అయినా ఇలా ఒంటరిగా పోయే ఆడవాళ్లని పలకరించటం ఏమంత..."

ఎంతకీ ఆ వాక్యం పూర్తిచెయ్యదేం? "ఏమిటి వుద్దేశ్యం!" అన్నాను: "ఏమిటి మీ రనేది? ఈ సమయంలో ఇటు ఎవరు పోతున్నా 'ఏ' వూరుకి', 'ఎక్కడికి పోవాలి?'—ఇలాంటి వేవో ప్రశ్నలువేసి కొంత కాలక్షేపానికి తప్పకుండా ప్రయత్నించేవాణ్ణి. అందులో మీలాంటి సమవయస్కులు కనపడటంమూలంగా కొద్దిసేపు కూర్చొపెట్టి మాట్లాడదామని బుద్ధిపుట్టింది" అని ఆమెవంక చూశాను. ఆమె ముఖం దించుకుంది.

"అయినా, మొగవాళ్ళయితే అనుకోవచ్చు, కాని స్త్రీలతో ఇలా సంభాషణకి దిగటం..."

ఇక్కడే నా మతిపోతున్నది... "మొగాళ్లూ, ఆడాళ్లూ అంటా రేమిటండీ? ఆడాళ్ళకి మాట్లాడటం చేతకాదా ఏమిటి? కాస్సేపు కాలం గడపటానికి ఆడా, మగా తేడా ఎందుకుండాలి అని?"

కొంచెంసేపాగి మళ్ళీ అన్నాను.

"ఇంతకీ … అని మీరు భయపడుతున్నారులా వుంది. అంతకీ అవసరమైతే మిమ్మల్ని మీ వూరు వరకూ పంపించొస్తాను, నాకీ ప్రాంతం సుపరిచితం. అసలంత భయంవున్నవాళ్లు ఒంటరిగా పోవల్సి ఎందుకు వచ్చిందో?"

"నేను...పట్టణం కాలేజీలో సెకండియరు చదువుతున్నాను. శెలవలకి ఇంటికి రాబోతూ మా నాన్నకి వుత్తరం రాశాను: 'ఫలానా తేదీనాడు బండికి వస్తాను, స్టేషనుకు రావల్సిందీ' అని. కాని ఆయ నెందువల్లో రాలేదు. గంటసేపు చూసి, కొత్త కాంతరాలవల్ల రాలేకపోయుంటారని నేనే బయలుదేరి వొచ్చేస్తున్నాను." చాలా చలాకీగా వుంది కంఠం.

"నే ననుకున్నట్టే, చదువుకున్న వాళ్లు గూడా అన్నమాట. అయితే కావల్సినంత మేటరు వుదుతుంది మాట్లాడుకోడానికి"

ఆమె అలాగే నిలబడివుంది. కూర్చోమంటే కూర్చోలేదు. ఇందాకటినుంచి పడుకునున్న నేను లేచి రబ్బర్ దిబ్బ కానుకుని కూర్చున్నాను. ఇద్దరిమధ్యా మౌనంలో ఒకనిమిషం గడిచింది. చివరి కామె అంది:

"కొత్తగా వుంది. ఇదివర కెప్పుడూ ఇలా స్టూడెంట్సుతో మాట్లాడలేదు"

"చాలా 'రిజర్వుడు' గా వుంటారన్నమాట. ఎవ్వరితోనూ మాట్లాడరా అసలే?"

"అంటే మా లేడీ స్టూడెంట్సుతో మాట్లాడకేం?..." నవ్వింది.

"మరింకా కొత్తేమిటి?"

"మరింకా కొత్తేమిటేమిటి? ఆడవాళ్లతో మాట్లాడితే ఎందుకు కొత్తగావుంటుంది? కాని ఇలా మగవాళ్లతో కూర్చుని మాట్లాడుతుంటే లోకం చాలా అర్థాలు తీసుకుంటుందని భయంగాని..."

"అబ్బబ్బ! నా మతి పోగొడ్తున్నారు. మీరు చెప్పేదేమిటో ఒక్కముక్క అర్థం కావటల్లేదు నాకు. ప్రపంచంలో అనేక మంది వ్యక్తులు అనేక కారణాలవల్ల అనేక చోట్ల ఒకరికొకరు తటస్థపడుతుంటారు, కాస్సేపు మాట్లాడుకుంటారు, వెళ్ళిపోతారు. అంతేగాని ఆడా, మగా తేడా ఏమిటి ఇందులో?"

"అబ్బ! మీరు మరీ ఏం తెలియనివాళ్లలా మాట్లాడతారేం?" సన్నగా నవ్వింది.

"నాకు నిజానికి ఇంతకి మించి ఏం తెలియదు".

"అయితే మీరు మామూలుమనుషులు కావట్టుంది. ఆకాశంలోనుంచేమైనా వూడిపడ్డారా, లేకపోతే పిచ్చివాళ్ళా?" తెల్లగా, గలగలా నవ్వింది.

"ఏమో" అన్నాను, నాకూ అర్థంకాక.

(30-వ పేజీ చూడండి)

గృహిణి అరగంట సేపు చెప్పినా మనం వినుకోవటానికి ఏలులేదు. కానీ స్త్రీలకి వ్యతిరేకంగా పరిణమించే ప్రసంగాలు మటుకు చాలా విచారాన్ని కలుగజేస్తున్నాయి. ఒక ప్రసంగంలో ఒక యిల్లాలు స్త్రీలకు వంటయిల్లే స్వర్గమని చెబితే వెంటనే మరో యిల్లాలు మరో ప్రసంగంలో స్త్రీలు సమాజసేవ చెయ్యాలని చెప్పటం చాలా హాస్యాస్పదంగా వుంటుంది. అంతే కాదు, కొన్ని విషయాలమీద చర్చలు, ఉపన్యాసాలు ప్రసంగాలు స్త్రీలకు ప్రత్యేకిస్తూ వారి అభిరుచులు అంతి నిర్దిష్టంగా పేలవంగా వుంటున్నాయనే అభిప్రాయాన్ని కలిగించటముకంటే మామూలు శ్రోతలందరికీ అని చెబుతూ ఉల్లాసాన్ని కలుగజేస్తే బాగుంటుంది.

మద్రాసు, స్కూల్ ఆఫ్ ఆర్ట్సులో జరిగిన
అభ్యుదయ చిత్రకారుల సంఘ
ప్రదర్శనంలోని చిత్రాలు.



మార్గాయాసం


—చిత్రకారుడు: ఎస్. పళయం.

రూపచిత్రి

—చిత్రకారిణి: శ

గారడీవాడు

—చిత్రకారుడు: వి. శివకో





★ ఉన్మత్తుని ఆదర్శలోకం ★

ఇద్దరం కాస్సేపు మాట్లాడలేదు. ఆమె నావంకే చూస్తూ నేవుంది నిలబడివుంది. నే నన్నాను:

"ఒకళ్ళనొకళ్ళని, ఇంకొకళ్ళనించాని ...ఏం బాగో లేదిది. మీరు కూర్చోవలసక పోతే నాతో ఏం మాట్లాడక్కర్లేదు, వెళ్ళి పోవచ్చు. ఏమిటి, ఇందాకనుంచికూచోండి స్వామీ అని చెప్తోంటే..."

"స్వామీ ఏమిటి, ఆడవాళ్ళని? దానికి స్త్రీలింగపదం లేదా ఏమిటి గొడవ" అంటూ నాకు ఓ పక్క నాలుగుగజాలదూరంలో కూర్చుంది నవ్వుతూ నే.

"దంపేశారు. స్వామినీ, గీమినీ అంటూ వింతలేనట్టుంది" అన్నాను నవ్వుతూ. కాస్సే పాగి అందుకున్నాను.

"నిజం చెప్తున్నాను, మీరు చాలా అందంగా వున్నారు. అవునా? నేనుకూడా బాగానే వుంటానని మావాళ్ళంటారు. ఈ ప్రకృతి ... మనం ... ఈ సౌందర్యాన్ని చూస్తే నిజంగా...ఓ తాజమహాల్ని చూసి నప్పుడు మనిషి పరవశించెందుతాడు. మరి ఇంత దివ్యమైనప్రకృతి ఒడిలో సజీవులైన ఇద్దరు సౌందర్యమూర్తు లింత హాయిగా వుండటంచూసి, మనిషి నిజంగా ఏమై పోవాలి?"

ఆయువతి ఆ అందమైనకళ్ళెత్తి నావంక చూసింది.

"కాని చూసినవాళ్ళు మనల్ని అనుమానిస్తారు...లేకపోతే ఏభార్యాభర్తలో అను కుంటారు"

"అదేమిటి? అక్కడే మీరు వస్తు వం వేస్తున్నారు. స్నేహితులో, పరిచయస్తులో ఇలా షికారుకొచ్చారనుకో వచ్చుగా. ఇద్దరు స్నేహితులు ఇలా బయటికొస్తే వాళ్లు బావా, బావమరదులో, మామా అల్లుళ్ళో, అన్నదమ్ములో అయివుండాలా? మనం ఆడా, మగా కనుక స్నేహితులో, అన్నా చెల్లెళ్ళో—ఇంకేవరో అయ్యే అవకాశం వుందిగాని, అన్నీ వొదిలి ఒక్క భార్యాభర్తలే అని ఎందుకనుకోవాలి?"

"అబ్బా, ఇంకెట్లాగండీ మీతో? ఒంటరిగా ఇలా షికారుకు భార్యాభర్తలు కాక పోతే మరెవరు వస్తా రనుకుంటారు?"

"అలా కాదు, నే చెపుతా వినండి. భార్యాభర్తలు షికారుకు రావచ్చు. లేదా ఇంట్లో నే కూచోవచ్చు. అంతేకాని ఏకాంతంగావున్న ప్రతి స్త్రీ పురుషుల్ని చూసి భార్యాభర్త లనుకోట మేమిటి, అర్థం లేదూ?"

ఆమె నవ్వింది. నేను నవ్వాను; ఇద్దరం నవ్వాము. నే నన్నాను:

"కాకపోయినా, ఇతరుల్ని పోనీ అట్లాగే అనుకోనివ్వండి. కృత్రిమమో, సహజమో కొంతసేపైనా గొప్ప ఆనందంపొందుతారు"

"సరిగ్గా అదే జరగదని నే నింతవరకూ చెప్పేది! దక్కని ఒక జంటను చూసి మురిసిపోగలస్థితిలో లేదు లోకం మరి మీ రనుకున్నట్టు."

"అదేమిటి? చూసి ఏ మనుకుంటుం దంటారు?" తెల్లబోతూ అడిగాను.

"ఒక రకమైన 'జలసీ' ఫీలవుతుంది"

"అరె! ఈ లోకంలో అందుబాటులో వున్నదేగా ఈ ఆనందం. ప్రతి భార్యాభర్తలకీ, 'జలసీ' దేనికి? మీ రేదో తప్పు అర్థం చేసుకున్నట్టున్నారు. లోకాన్ని చాలా నీచంగాను, హేయంగాను తీసేస్తున్నారు..."

"అవును, వున్న విషయమే అది. ఈ లోకంలో ప్రతి అందం, ఆనందం మనుషుల చేతుల్లో పడి వికృతరూపాలుపొంది తమ సహజ స్వరూపాల్ని ఛిద్రించేసుకున్నాయ్. హేతువాదందృష్ట్యా ఏ విషయం ఎంత నిరాధారమవుతోందో అంత బాగా ఆ విషయాన్ని నమ్ముతాడు మనిషి."

"నిజమే, ఏమో!" నాకు ఆశ్చర్యం వేసింది.

ఎవరో వస్తున్నట్టు అలికిడి తగిలి ఇద్దరం ఆవైపు చూశాం. గభాల్న ఆ యువతి లేచి నిలబడింది. ఎందుకబ్బా! కొంత కలవరపడుతున్నట్టు కూడా కనపడుతున్నది.

ఆ వస్తున్న వ్యక్తి పంచెకట్టి, భుజాన కండువా వేసుకుని చేతిలో కర్రతో సహా గబగబా నడిచివస్తున్నాడు. దగ్గరలో కొచ్చాడు.

"అయనే మా నాన్న, నే నింకవెళ్తాను" అందామె.

"ఓహో! సరే, ఏమిటలా...వున్నారేం మీరు?"

"ఇవ్, వూరుకోండి"

"బయలుదేరి వచ్చేస్తున్నావా అమ్మా! నా పని తగలెయ్య, ఇట్లావుంది. అదు... ఆ పెద్దిగాడు, ఆడి మొకం తగలెయ్య, పొద్దునపోయి పప్పకాడి కిప్పుడుపచ్చాడు. ఇకొణ్ణి అక్కడపెట్టి నువ్వు కంగారుపడతా వేమో నని అక్కడికి గబగబా నే వచ్చా" అన్నా డాయన పుక్కటిప్పకోకుండా. అని నావంక చూసి ముఖం తిప్పకున్నాడు.

"పర్వాలేదులే నాన్నా! మనం వెళ్దాం. సామాను రేపు పాలేరుని పంపి తెప్పించొచ్చు, సీమనులోవుంచా.

"అట్టాగే లేమ్మా! ఈయన...ఎవరు?" నావంక చూడకుండానే అడిగాడు.

"ఆ, ఈవూరు వారేనట. నిలిపి ఏదో అడిగితే సమాధానం చెప్పి...రాబోతున్నా. ఇంతలో నువ్వు వచ్చావు"

"నిలిపి అడగట మేమిటి?, ఎక్కడా నూడలా. ఒంటరిగా వత్తన్న ఆడగూతురు గదా, మీకేం పనండీ మాట్లాడించటానికి?" అన్నా డాయన నా వైపు తిరిగి. ఏమిటి? మొహం మాడ్చుకున్నాడేం?

"ఏమిటి, మీరంతా ఏదో తరహాగా మాట్లాడుతున్నారు. ధస్తున్నా నర్థంచేసుకోలేక. ఒంటరిగాపోతూంటే మాట్లాడించటానికేం, మాట్లాడ్డానికేం? ఏం వూసుపోక ఏవూరండీ? అన్నా నేమో, అదే కొంచెం మాటల్లో దిగాము సరదాగా"

"బాగుందయ్యా తెలివితేటలు! బిక్కు బిక్కుమని వొత్తున్న ఆడమనిషిని బట్టుకుని యేంటో సర్దాగా పలకరిచ్చానంటావేంటి? కొంచెమైనా గుణముండక్కర్లా?" హుంకరించా డాయన.

"ఇప్పుడేంపోయిందిలే, రా నాన్నా! మనం వెళ్దాం" అంది ఆ యువతి కలవరపాటుతో, సర్దాలనే వుద్దేశ్యంతో.

"ఊహు, అదిగాదు. ఏదో సర్దుకుపోక 'సర్దాగా పలకరిచ్చా'నంటావేంటి సిగ్గన్నా లేకుండా."

నాకు ఒళ్లు మండిపోతోంది, ఏమిటా అనవసరంగా మాటలు మిగులుతాడూ అని. విసురుగా అన్నాను.

"సిగ్గెందుకండి, సిగ్గు! నేనేం ఘోరం చేశానని సిగ్గుపడాలంటారు? మీ అమ్మాయేం పసిపిల్ల కాదుగదా, ఆ బంగారంగట్రా ఎత్తుకుపోవటానికి! ఆమెతరఫున యేమిటో రక్షించేవాడిలాగా వకొల్తా పుచ్చుక మాట్లాడతా రేమిటి? ఆమెసంగతామెకి తెలియదూ, మధ్య మీ కెక్కడైందేబాధ?"

మా మధ్యవస్తున్న ఈ అవాంఛనీయ పరిణామానికి, పాపం ఆ అమ్మాయి చాల గల్లంతుపడుతున్నట్టుంది. "మీకైనా వుండక్కర్లా?" అన్నట్టు నావంక బింకంగా, విసుగ్గా చూసింది.

"ఊ, అంతవరకొచ్చిందీ? ఆడగూతురనన్నా లేకుండా, అట్టావాగి ... ఏమిటా పొగరు?" చేతులు మసుస్తున్నట్టున్నాడు.

"ఆడకూతురు, ఆడగూతురంటా రేమిటండీ? ఆడగూతురైతే కానిపనేంచేశాన్నను? తిట్టానా కొట్టానా? ముద్దెట్టుకున్నానా?" అన్నా తేలికగా నవ్వుతూ.

ఇంతలో ఆయన గబగబావచ్చి చెంప

(55-వ పేజీ చూడండి)

ఏలుబడి

(పెద్దకథ)

జి. పార్వతి

(గత సంచిక తరువాయి)

3

అత్తగారి సంవత్సరీకాలకని అన్ని వస్తువులు సిద్ధంచేసి బ్రాహ్మలకి కూడా సరైన సమాధానాలు చెప్పింది. శర్మ గారి అప్పచెల్లెళ్ళిద్దరూ పిల్లలతోను చేతి సంచీలతోను హాజరైనారు. యిల్లంతా ఒక విధమైన హడావడిగానే వుంది. లలితకి యింట్లో అందర్నీ చూసేసరికి స్కూలుకి పోబుద్ధిపుట్టలేదు. పొద్దునే ఒదినచేత బిగుతుగా జడేల్లించుకుని సిల్కుపూలపరికిణీ వాయిలు జాకట్టు తొడుకుకుని యింటికి వచ్చినఅత్తచిన్నకూతురు జానకి, చిన్నపాపతోను మేడమీద కెళ్ళింది. యింక బొమ్మల పెళ్ళిళ్లు, గచ్చకాయలకి లోటేమిటి?... ఒదిన మూడురోజులు హడావడిలో బుజ్జిగాడి మాటగాని లలిత మాటకాని అంత పట్టించుకునేందుకు వీలుకాలేదు. బుజ్జికి కొంచెం మాటలు, అన్నీ తినాలని ఆసక్తి కూడా వచ్చిందిగా!...యింక అమ్మ చూడకుండా యిష్టమొచ్చినట్టు తినేసరికి మర్నాడు ఒళ్లుతెలీని జ్వరం ప్రాప్తమయింది. లలిత బిత్తరచూపులతో అన్నయ్య దగ్గరకెళ్ళి "అన్నాయ్, బుజ్జికి జ్వరంగా వుందిట డాక్టరుని రమ్మని చెప్పమంది ఒదిన" అని అంది...రంగారావు వున్నపాటున గదిలోకెళ్లి తొంగి చూశాడు. పెళ్లాం చెంగుతో విసురుతూ బుజ్జిగాడి మూల్గుకూడా వినపట్టుగా లలిత మేనత్తలతో సంభాషిస్తోంది. "ఏమే బుజ్జికి జర్వం వచ్చిందిట నాకు తెలిదే?..."అని ప్రశ్నార్థకంగా చూశాడు. ఆండాళు పమిట పైకి తీసుకుని "నేను మడిగా వుండటం మూలాన లలితి, వీడు ఏంతిన్నాడో ఏమో చూడ లేదు. యింతటితో బయటపడితే చాలు భగవంతుడా" అని బుజ్జికేసి అమాయికంగా చూసింది. డాక్టరుగారు చెయ్యిచూసి అజీర్ణం అని మందురాసిచ్చారు. యింట్లోవున్న వాళ్ళందరూ ఇంక ప్రయాణ సన్నాహాలలో పడ్డారు.

లలిత మేనత్త బండెక్కబోతూ లలితని పక్కకి పిలిచి "ఏమే!... ఒదిన నిన్ను కొట్టి, తిట్టకుండా ప్రేమగా చూస్తుందా?" అని సూటిగా ప్రశ్నించింది. లలిత చేయి విదిలించుకుంటూ "నువ్వు జానకిని, చిన్న పాపని చూసినట్టే చూస్తుంది, అయినా నాకు అన్నీ తెలుసు స్కూలుకి ఎలా పోవాలో బుజ్జితో ఎలా ఆడుకోవాలో..." అని పరిగెత్తి వెళ్లిపోయింది. అత్త నిర్ఘాంతపోయి చూసింది ఎంత వగలాడి వేబాబూ, యింతపిల్లకి అంతలేసి మాటలు అనుకుని వీధిలోకి దోవ తీసింది. బండి కదలగానే బుగ్గలు నొక్కుకుంటూ లలితకేసి చూపెట్టి చెల్లెలికి ఏదో చెప్పింది. బహుశః లలిత గూర్చేనేమో...ఒదిన దిగులుగా కూర్చుని వుంది, సంజవేళ లలితను దగ్గరకిపిల్చి "ఏదీ వొళ్లు చూపనీ, ఏదీ నోపలేదమ్మా ఈ శరీరాలు ఏంకర్మమోగాని" అని ఒళ్ళు తాకి చూసింది. లలితకి ఆ చల్లనిచేయి ఎంతో ఆనందాన్ని మాతృసుఖాన్ని యించ్చాయిఒదిన ఒళ్ళోకి వాలిపోయి అత్తకి, తనకిజరిగిన సంభాషణ వెల్లడిచేసింది. ఒదిన ప్రేమపూరితస్వరంతో "నాతల్లికి లోటురానిస్తానేమోనని భయపడిందేమో ఆయిల్లాలు. నువ్వే చెప్పు లలితా!...నీకు అమ్మ జ్ఞాపకం రావటంలేదు కాదు? అని ప్రశ్నించింది తనదే జయమన్నట్లు. లలిత మంగళసూత్రాన్ని జోడించి శబ్దంచేస్తూ "అలా అడక్కు ఒదినా, ... నువ్వంటే నాకు అమ్మలాగే అన్పిస్తుంది. నాకు మళ్లా అమ్మ జ్ఞాపకంరాదు స్కూల్లో మేష్టారు మందలించితేతప్ప..." అని జవాబిచ్చింది. ఒదిన కళ్లు పెద్దవిచెసి "అయితే మేష్టారు తిడతారేం నిన్ను? వుండు రేపు అన్నయ్యగారితో చెప్పి ఆయన్ని ఏమీ అనొద్దు యికమీదట అని చెప్పిస్తానని" సముదాయించింది.

లలిత ఒకవిధంగా అడపడుచు, తనకి దూరం, దగ్గర సంబంధం కలదైనా ఆండాళు బుజ్జిగాడిపైన పుట్టినపిల్లే నేమోనని అభిప్రాయపడేది. తనకి పుట్టిదని పోయిన పిల్ల బదలాయింపుగా అన్పించేది. కాని లలిత ఎప్పుడూ "అమ్మా!..." అని పిలవకపోయినా మాతృదేవిలా కన్పించేది ఆ అమాయికపు చిన్న హృదయానికి. ఇదంతా ఎవరూ అంత పట్టించుకోపోయినా తప్పులు మాత్రం పట్టి బయటపెడదామని చూస్తారు ...అదేగా లోకం తీరు...

పది రోజుల తరవాత మళ్ళీ యింట్లో పరిస్థితులు చికాకు అయినాయి. మామగారు మూలగదిలో మూల్గుతూ పడివున్నారు. లలిత రొంపదగ్గుతో ఆరాటపడుతోంది. ఇంటికి వచ్చే ధలక్ష్మికి కొదవలేకపోయినా మనసుకి శాంతి మనుష్యులతో నేగా! ..ఆండాళుకి పురిటిరోజులుకూడా వచ్చాయి. పుట్టింటినుంచి తమ్ముడు పరిగెత్తుకొచ్చాడు. ఆండాళు పరిస్థితులు వివరించి "యిలా వుందిరా యిల్లు...వస్నేం చేయమంటే అది చేస్తా. ఆయన అర్థ్యంతరం లేదు...కాని యిది మూడో కాన్పు కదా... నేను యిక్కడే వుండిపోదామని నిశ్చయించాను" అని ఆపి ఆపి చెప్పింది. తమ్ముడు తలాడించి "నీ కెలా యిష్టమో అదే చెయ్యి అక్కయ్యా, లేకపోతే నీ మరదల్ని అమ్మని పంపుతాను నెల్లాళ్ళకి" అని సమాధానమిచ్చాడు. ఆండాళు కంట్లో నీళ్లు మెరిశాయి. నిజంగా తనకి ఈ రెండేళ్లుగా శాంతి లేదు. తను పుటింటికి వెళ్ళి అనుభవం పురిటి పది రోజులతోను తృప్తిపడి వద్దామనుకుంది. కాని, మంగళసూత్రంతో పాటు ఈ సూత్రంకూడా తన కంఠాన్న బిగించుకుంది. లలిత గదిలోకి తొంగి చూసి దగ్గు నాపుకుంటూ ఒదినకొంగు పట్టుకుంది.

ఏలుబడి ★

ఒదిన క్రిందికి చూసింది. లలిత ఒదిన కళ్లలోకి చూస్తూ "ఒదినా!... నేనూ నీతో వస్తా అహ అయితేనే నువ్వు వెళ్ళటం... అయినా అమ్మ లేకుండా...నువ్వు కూడా పోతే నేను ఎలా వుండను ఒదినా," అని బావురుమని ఏడ్చింది. ఒదిన లలితని గుండె కదుముకుని "అంతలోకి ఏడ్పు ఎందుకమ్మా...నిన్ను విడిచి నేను వుండగలననే అనుకుంటున్నావా?...లేదు, లేదు నిన్ను విడిచి వెళ్లను గాక వెళ్లను పరేశా?..." అని లలిత కన్నీరు ఒత్తింది.

4

రెండేళ్ళలోనూ లలిత కొంత యింగిత జ్ఞానం తెచ్చుకుంది. అదివరకు వానలో తడిస్తే రొంప చేస్తుందని కూడా తెలిసేది కాదు. పూర్తిగా ఒదిన ఒక కన్ను లలిత మీద ఒక కన్ను బుజ్జిగాడిమీద వేసివుండాల్సిందే..., పండుగలు జరుపుకోడం అదే తొలిసారి. పెద్దమరిది సుబ్బారావూ, చిన్న తను రమణమూర్తి యింట్లోనే వున్నారు. పైగా పెద్దమరిది చదువు పూర్తి కూడా అయిందేమో పెళ్ళి సంబంధాలకికూడా లోటులేదు...దసరా పదిరోజులూ పూజలు జరిపించటానికి శాస్త్రులుగారికి చెప్పారు. లలిత పాళ్లీ జాకొలు, అటుకుల గొలుసు పెట్టుకుని ఒదినకి, అన్నగార్లకి నమస్కరించింది. చిన్నన్నయ్య నవ్వుతూ "లల్లూ! ...నిన్నేమని దీవించనే?...తప్పడ ముక్కు, చింతాకులాంటి కళ్లు పొట్టిగా, నల్లగా లావుగా వుండే మొగుడు రావాలనా?..." అని నవ్వాడు. ఒదిన వాళ్లు పగాలుపడి నవ్వేసరికి లలిత కాళ్ళు నేలకి కొట్టి ఏడ్పు ప్రారంభించింది. ముసలాయన నవ్వుతూ "తల్లీ!...చిన్న ఒదిన వచ్చిం తరువాతే, నా మొగుడు వస్తాడని చెప్పవే వాడి పెళ్లాం ఎంత అప్సరసో మాద్దువు గాని..." అని లలితని దగ్గరకి తీసుకున్నాడు. ఈ మాటకి అందరూ తాళం వేసి మేళంకట్టారు.

పండుగలకి బట్టలూ, వస్తువులూ సిద్ధమయాయి. లలితకి యిప్పుడు కొత్తగా

పుట్టిన అన్నగారి కూతురు ఒక ఆట బొమ్మలా వుంది. పాలివ్వటం నీళ్లుపోయటం తప్పించి తను రెండు కాళ్లను దగ్గరికిచేర్చి చేతులు వెనక్కి విరిచి నేలకు ఆనించి, "ఒదినా...ఒక్కసారి కాంతని పడుకో పెట్టవూ..." అని దీనంగా అడిగేది. ఒదిన నవ్వుతూ "అబ్బ, ఏంపరదాయే తల్లీ, నీకు గంపెడు పిల్లలు కావాలని దీవిస్తున్నా అప్పుడు పోతుంది నీ భ్రమ" అని వేళాకోళాలాడేది. చిన్నన్నయ్య ఆ యిద్దరికీ ఫొటోలు కూడా సావిట్లో వ్రేలాడతీసి గట్టాడు.

లలిత గబగబా తండ్రిదగ్గరకి పరిగెత్తి "పండుగపూటా నువ్వు కొత్తబట్టలు కట్టుకోవాలిగాని ఈ ముడతలపంచ ఏమిటి నాన్నా..."అని అడిగింది. తండ్రి బంగారు తలిని ఒళ్ళంతా ఒకసారి ముద్దెట్టుకుని "పండుగ మీరు చేసుకుంటూంటే చూడ్డమే నాకన్నులపండుగ...అవును కానీ పొద్దుట లేచి కాఫీలకి ఒదినదగ్గర కూమని సాయం చేయకూడదమ్మా?...నీకూ కొంత చేతవుంది" అని కన్నతల్లి మొహంలోకి చూశాడు. లలిత తండ్రిబుజాన ఆనుకుని అవును నాన్నా..., ఆమాట నాకు ఎవరూ చెప్పలేదు. మా క్లాసులో గీత తనే వాళ్లింట్లో కాఫీలు కల్పుతుందిట. మరి వాళ్ళింట్లో నౌఖర్లు లేరు, తరువాత మన ఒదిన నన్ను ఏపనీ చేయనీదాయె" అని తనతప్పు సవరించుకుందుకు ప్రయత్నించింది. నవ్వుతూ "అదా సంగతి, పోనీ రేపట్నుంచి చేసి చూడు" అని వీపుతట్టి గదిలోంచి అవతలకి వదిలాడు. లలిత వసారాలోని స్తంభానానుకుని సన్నగా పడుతున్న చినుకుని పరిశీలనగా పరాకుగా పరికిస్తోంది. పెద్దన్నయ్య, చిన్నన్నయ్య ఏదో వుద్యోగ విషయాలు మాట్లాడుతూ లలితను చూసి ఆశ్చర్యపోయారు. లలిత వాళ్ళని గమనించనే లేదు. పెద్దన్నయ్య గడ్డం పట్టుకుని పైకెత్తి "లలితా!...అలా వున్నావేం?... ఒంట్లో బాగుందా?" అని ప్రశ్నలవర్షం కురిపించాడు. చిన్నన్నయ్య సమాధానం విననీయకుండానే లలిత చెవులో సినిమా సంగతి చెప్పి నవ్వించాడు. ఒక్కసారి పెద్దన్నయ్య, చిన్నన్నయ్య ఒకరినొకరు చూసుకుని నవ్వుకున్నారు. పెద్దన్నయ్య జేబులోని అయిదురూపాయలనోటుతీసి లలితకుప్పెట్లో పెట్టి మూసేసి "జాగ్రత్త... పిచ్చిపిల్లా..." అని నవ్వాడు. లలిత చేతిలో నోటుతీసి అన్నయ్య జేబులో పెడుతూ "మరయితే యివాళ సినిమా డబ్బు నా చేతిమీదుగా నడవాలి" అని కిలకిలా నవ్వింది: అదేగా అన్నగార్ల వాంఛ...

ఒదినని ఎంత బ్రతిమిలాడినా రానని ధాటిగా చెప్పింది. పెద్దన్నయ్య దేనికైనా సమ్మతమే......మామగారు లలితని పిలిచి "అమ్మా!...ఒదినని తీసికెళ్ళాలిసుమా..., పాపం, అది ఒకర్తి యింట్లో వుండటం బాగుండదు నేను యివాళ పేకాట మానేస్తున్నానని చెప్పు" అని కబురంపాడు. కోడలు వచ్చి ఆరు, ఏడు ఏళ్లు గడిచినా ఎప్పుడూ కోడలితో ముఖతా మాట్లాడింది లేదు. నౌఖర్లు, కొడుకులు వుండగా అంత అవుసరం కన్పించలేదు కూడాను. ఇవాళ అప్రయత్నంగా కోడలు గదిలోకి వెళ్ళి కోడలితో వెళ్తేగాని వీల్లేదని వెల్లడించారు. కోడలు నేలచూపులతో సమాధానమిచ్చింది. లలిత ఒదినచుట్టూ తిరిగి "అయిందా ఒదినా?...నా మాటమీద నమ్మకం లేదు నీకు. నా డబ్బుతో చూపెడతానని చెప్తూంటే వినవేంటి నువ్వు!..." అని హేళనగా చూసింది. అందరూ కొత్త బట్టలతో గుర్రంబండి ఎక్కారు. ఆ వేళ సినిమా చాలా రసవత్తరంగా అన్పించింది. చాలా బాగున్నారు కూడా అందులోని పాత్రధారులు...

5

రాజమండ్రినుంచి ప్రసాదరావుగారు తమ ద్వితీయ పుత్రికను పెండ్లిచూపులు చూసుకోవలసిందిగా వుత్తరం రాశారు. రంగారావు ఆ కార్డుని తీసికెళ్లి తండ్రిచేతికిచ్చాడు తిన్నగా. కళ్లజోడు పెట్టుకుని కార్డు రెండు పెడలు చదివి "పిల్లని చూసేందుకు వెళ్లమని చెప్పు వాడితో. వాడి కేలా కావాలో అలాగే కానియ్యండి యీ విషయంలో యిష్టాయిష్టాలు అవసరం లేదురా" అని ఆ కార్డుని పుస్తకంకింద వుంచి వెళ్ళిపోయారు.

సుబ్బారావు సూటు బూటు పోకుగా వేసుకుని లలితని అడిగాడు "ఏమే లల్లూ నన్ను వరిస్తుందా పిల్ల?..." అని. లలిత క్రాఫు సర్దుతూ పెద్ద ఏదో తెలుసున్న దానిలా "అందమైన మొగాడివి నువ్వేరా చిన్నన్నాయి" అని వుబ్బేసింది అన్నగార్ని. అండాళు నవ్వుతూ "నీలాగే అందరూ చేసుకునేవాళ్ళకిమల్లే బయల్దేరితేని వంకలు డొంకలు ఎంచి ఆరాలు తీస్తారు" అని అంది. "ఒదినా!...పిల్లని చేసుకుందామనే బయల్దేరుతాం, కాని ఆ పిల్ల మేము హృదయంలో లిఖించుకున్న కల్పనమూర్తి కాకపోగా ఏదో దుర్యాహ్యంగా కన్పిస్తే మరేం చేయాలి?..." అని నవ్వాడు. ఏమైనా కానియ్యండి అండాళు ఈ సంబంధంగురించి ఏమీ తెలి

★ ఏలుబడి ★

...లేకపోయినా వచ్చే పిల్ల మాత్రం తనలా ఒక స్థిరమైన, బలమైన స్థానం ఏర్పరచుకుని నాటుకుపోవాలని వూహించింది. సుబ్బారావు అన్నగారితో సహా పెండ్లిచూపులకి వెళ్ళాడు. శర్మగారు ఏ మాత్రం చలించలేదు. తన పనేదో తనదే. ఆయన ఒక సాధువు. లలిత ఏదో కొత్త మార్పు రాబోతోన్నట్టు "ఒదినా, నేను స్కూలుకుపోను" అని అంది. బుజ్జిగాడు ముక్కుని కారే చీమిడి వంతా పమిటకి తుడిచిపారేశాడు. మంచం మీంచి దిగలేక మంచంమీద వుండలేక కాంత ఏడుస్తోంది.

"అబ్బ, వుండరా మరీ దారుణంగావుంది నీ పని" అని పటపటా కొరికింది పళ్లు. ఎప్పుడూ లేని ఒదినగారి కోపం చూసేసరికి లలిత బెంబేలుపడింది. పరికిణీ దులుపుకుని పుస్తకాలతో స్కూలుకు బయల్దేరింది. నిజానికి పెండ్లిచూపులకు వెళ్ళినంత మాత్రాన పెళ్లిఅవుతుందని నమ్మకమేమిటి?

...అదికాదు అండాసులో లేవనెత్తిన తుఫాను మరొకరకమైనది. ఏదో ఒక పిల్ల వచ్చింతరువాతే పెళ్ళయి యింటికి తనలాగే రాబోతోంది. ఆ క్షణం ఎప్పుడో ఒకప్పుడు వచ్చితీరుతుంది. తనలాగే తన అత్తగారుకూడా పెద్దకోడలు వచ్చేప్పుడు ఆలోచించిందా?...లేదే...పెద్దకోడలు వచ్చే రోజు యిల్లంతా అల్లంకరించి అంతా సుగంధద్రవ్యపు సువాసనలతో నింపిందే... పైగా ఆరోజు వల్లురు మనుష్యులుకూడా సునాయాసంగా లేవనెత్తలేని రెండు పందిరి పట్టెమంచాల్ని ఆవిడ గదిలోంచి తన గదిలో పెట్టించింది. ఆవేళ తనకి బాగా జ్ఞాపకంవుంది పూలజడ నుసుకుతూ చెవిలో అంది. "అమ్మాయి,...నా తరువాత నువ్వు మళ్లా అంతదానివి కావాలి. నాతో పనిలోను మాటలోను కలసిపోవాలమ్మ అప్పుడే యీ యింటికి శాంతి" తనకి నిజంగా ఒళ్ళు జలదరించింది. తెలీకుండా చీర కన్నీటితో తడిసింది. అత్తగారు, తనూ తల్లీ కూతురుకన్నా ఎక్కువ సన్నిహితంగా వుండేవారు. మళ్ళా అత్తగారు పోయినా నాల్గేళ్ళనుంచీ యింట్లో ఎవరిమననూ ఖేదపడకుండా యింటిని అతి శాంతియుతంగా నడిపిందే...

6

వంటావిడ మళ్ళీ కడుపునొప్పి వంకతో సెలవు తీసుకుంది. వంటంతా అండాళు తన స్వహస్తాలతోనే మొదలెట్టింది. లలిత కుంపటివిసరటంతోనే ఒదినగార్కి సహోపకారం చేస్తోన్నట్టు వూహించింది. సుబ్బారావు పెండ్లిచూపుల తరువాత ఆ దుస్తుల్ని విడిచి పంచ, చొక్కాతో వంటింట్లోకి వచ్చాడు. స్నానానికి అనుకుని సుంచున్న మరిదిని చూసేసరికి అండాళు ఆశ్చర్యపోయింది. పోపువాసన అక్కడున్న వాళ్లందర్నీ వుక్కిరిబిక్కిరి చేసింది. "ఇవాళ వంటావిడ లీవు తీసుకుందేమిటమ్మా!..." అని అడిగాడు పక్కనున్న కిటికీలో కూర్చుంటూ. "ఆడవాళ్ళకి వంట చేయటంలో ఎబ్బెట్టు ఏముంది?...అసలు ఆవిడ్ని మాన్పించి నేను చేయాలనుకుంటే మీ అన్నగారు, అన్నయ్య ఒప్పుకోరు కాని నా చేతుల్తో ఏది పెట్టినా నాకు తృప్తిగా వుంటుంది" అని అంది తన ధోరణిలో. "లల్లూకూడా పనిలో దిగిందే ఏమి నీకు ఒదిన ఎంతజీతం యిస్తోంది?" అని అడిగాడు వేళాకోళంగా. లలిత మొహం చిట్లించి "ఆ జీతాలూ, బత్తేలూ మా చిన్నఒదినకే గాని నాకెందుకు?..." అని అంది కోపంగా.

అండాళు అదిరిపడి "యింతకీ పిల్ల ఎలా వుంది, ఏమిటి?" అని అడిగింది మరిదిని. "అంతా ఒక నాటకం ఒదినా,...గదిలో కుర్చీలూ బల్లలూ బలే షోకుగా వున్నాయి పిల్లని తెచ్చారు, పాడించారు కాని పిల్ల తండ్రికి మాత్రం చెయ్యి వంకర. పిల్లకి కూడా వుందేమో చూడమన్నాడు. అన్నాయి నా చెవిలో. సరే.....పిల్లని చూశాను ఆ పై సంగతులు వుత్తరం రూపంలో తేలగలవని జవాబిచ్చాను అన్నయ్య" అని పెద్దగా నవ్వాడు. లలిత, అండాళు కూడా నవ్వారు. లలిత ఏదో వినాలన్న ఆసక్తితో అన్నగారి పక్కకి చేరింది. అండాళు నవ్వు నాపుకుని "పిల్ల తండ్రి వంకరలన్నీ లెఖ్ఖపెట్టడంలో పిల్లని మరచలేదు కదా!...ఆ అన్నగార్కి తమ్ముడివే నువ్వు—ఏమిటో, ఆ పెళ్ళివిషయం నువ్వూ ఆయనా నిశ్చయించుకుని ఆ వెరి బ్రాహ్మడికి జవాబు రాయండి" అని సలహా యిచ్చింది.

రాత్రి తండ్రి యిద్దరు కొడుకుల్నీ పిలిచి సంగతి తెల్సుకున్నారు. సుబ్బారావుని నచ్చిందీ లేనిదీ ఒక్క ముక్కలో చెప్పమన్నాడు అన్నగారు. గొంతుక సవరించుకుని "ఎఫ్. ఏ. ప్యాసైన పిల్లని కొంచెం సందేహంగా వుందిరా" అని అన్నాడు. రంగారావు, శర్మగారు వికటంగా నవ్వారు. శర్మగారు కొంత తమాయించుకుని మరింటికొచ్చి మనతో అలవాటుపడితే తప్పకుండా కలుస్తుంది మనతో. అదంతా కల్ల మాట. అయినా నా పెద్దకోడలున్నంతమటుకు అలాటివి రానేరావు" అని పెద్దకొడుకు కేసి తృప్తిగా చూశారు.

తండ్రిమాటకి అడ్డువచ్చి రంగారావు "నీకు పిల్లనచ్చి చేసుకోవాల్నంటే యింక దానికి అడ్డులేదు. నా పెళ్ళాం చదువుకోక పోటంవల్ల అణగివుందన్నా, చదువుకుని తెలివితేటలుంటే దానికన్నా బాగా మసులుకోవచ్చుగా..." అని తమ్ముడికి నచ్చచెప్పాడు. ఏది ఎలావున్నా యీ సంబంధం నిశ్చయించాలని యిష్టం పుట్టింది రంగారావుకి. ఆ మర్నాడు పెళ్ళికూతురు తండ్రికి కబురు వెళ్ళిందనటానికి సందేహం లేదు. కాపైతే శర్మగారి కుటుంబానికి పెద్దపేరు, ప్రఖ్యాతి వున్నాయి కాబట్టి నాల్గు సంబంధాలు చూసి కాదనటానికి బాగున్న విషయంలా తోచలేదు. ప్రసాదరావుగార్ని గురించి తెలుసున్నవాళ్లు మంచిగానే చెప్పటంచేత పిల్ల చదువుకున్నదైనా దానంతట అదే కలిసిపోతుందని వూహించాడు రంగారావు. [ఇంకా వుంది]

బొమ్మరిల్లు

షికారు

‘పరాశర’

★

గలగల కాలువ పారే చోటుకు
అలజడిచేపలు చేసే చోటుకు
కొంగలు చేపలవెదికే చోటుకు
తుంగలు బారుగ ఎదిగే చోటుకు
సెలవు రోజులను షికారువెళ్తాం
పాపా, నేనూ, పరుగునవెళ్తాం !—

పచ్చిక హెచ్చుగ పెరిగేచోటుకు
పెచ్చరలేగలు గంతేచోటుకు
మెల్లగనీడలు ప్రాకేచోటుకు
చల్లని గాలులు సాగేచోటుకు
సెలవురోజులను షికారువెళ్తాం
పాపా, నేనూ, పరుగునవెళ్తాం!—

రైతులు పైరులు కోసే చోటుకు,
గీతులు కూలీల్ పాడేచోటుకు
ఘుమ్మని పువ్వులు విచ్చేచోటుకు,
ఝుమ్మని తేటులు పాడేచోటుకు
సెలవురోజులను షికారువెళ్తాం
పాపా, నేనూ, పరుగున వెళ్తాం—


★

పూర్వం క్రైస్లిస్ అనే నగరంలో ఒక తురుష్కుడుండేవాడు. అతడు చాలా ధనవంతుడు. అతని భోగభాగ్యాలకు లెక్కలేదు. కాని వీటన్నిటికంటే అతనికి ప్రాణప్రదమైనది అతని కుమార్తె. ఆమె పేరు మఘుల్ మెఘేరి. ఆ కాశంలో నక్షత్రాలు అందంగానే ఉంటాయి. కాని నక్షత్రాలవెనక దేవకన్యలుంటారు. ఆ దేవకన్యలు నక్షత్రాలకంటె అందమైనవారు. అలాగే క్రైస్లిస్‌లో ఉన్న అందమైన కన్యలందరికంటే అందమైనది మఘుల్ మెఘేరి.



క్రైస్లిస్‌లోనే అషిక్ కెరిబ్ అనే ఒక బీదయువకుడుండేవాడు. అతనికున్న ధనమల్లా మంచి హృదయం, అద్భుత సంగీతనైపుణ్యం. అతని దగ్గర ఒక చక్కని జంత్రవాద్యం ఉంది. ఆ వాద్యం వాయిస్తూ, తురుష్కదేశపు పూర్వ రాజుల మహాత్కార్యాలను పాటలు పాడుతూ, ధనవంతుల ఇళ్లల్లో వివాహాలు జరిగేటప్పుడు అక్కడికి వెళ్లి వాళ్లకి వినిపించేవాడు. ఒకసారి ఏదో అటువంటి వివాహ సందర్భంలోనే అతడు మఘుల్ మెఘేరిని చూశాడు. ఇద్దరూ పెళ్ళి చేసుకోవాలనుకున్నారు. కాని అదెల్లా సంభవమవుతుంది. అషిక్ కెరిబ్ గరీబు. ఆమె పెద్ద ధనికుని కుమార్తె. అందుచేత ఇద్దరి హృదయాలూ వర్షాకాలపు ఆకాశంలాగా చీకటైపోయాయి.

ఒకరోజున అషిక్ ఒకతోటలో ద్రాక్షపందిరికింద కూర్చుని ఆలోచిస్తూనే నిద్రపోయాడు. ఆదే సమయానికి మఘుల్ మెఘేరీకూడా చెలికత్తెలతో విహారార్థం అక్కడికి



వచ్చింది. వారిలో ఒకతె అషీక్‌ను చూసింది. చూసి దగ్గరికి వెళ్ళింది.

"ద్రాక్షపందిరికింద పడుకొని నిద్రపోతున్నావా, పిచ్చివాడా? లే. నీ లేడిపిల్ల అదుగో పారిపోతోంది," అని అర్థం వచ్చే పాట పాడింది. అషీక్ కళ్ళు తెరిచాడు. వెంటనే ఆ చెలికత్తె పరుగెత్తి తన వారిని కలుసుకొంది. మఘుల్ మెఘేరి ఆపాట విన్నది. "ఏమిటా పిచ్చిపాట?" అని కోప్పడింది.

"అది కాదమ్మా! ఆపాట ఎవరి కోసం పాడాననుకొన్నావు? నీ అషీక్ కరీబ్ కోసమే," అన్నది చెలికత్తె.

"అలాగా? అయితే అతన్ని ఇలా పిలుచుకురా," అంది మెఘేరీ.

అతడు రాగానే, అతని విచార ముఖం చూసి ఆమె "ఏం, అలా ఉన్నావేం?" అని అడిగింది.

"ఇంకెలా ఉంటాను మఘుల్ మెఘేరీ! నాకు నిన్నే పెళ్లాడాలని ఉంది. కాని నువ్వు అందరాని చందమామవైపోయావు," అన్నాడు అషీక్.

"అలాగైతే ఒక పని చెయ్యి. మా తండ్రిగారిని అడుగు, మీ కుమార్తె నిమ్మని. ఆయన ఖర్చులన్నీ తనే భరించి పెళ్ళిచేస్తారు. పైగా మనిద్దరికీ కావలసినంత ధనం కూడా ఇస్తారు."

"నువ్వన్నది నిజమే. మీతండ్రిగారు నీ సుఖంకోసం అలాగే చేస్తా

★ మఘుల్ మెఘేరీ ★

రను్నా. కాని నేను కటికదరిద్రుడి ననీ, నా బ్రతుకంతా నీ మీాదే ఆధారపడి వుందనీ ముందుముందు నువ్వు నన్ను చులకన చేస్తే? అది భరించగలనా? కాదు మఘుల్ మెఘేరీ! నేను చెప్పేది విను. నే నొక శపథం చేస్తున్నాను. ఏడేళ్ళ పాటు నేను దేశాటనం చేసి ధనం సంపాదించనైనా సంపాదిస్తాను; లేక చనిపోనైనా చనిపోతాను. దీనికి నువ్వు ఒప్పుకొనేట్లయితే, నేను ఏడేళ్ళతరవాత తిరిగివచ్చి. నపుడు నువ్వు నాభార్య వౌతావు"

అలాగేనని ఆమె అంగీకరించింది. కాని ఒకమాట చెప్పింది: ఏడేళ్ల తరువాత అషిక్ తిరిగిరాక పోతే, ఆమె తన నిదివరకునుంచీ పెళ్ళి చేసుకోగోరుతున్న కుర్దుష్ బేను పెళ్ళి చేసుకుంటుంది.

అషిక్ కెరిబ్ ఇంటికివెళ్ళి తల్లి ఆశీర్వాదం పొందాడు. చిన్న చెల్లెలును ముద్దుపెట్టుకున్నాడు. ఖజాన సంచీవేసుకుని, చేతులో ఒకకర్ర పట్టుకుని టైఫ్లిస్ నగరం నుంచి బయలుదేరిపోయాడు.

ఊరుదాటగానే, ఒక అశ్వికుడు అతన్ని కలుసుకొన్నాడు. అతడెవరో కాదు: కుర్ధూష్ బే.

"నీ ప్రయాణం సుఖంగా సాగాలని కోరుతున్నాను. నువ్వు ఎటు వెడితే నేనూ అటే వద్దామనుకుంటున్నాను," అన్నాడు కుర్ధూష్ బే.

ఈ శనిగాడెక్కడ దాపురించాడురా, అని అషిక్ చింతించాడు, కాని చేసేదేమీాలేక ఊరుకున్నాడు. ఇద్దరూ చాలాదూరం ప్రయాణం చేశారు. చివరికొక నది దగ్గరకు వచ్చారు. నది దాటేందుకు వంతెన లేదు; దాటించేందుకు పడవ లేదు.

"నువ్వు ముందు ఈదుకుంటూ వెళ్లు. తరవాత నేను వస్తాను," అన్నాడు కుర్ధూష్ బే. అషిక్ కెరిబ్ తన పైబట్టలు విడిచి గట్టున పెట్టి ఈదుకొని పోయాడు. ఆవలి గట్టుచేరాక వెనక్కి తిరిగి చూశాడు. మోసం! కుర్ధూష్ బే తన బట్టలు తీసుకొని అశ్వంమీాద హుటాహుటిగా టైఫ్లిస్‌కు పారిపోతున్నాడు. "అల్లా అక్బర్!" అంటూ దీనంగా అరిచాడు అషిక్.

టైఫ్లిస్ చేరి కుర్ధూష్ బే అషిక్ బట్టలు తీసుకుని అతని వృద్ధమాత వద్దకు వెళ్ళి "నీ కొడుకు నదిలో మునిగి చనిపోయాడు. అతని బట్టలివిగో!" అని చూపి చెప్పాడు.

అషిక్ తల్లి శోకభారంతో కుమారుని దుస్తులపైవాలి వలవల ఏడ్చింది. ఆ దుస్తులు తీసుకుని తన కావలసిన కోడలిదగ్గిరికి వెళ్ళి "నాకుమారుడు చనిపోయాడు. కుర్ధూష్ బే ఈ దుస్తులు తీసుకువచ్చి ఇచ్చాడు. ఇక నువ్వు స్వతంత్రురాలివి," అన్నది.

మఘుల్ మెఘేరీ నవ్వింది: "ఈ మాటలు నమ్మబోకమ్మా! ఇది కుర్ధూష్ బే చేసిన మోసం. ఏడేళ్లు పూర్తికానిదే నేను పెళ్ళిమాట తలపెట్టను," అని ఖచ్చితంగా చెప్పింది. గోడకి తగిలించిఉన్న ఒక జంత్ర వాద్యం తీసుకుని వాయిస్తూ అషిక్ రచించిన ఒక పాటను పాడసాగింది.

ఈలోగా మన యాత్రికుడు కాళ్ళకిజోళ్లు, వంటికి సరియైన దుస్తులు లేకుండా ఒక గ్రామానికి వెళ్లాడు. దయాపరులైన గ్రామస్థులతనికి అన్నవస్త్రాలిచ్చి ఆదరించారు. కృతజ్ఞతా సూచకంగా అతడు వారికి మంచిమంచి పాటలు పాడి వినిపించాడు. ఈ విధంగా అతడు గ్రామగ్రామానికి తిరుగుతూ, పాటలుపాడుతూ సంచరించసాగాడు. అతనికీర్తి సర్వత్రా వ్యాపించింది.

చివరికతడు ఖలాఫ్ అనే నగరానికి వచ్చాడు. అలవాటు ప్రకారం అతడొక భోజనశాలలోకి వెళ్ళి ఎవరినో అడిగి ఒక వాద్యం తీసుకుని పాట పాడసాగాడు.

ఆ ఊళ్లో అమితధనవంతుడైన ఒకపాషా ఉన్నాడు. అతనికి గానమన్నా, గాయకులన్నా చాలా ఇష్టం. రోజురోజుకీ క్రొత్త గాయకులను తీసుకువచ్చి పాషా గారికి అప్పగించడం ఆయనసేవకులకు కష్టమైపోతోంది. ఆరోజున వారు భోజనశాల ఎదుటినుండి పోతుండగా అతిమధురమైన కంఠం వినిపించింది. వెంటనే వారు లోపల ప్రవేశించారు, అషిక్‌ను చూసి,

"మాతో పాషాదగ్గిరికి నువ్వు రావాలి. రాకపోతే నీమెడకాయ మీాద తలకాయ ఉండదు," అన్నారు సేవకులు.

"నేను స్వేచ్ఛాజీవిని. టైఫ్లిస్ నుండి వచ్చిన యాత్రికుణ్ణి. నాకిష్టమైతే వస్తాను, లేకపోతే రాను. మీాకు పాషా అయితే నాకు పాషా కాదు," అన్నాడు అషిక్. కాని

పాషాభటులు అఫిక్‌ను బంధించి తీసుకుపోయారు.

"ఊ. పాడు," అని ఆజ్ఞాపించాడు పాషా.

అఫిక్ పాడసాగాడు. తన్నకు కాబోయే భార్యయైన మఘుల్ మెఘేరీ సౌందర్యాన్ని గూర్చి ఆవేశంతో, ఆశువుగా పాటకట్టి పాడాడు. ఈపాటి పాషా విని ముగ్ధుడై పోయాడు. అఫిక్‌ను బహువిధాల సత్కరించి తన ఆస్థానంలో నే గాయకుడుగా నియమించాడు. వెండిబంగారాలు అతనిమీద వర్షంలాగ కురిపించాడు. అఫిక్ చీని చీనాంబరాలు ధరించి శ్రీమంతుడివలె తిరగసాగాడు. నిర్విచారంగా, నిర్విరామంగా భోగభాగ్యాలలో మునిగి తేలుతూ రోజులు గడిపాడు. మఘుల్ మెఘేరీని జ్ఞాపకముంచుకున్నాడో లేదో తెలియదుగాని, అతని శపథకాలం హారతి కర్పూరంలాగ కనిపించకుండా హరించుకుపోయింది. ఆఖరి ఏడు కూడా సమాప్తి కాబోతోంది. కాని, స్వదేశం తిరిగి పోవాలని అతనికి తొందర కలగనేలేదు.

ఆసమయానికి, టైఫ్లిస్ నగరం నుంచి ఒక వర్తకుడు నలభై ఒంటెలతో, ఎనభైమంది బానిసలతో, వర్తకసామగ్రితో దేశాలవెంబడి ప్రయాణమవుతున్నాడు. ఈ సంగతి తెలిసి మఘుల్ మెఘేరీ అతణ్ణి పిలిచి, అతడికొక బంగారు పళ్లెం ఇచ్చింది.

"వర్తకుడా! ఈపళ్లెం నీతో తీసుకువెళ్లు. నువ్వు ఏపట్టణానికి వెళ్ళినా, నీవస్తువులతోపాటు దీన్ని నాదీ అని ఎవరైతే ముందుకువచ్చి చెయ్యి వేస్తారో, అతనికాపళ్లెం ఇస్తాననీ, ఇంకా కోరినంత బంగారం ఇస్తాననీ, ప్రకటించు," అని చెప్పింది.

అలాగేనని వర్తకుడు బయలుదేరాడు. ప్రతి మజిలీలోనూ అతడు మఘుల్ మెఘేరీ చెప్పినట్లుగానే ప్రకటించాడు. కాని ఎవరూ ముందుకువచ్చి ఆపళ్లెం తనదని అంగీకరించలేదు. వర్తకుడు తన వస్తువులన్నీ దాదాపు అమ్మివేశాడు. ఇక మిగిలిన కొద్దిపాటి వస్తువులతో ఖలాఫనగరానికి వచ్చాడు. మళ్లీ ఇదివరకువలెనే ప్రకటించాడు. ఆ ప్రకటన వినగానే అఫిక్ కెరిబ్ పరిగెత్తుకుంటూ వచ్చాడు. విక్రయశాలలో ఎదురుగా బంగరుపళ్ళెం కనిపించింది.

"ఇది నాది" అని పళ్ళెంమీద చేతులు వేశాడు.

"అయితే ఇది నీదే. నిన్ను నేను గుర్తుపట్టాను. అఫిక్ కెరిబ్! వెంటనే టైఫ్లిస్ నగరానికి బయలుదేరు. ఇక ఆట్టే వ్యవధి లేదని మఘుల్ మెఘేరి నీతో చెప్పమన్నది. సమయానికి నువ్వు హాజరు కాకపోతే ఆమె ఇంకొకర్ని పెళ్ళి చేసుకుంటుంది," అని చెప్పాడు వర్తకుడు.

అఫిక్ ఒక్కసారిగా హా హా

★ మఘ్రుల్ మెహురి ★

కుడై సుమరు బాధపడుతున్నాడు. ఆఖరి రోజుకి ఇక మూడు రోజులు మాత్రమే గడువున్నది. అయినా కాలం వృధా చెయ్యకుండా అతడొక సంచీనిండా బంగారు నాణాలు పోసుకుని, గుర్రంమీద ప్రయాణం సాగించాడు. కాని కొంతదూరం పోయాక ఒక కొండమీద అతని గుర్రం మార్గాయాసంచేత కూలబడి పోయింది. అషిక్ ఇంకేం చేస్తాడు? అక్కడినుంచి హైఫ్లిస్‌కు రెండు నెలల ప్రయాణం ఉన్నది. గడువుమాత్రం రెండురోజులేఉంది.

"అల్లా! ఇప్పుడు నువ్వు నాకు సహాయం చెయ్యకపోతే నేను బ్రతికి ఉండి లాభమేమీ లేదు," అంటూ అషిక్ ఒక అగాధంలోకి దూకబోయాడు. ఇంతలో అగాధం అడుగున తెల్లని గుర్రంమీద ఒక రౌతు ఎవడో కనిపించాడు. ఆ రౌతు "ఏమి చేస్తున్నావు యువకుడా!" అని కేక వేశాడు.

"నేను చనిపోదామనుకుంటున్నాను," అన్నాడు అషిక్.

"అయితే కిందికి రా. నేనే నిన్ను చంపివేస్తాను," అన్నాడు ఆశ్వికుడు.

అషిక్ కెరిబ్ మెల్లిగా అగాధంలోకి దిగబ్రాకాడు.

"నా వెంట రా."

"ఎట్లా రాను? మీరు గుర్రం మీద ఉన్నారు. మీ గుర్రం వాయువేగంతో పోతుంది. నేను ఈ బుజాన బరువుతో ఎలా వెంబడించేది?"

"నిజమే. నీ సంచీ నా జీనుకు తగిలించి రా."

కాని అషిక్ కెరిబ్ ఎంత వేగంగా పరిగెత్తినా వెనకబడి పోయాడు.

"ఏం అలా వెనకబడుతున్నావు?"

"మీ అశ్వరాజం మనోవేగంతో పోతోంది. నే నెలా రాగలను?"

"నిజమే. నా వెనక ఎక్కు. ఇప్పుడు చెప్పు, ఎక్కడికి వెళ్ళాలి నువ్వు?"

అక్కడికి చాలా దూరంలో ఉన్న అర్జిహూమ్ అనే చోటికైనా కనీసం వెళ్ళగలిగితే ధన్యుడినైనట్లే నన్నాడు అషిక్.

"అయితే కళ్ళు మూసుకో."

అషిక్ కళ్ళు మూసుకున్నాడు. "ఇప్పుడు తెరు" కళ్ళు తెరిచి చూసే సరికి ఎదురుగా అర్జిహూమ్ ×××

ప్రాకారకుడ్యాలు కనిపించాయి.

"పొరబాటు చేశాను. మహానుభావా! నేను వెళ్లవలసింది కార్స్ నగరానికి," అన్నాడు అషిక్.

"నేను మొదటే చెప్పాను పొరబాటు చెప్పొద్దని. సరే మళ్లీ కళ్లుమూసుకో...... తెరు."

ఎదురుగా కార్స్ నగరం కనిపించింది. అషిక్ గుర్రందిగి మోకరిలబడి "క్షంతవ్యుణ్ణి మహాశయా! నేను మళ్లీ అబద్ధమే చెప్పాను. నేను వెళ్లవలసింది హైఫ్లిస్ నగరానికి," అని ప్రార్థించాడు.

"ఎంత అబద్ధాలకోరువోయ్ నువ్వు? సరే, ఇకలే. నిన్ను క్షమించాను. కళ్లు మూసుకో... తెరు," అన్నాడొక నిమిషం తర్వాత.

అషిక్ ఆనందంతో ఎగిరి గంతు వేశాడు. ఎదురుగా హైఫ్లిస్ నగర ద్వారాలున్నాయి. వంగి వంగి సలాములు చేసి, తన సంచీ తాను తీసుకుని, అషిక్ ఆశ్వికునితో ఇలా అన్నాడు:

"స్వామీ! మీ మహిమ అపారం. కాని మరొక ఉపకారం మీరు చెయ్యాలి. ఇంతదూరం నేను ఒక్కరోజులోనే ప్రయాణం చేసి వచ్చానని ఎవరితోనైనా చెబితే ఎవరూ నమ్మరు. దీనికి నిదర్శనం ఏదన్నా మీరు ఇచ్చినట్లయితే నాకు లాభిస్తుంది."

ఆశ్వికుడు నవ్వి "అలాగైతే

నా అశ్వపు రెక్కల కంటుకున్న మట్టిపెళ్లను తీసుకో. దాన్ని నీ జేబులో భద్రపరుచుకో. నీమాట నమ్మలేమన్నప్పుడు, ఏడేళ్లనుంచీ అంధురాలుగా ఉన్న ఏ స్త్రీనైనా నీదగ్గిరికి తీసుకురమ్మను. ఆమె కళ్లకు ఈ మట్టిరాస్తే ఆమెకు దృష్టివస్తుంది."

అషిక్ గుర్రపు రెక్కలనుండి ఒక మట్టిపెళ్లను తీసుకున్నాడు. తల ఎత్తి చూసేసరికి అశ్వమూ, ఆశ్వికుడూ కూడా మాయమైపోవడంచూసి అతడాశ్చర్యపడ్డాడు. అప్పుడతడు సాక్షాత్తూ హాదరిలియాజ్ తన్ను రక్షించడానికి వేంచేశాడని నిశ్చయించుకున్నాడు.

రాత్రి చీకటి పడినతర్వాత అషిక్ తన ఇంటికి వెళ్లాడు. తలుపు తట్టి "అమ్మా!" అని పిలిచాడు. "అమ్మా! అతిథినై వచ్చాను. భగవంతుడు నన్ను పంపించాడు. నేను చలితో, ఆకలితో బాధపడుతున్నాను. దేశద్రిమ్మరినైన నీకుమారుడికోసమైనా నన్ను లోనికి రానియ్యమ్మా!"

"బాటసారులకోసమైతే, ధనవంతుల ఇళ్లు, అధికారుల ఇళ్లు ఉన్నాయి. ఊరంతటా పెళ్ళిళ్లు జరుగుతున్నాయి. అక్కడికిపోరాదయిగా," అని సమాధానమిచ్చింది తల్లి.

"నేనెవర్నీ ఎరగనమ్మా! మళ్లీ అడుగుతున్నాను. దేశద్రిమ్మరినైన నీ కుమారుడికోసమైనా నన్ను లోనికి రానియ్యి."

ఈ మాటవిని అతని చెల్లెలు లేచి "నేను తలుపు తీస్తానమ్మా!"అంది.

"ఊరుకో మూర్ఖురాలా! నేను ఏడేళ్ళనుంచీగుడ్డిదాన్నై ఉన్నానని నీయిష్టం వచ్చినట్లు ఆటలాడుతున్నావు," అంది తల్లి.

ఆమె మాటలు వినకుండా చెల్లెలు తలుపుతీసింది. అషిక్ లోపలికి వచ్చి కూర్చుని సంతోషం అణుచుకుంటూ, చుట్టూ చూశాడు. గోడకి తగిలించిన అతని పాత జంత్రవాద్యం కనిపించింది. తల్లిని ప్రశ్నించాడు:

"ఆ గోడకేదో తగిలించిఉందే?"

"అన్నీ నీకేకావాల్నే ? నోరుమూసుకుని పడుకుని, ఇచ్చిందేదో తిని, తెల్లారి నీదారిన నువ్వుపో," అని గద్దించింది తల్లి.

"అదేమిటమ్మా, అలాగంటావ్. నువ్వునా అమ్మవనీ, ఈమె నా చెల్లెలనీ ఇందాకే చెప్పానే. ఆ గోడకి తగిలించిందేమిటో చెప్పవూ ?"

"అది ఒకవాయిద్యం," అన్నది తల్లి అతని మాటలు నమ్మకుండానే.

"వాయిద్యం అంటే ?"

"అది వాయిస్తూ పాటలు పాడతారు."

అప్పుడు అషిక్ తనచెల్లెల్నడిగాడు, ఆవాద్యం ఒకసారిమ్మని.

"వీల్లేదు," అంది తల్లి. "అది నాకుమారుడిది. ఏడేళ్ళనుంచీ అది ఆ గోడనే వున్నది. ఏ మనిషీ దాన్నింతవరకూ ముట్టుకోలేదు."

కాని అతని చెల్లెలు ఆవాద్యం తీసి అతనికిచ్చింది. దాన్ని తీసుకుని కళ్ళపైకెత్తి చూస్తూ "ఓ అల్లా ! నేను నాలత్యాన్ని పొందడానికిగాను, నా వాయిద్యం సరిగా పూర్వపు రోజుల్లో వలెనే పలికేట్లు చెయ్యి," అంటూ తాగి తీగలను మీటాడు.

తీగలు అతని వేళ్ళకు స్నేహపూర్వక సమాధానమిచ్చాయి. అతడు పాట పాడాడు: "నేను పేద గాయకుణ్ణి. దేశద్రిమ్మరిని. అయినా హాదరిలియాజ్ వంటివాడు. ప్రత్యక్షుమై నన్ను అగాధంనుండి రక్షించాడు.

నేను బీదవాడినైనా, నా కన్నులలో శక్తిలేకపోయినా, అమ్మా, నీ దేశద్రిమ్మరిని గుర్తించు"

ఈ పాటవిని అతని తల్లి కన్నీళ్లు కారుస్తూ "నీపేరేమి"టని అడిగింది.

"రషీద్" అన్నాడతడు.

"రషీద్! నీ మాటలు నా హృదయాన్ని కంపపుకోత కోస్తున్నాయి. నాకు రాత్రి ఒక కల వచ్చింది. నా జుట్టంతా తెల్లబడి పోయినట్టు కలలో కనిపించింది. నా కళ్ళు కలల్లోనే చూస్తాయి. నేను గుడ్డిదాన్ని. ఏడ్చి ఏడ్చి ఏడేళ్ళ కిందట కళ్ళు పోగొట్టుకున్నాను. నీ గొంతు నా కుమారుని గొంతుకవలెనే ఉన్నది. నా కుమారుడెప్పుడు వస్తాడో చెప్పగలవా?"

'నేనే నీ కుమారుడి'నని అతడెంత చెప్పినా ఆమె నమ్మలేదు. కొద్దిసేపైన తర్వాత అతడిలా అడిగాడు :

"అయితే, అమ్మా! ఈ వాయిద్యాన్ని ఒక్కసారి నాతో తీసుకువెడతాను. ఈదగ్గిర్లో ఎక్కడో ఎవరిదో పెళ్లి జరుగుతోందట. నా చెల్లెల్ని కూడా తీసుకు వెడతాను. అక్కడ నేను పాటలు పాడతాను. నాకు వచ్చిన డబ్బంతా ఇక్కడికి తీసుకొస్తాను. ఆ డబ్బు మనం ముగ్గురం పంచుకుందాం."

"ఊహు. వీల్లేదు. ఆ వాయిద్యం ఏడేళ్లనుంచీ ఈ యిల్లు దాటిపోలేదు."

అతడు బ్రతిమాలాడు. ఒక్క తీగకూడా పాడుచెయ్యనని అన్నాడు. చివరికి నా డబ్బంతా నీదగ్గర తాకట్టు పెట్టి వెడతానన్నాడు.

తల్లి అతని డబ్బుసంచీలో చెయ్యి పెట్టి చూచింది. దాన్నిండా నాణాలుండడం చూసి, అతని కనుమతి యిచ్చింది. చెల్లెలు అషిక్‌ను వెంటబెట్టుకుని వివాహం జరుగు

(45 వ పేజీ చూడండి)

పెద్దకథ:

★ వాసు చదువు ★

ముద్దంశెట్టి హనుమంతరావు

11

మూడు సంవత్సరాలు యిట్టే గడిచిపోయాయ్. వాసు ఫిఫ్తు ఫారమ్‌కివచ్చాడు. గడచిన రోజుల్లో తనను భవించిన కష్టాలు యెప్పటి కప్పుడే మర్చిపోతుండేవాడు. గడిచిన ప్రతిక్లాసులో కనీసం రెండు సబ్జక్టుల్లో నయినా ఫస్టుమార్కులు సంపాదించాడు. క్లాసు మాస్టర్ల మాటటుంచితే, క్రిష్ణారావుమాత్రం గర్వించేవాడు. రాజు, సీతారాంలు యెలాగో యీదుకుని బయటపడుతున్నారు. వాసు స్నేహంమాత్రం విడిచిపెట్టలేదు. తమ స్నేహితుడు అందరి మన్ననలు పొందుతుండటం వారికిమాత్రం ఆనందం కాదూ? అసూయాపరులు కాకపోవటంవల్ల తప్పక ఆనందిస్తారు.

ధర్మారావు యిప్పుడు ఫోర్తు ఫారంకి వచ్చాడు. వాసు తెలివితేటలకి తనూఆనందంతో ఉప్పొంగిపోయాడు. అయిదో క్లాసులో యిన స్పెక్టరన్న మాటలు జ్ఞాపకానికి వచ్చినయ్ ధర్మారావుకి. ఇరువురు రోజుకో స్సారైనా కలుసుకుంటుంటారు. పదిహేనురోజుల కొకసారి యిద్దరూ కలిసి స్వగ్రామం పోతూవస్తుండేవారు.

వాసు ఫిఫ్తుఫారం చదువుతున్నప్పుడే మాష్టర్ల ప్రోద్బలం వల్లనూ, ప్రోత్సాహం వల్లనూ, డ్రాయింగ్, హిందీ, పరీక్షలకి కట్టాడు. పరీక్షలింకా నెలరోజు లున్నయ్. అదే సమయానికి అఫ్ యియర్లీ పరీక్షలు కూడా వున్నయ్. ముందు కొందర పడ్డాడేగానీ యిప్పుడేం చేయాలో తోచలేదు. ఒక్క నిమిషకాలం కూడా వ్యర్థంకాకండా, స్నేహితులతో తిరక్కండా యెప్పుడూ యేదో ఒకటి చదువుతోనో, రాస్తూనో కాలంగడిపేవాడు. కృష్ణారావు మాష్టరు వాసుప్రయత్నానికి సంతోషించి ప్రోత్సహించాడు.

ఉదయం లేచినవెంటనే క్లాసు చదువు, మధ్యాహ్నం యింట్లో వున్నప్పుడు డ్రాయింగు, సాయంకాలంహిందీ మళ్లీరాత్రి పది వరకు క్లాసు చదువే... యిదీ అతని దినచర్య. డ్రాయింగ్ నేర్చుకుందుకు నాలుగుఫర్లాంగులుదూరంలో వున్న మూర్తిగారింటికిపోయేవాడు. వాసు అభిరుచి గమనించిన మూర్తి శ్రద్ధతో అన్నీ బోధపర్చి నమూనాలు వేసిచూపించేవారు. హిందీలో తెలియని విషయాలు హిందీమాష్టరు దగ్గరికిపోయి తెలుసుకునేవాడు. వాసు యీ యిరువురి వుపాధ్యాయుల సహాకారాన్ని యెప్పుడూ తను మర్చిపోనంటాడు.

ఇవన్నీ ఓ పక్కవింటూ, ప్రత్యక్షంగా వాసు ప్రయత్నంచూస్తున్న సీతాలక్ష్మికి వాసుపై అసూయ మరింత బలపడింది తన యిరువురు కొడుకుల్లో యే ఒక్కడుకూడా ఆ పరీక్షలకి పోలేదు. ఆ దుగ్ధతో వాళ్లని తిట్టడం విన్నాడు వాసు. ఎన్నంటేమాత్రం యేం లాభం? కళ జన్మతో రావల్సిందే!

అప్పట్నించి వాసు చదువుకి అంతరాయం కల్గించాలన్న నిశ్చయంతో ప్రతిదినం బజారుకి అతన్నే పురమాయించేది. వాసు కాదనగలడా? సహనబుద్ధితో అవన్నీ సక్రమంగా జరుపుతుంటూ వచ్చేవాడు వ్యర్థమైన కాలానికి సరిగ్గా యెక్కువసేపు చదువుతుండేవాడు. ఎవరు యెన్నిప్రయత్నించినా భగవంతుడంటూ వున్నాడు కదూ! విధి యెవడు తప్పించగలడు?

మొదట డ్రాయింగు పరీక్ష, తరువాత హిందీపరీక్ష జరిగినయ్. అవి పూర్తయిన మూడురోజులకే అఫ్‌యియర్లీ పరీక్షలు ప్రారంభింపబడ్డాయి. విరామంలేకుండా చదివాడు వాసు. క్లాసుపరీక్షలుకూడా సంతృప్తికరంగానే రాశాడు కాని సరియైన నిద్ర, విశ్రాంతి లేకపోవటంవల్ల వాసు జర్వపీడితుడయ్యాడు. వరహాలు భయపడింది. భయం కదూ మరి—తలిదండ్రులు దగ్గర లేరాయె. కృష్ణారావు మాష్టరు స్వయంగావచ్చి చూసి పోతూండేవాడు. యేం భయంలేదని వరహాలుకి, రత్నాలుకి ధైర్యంచెప్పాడు.

★ వాసు చదువు ★

"ఎందుకో, అడ్డమాలిన పరీక్షలకి కట్టి నిద్రాహారాల్లేకండా చదవటం-?" అని సీతాలక్ష్మి యెత్తి పొడిచేది. ఆమె మాట లెవరు విన్పించుకుంటారు?

అదృష్టవశాత్తూ వాసు మూడవ రోజుకే స్వస్థతకివచ్చాడు. జ్వరం పూర్తిగ తగ్గిపోయింది. వరహాలు, రత్నాలు, కృష్ణారావు మాష్టరు సంతోషించారు. కాని సీతాలక్ష్మికి ఆనంద మన్పించ లేదు. శలవు రోజు లన్నాళ్లూ వాసు పల్లెలో కాలం గడిపేడు. ధర్మారావుకూడా వుండటంవల్ల ఒంటరితనం పొందలేదు. స్కూలు మళ్లీ ప్రారంభించారు. క్లాసుపరీక్ష ఫలితాలు తెలిశాయి. యీసారి వాసుకి ఒక్క తెలుగులోనే ఫస్టు మార్కు వచ్చింది. తక్కిన వాట్లో మంచిమార్కులే వచ్చాయి. మరో పదిహేను రోజులకి హిందీ, డ్రాయింగ్ పరీక్షాఫలితాలు తెలిశాయి. రెండింటిలోనూ వాసుకి ఫస్టుక్లాసే వచ్చింది. వాసు ఆనందంలో తేలిపోయాడంటే నమ్మరూ! తండ్రి వింటే యెంతసంతోషిస్తాడు! అనుకున్నాడు వాసు.

సర్టిఫికేట్లు దొరికిన రోజునే వాసు వాటిని కృష్ణారావు మాష్టరుకి చూపించాడు. వాసు శ్రద్ధకి, శ్రమకి, అచ్చెరువంది అభినందించాడు. నిజంగా తనకి దగ్గరివాడని చెప్పుకుందుకు గర్వించదగ్గ అబ్బాయని అనుకున్నారాయన మనసులో. అవుతేనేం వాసుకిమాత్రం కృష్ణారావు గారియందు భక్తి పోతూ శ్రద్ధలు లేకపోలేదు. యిప్పటికీ అంటుంటాడు. తన తెలివితేటలకి, శ్రద్ధకి, పునాదివేసింది కృష్ణారావు గారే నని.

ఈ శుభ సమయంలో తండ్రి సూర్యనారాయణ తీవ్ర జ్వరపీడితుడయ్యాడన్న విషాదవార్త వినవచ్చింది వాసుకి. నిజంగా ఆ అబ్బాయి చలించి పోయాడంటే ఆశ్చర్యం లేదు. అప్పటికప్పుడే పల్లెకు వెళ్లాలని నిశ్చయించుకుని కృష్ణారావుగారితో చెప్పాడు. అతను కూడా విచారించి వెళ్లి రమ్మన్నాడు. వాసు బయలుదేరి పోయాడు పల్లెటూరుకు. అంత జ్వరంలోకూడా కొడుకుని చూసి నవ్వుతూ దగ్గరికి లాక్కొని,

"వచ్చావా నాయనా! నీకోసమే చూస్తున్నా—బుద్ధిగా చదువుకుంటున్నావు కదూ?" అన్నాడు సూర్యనారాయణ. అందరూ ఆశ్చర్యపోయారు; కొడుకు రావటంతో మాట్లాడినందుకు.

"చదువుకొంటున్నా నాన్నా... యీ మధ్య "హిందీ, డ్రాయింగు, పరీక్షలు కూడా పాసయ్యాను." ఎప్పుడీవార్త తండ్రి చెవిన పడేద్దామా అన్న ఆతృతతో వున్నాడేమో మరి-అనేశాడు. పాపం, ఆ చిన్న హృదయానికింకా మంచీ చెడ్డా తెలీదు.

"ఆ! అలాగట్రా..." అన్నాడు సంతోషంలో కళ్లు యింతవిగా చేస్తూ. అప్పటికతనికి ఆయాసం ఆవరించింది. మరి మాట్లాడలేక పోయాడు. వాసు బిక్క చచ్చి

"తరువాత అన్నీ చెప్తాలే నాన్నా! మరి మాట్లాడకండి— ఆయాస మెక్కువవుతోంది" అంటూ అక్కడినుండి అవతలికెళ్లాడు.

ప్రతిదినం వైద్యుడువచ్చిమందు యిస్తూనేవున్నాడు. రోజు రోజుకి సూర్యనారాయణ వ్యాధి నయమవుతూ వచ్చింది. అన్నయ్యను చూడాలని వరహాలు, రత్నాలు, పట్నంనుండి వచ్చారు. అప్పటికి సూర్యనారాయణ పరిస్థితి కొంత స్వస్థతకి వచ్చింది. చెల్లెలిని కొడుకు విషయం అడిగాడు. వరహాలు వెనుక ముందాలోచించకండా తనకు కోడలు చెప్పిందంతా వప్ప చెప్పింది. అవన్నీ తనూ పూర్తిగా నమ్మననికూడా చెప్పింది. కొడుకు అలా ప్రవర్తిస్తాడని సూర్యనారాయణకూడా నమ్మలేకపోయినా విధిలేక కాస్త బాధపడ్డాడు.

"చిన్నకుఱ్ఱాడు కదే...ఏదైనా తప్పు చేయటం సహజం. నువ్వాపాటి సర్దుకోలేవూ" అన్నాడు సూర్యనారాయణ.

"మాటవరసకి చెప్పానే గాని, ఆపాటి సర్దుకోలేకపోతానా అన్నయ్యా" అంది వరహాలు. అన్నదే గాని అది యెంతవరకు నిజం? కోడలు ఎన్నిచాడీలు చెప్పినా, వాసుకి నాలుగుచీవాట్లు పెట్టేదే గాని, కోడల్ని పల్లెత్తి మాటనేది కాదు.

సూర్యనారాయణ మనసుకి తట్టింది. వాసు యింకెన్ని చికాకులు పడుతున్నాడోనని. సహనంతో అనుభవిస్తూ బయటికి వెలిబుచ్చకండా వున్నందుకు కొడుకుని మనసులో మెచ్చుకున్నాడు. సూర్యనారాయణ క్రమంగా తేరు

కున్నాడు. అంచేత వాసు మేనత్తలతో మళ్లీ పట్నం వెళ్లిపోయాడు.

12

స్కూల్లో వార్షికోత్సవం జరుగుతుంది. ఆ సందర్భంలో ప్రదర్శించేందుకు బడిపిల్లలచే ఓ నాటకం వేయించాలనుకున్నారు ఉపాధ్యాయులు. అందులో వాసుని తప్పనిసరిగా ఓపాత్ర ధరించమన్నారు. వాసు భయంతో మొదట నిరాకరించాడు. కాని ఉపాధ్యాయులంతా బలవంత పర్చటంవల్ల తలవంచక తప్పిందికాదు. అదే సమయంలో వ్యాసరచన పోటీ ఉపన్యాసముల పోటీకూడా పెట్టారు. వాసు వ్యాసరచన పోటీలో పాల్గొని మొదటిబహుమతి సంపాదించాడు.

నాటకంలో పాత్ర తీసుకున్న సంగతి కృష్ణారావుతో చెప్పాడు వాసు. నాటకాలంటే చెవిగోసుకుండే కృష్ణారావుగారెంతో సంతోషించారు. కాని సీతాలక్ష్మికి నాటకాలాడే వాడంటే పరమ అసహ్యం. వేషాలువేసిన వ్యక్తి ఆమె దృష్టిలోపోరంబోకు. వాసుని కూడ అందులోనే జమకట్టి సంతోషించింది... ఆ అభిప్రాయం ఆమెకి కలగకపోతే అసూయపడేదే!

* * *

నాటకం ప్రారంభింపబడింది. ఎంతోమంది విద్యార్థులూ, ఉపాధ్యాయులు, పౌరులూ వచ్చారు. రాజు, సీతారాం, ధర్మారావు, వీళ్లు ముగ్గురూ ముచ్చటగా స్టేజికి దగ్గర్లోనే నిల్చున్నారు. వాసుపాత్ర చాలచిన్నదయినా బహు నేర్పుతో నటించినందుకు చాలమంది అతన్ని అభినందించారు. వాసు తన శ్రావ్యమైన కంఠంతో పాడిన రెండుపాటలు ప్రేక్షకుల్ని గిలిగింతలు పెట్టేసయ్. మరోసారి పాడమని యెంతోమంది అరిచారు. కాని ఉపాధ్యాయుడు స్టేజిమీదకొచ్చి, వీళ్లు చిన్నకుర్రాళ్లవటం మూలాన్న మీ కోరిక తీర్చలేక పోయినందుకు చింతిస్తున్నాం అని చెప్పి దిగిపోయాడు. ఏమైనా వాసు చదువులోనేకాక నాటకరంగంలో కూడా అందరి అభిమానం పొందాడు. ముఖ్యంగా కృష్ణారావుగారు గర్వించారు. వాసులో యింత ప్రతిభ యిమిడివుందని తెలుసుకున్నందుకు ఆశ్చర్యపోయాడు.

నాటకరంగంలో వాసు పొందిన ప్రశంస విని మండిపడింది సీతాలక్ష్మి. వాసుని అందరూ పొగుడుతునే వున్నారు. తన కొడుకుల్లో ఒక్కరికీ పొగడ్తయెందుకు రాకూడదన్న అసూయపేరుకొంది ఆమెలో. వాసునేమీ అనలేక కొడుకుల్ని నోటికొచ్చినట్టు తిట్టింది. యిప్పుడు వాసు మరింత హీనంగా చూడబడుతున్నాడు.

నాటకమైన మరుచటిరోజే వరహాలు కృష్ణారావు దగ్గరికి పోయిందెందుకో. మాటల సందర్భంలో

“మీ మేనల్లుడు స్కూల్లో మంచిస్థానం సంపాదించుకున్నాడు వరహాలూ” అన్నాడు కృష్ణారావు. వరహాలుకి ఆకవిత్వం అర్థంకాలేదు.

“నాకర్థం కాలేదురా” అంది.

“మొన్న నాటకంలో వేషం వేశాడుకదూ! నేనుచూశానులే... యెంత చక్కగా నటించాడనుకున్నావ్... అందరూ వీడిపాట మెచ్చుకున్నవాళ్లే. అంత బాగా పాడతాడని నే నెప్పుడూ అనుకోలేదు” అన్నాడు కృష్ణారావు. వరహాలు వుత్సాహంగా నవ్వింది.

“నువ్వు వినలేదేమో, గాని యింట్లో అప్పుడప్పుడు మెల్లిగా పాడుతుంటాడు. ఎందుకోరా, యెప్పుడూ యేదో ఆలోచించుకుంటూనే వుంటాడు” అంది వరహాలు.

“ఆలోచనెందుకుండదుపిన్నీ — కారణం నాకు తెలుసు... కాని అవన్నీ బయటికి రానీయకండా గడుపుకొస్తున్నాడు. నిజంగా అల్లాంటి అబ్బాయి ఒక్కడుంటే చాలు పిన్నీ. వుద్ధేస్తుంది”

“వాళ్ళనాన్న కివన్నీ చూడ్డానికి ప్రాప్తిలేక దూరంగా వున్నాడు. వాడో వూర్లో, వీడో వూర్లోనూ” అంది వరహాలు కాస్త బాధగా.

“అవుతేమాత్రం యేంపోయింది? చూచేవాళ్లు చెప్పుకుంటున్నారుగా! యింకేంగావాలి? అంతే ననుకున్నావా? మొన్న స్కూల్లో పోటీలు పెట్టారులే. అందులో ఒహదానిలో వీడిదే మొదటి బహుమానమట. నిజంగా నాతాలూకు అబ్బాయని, బంధువని చెప్పుకోటానికి గర్విస్తున్నా” అన్నాడు కృష్ణారావు. వరహాలు సంతోషానికి పట్టపగ్గాలు లేకపోయాయ్.

అందుకేరా— యెవ్వరికీ యిష్టం లేకపోయినా, నేనూ, అక్కయ్య పట్టుపట్టివుంచాం” అంది తన ఆధి

టామ్‌సాయర్ ప్రపంచయాత్ర

వారపత్రికలో త్వరలో ప్రారంభమవుతుంది.

టామ్‌సాయర్, హాకల్ బెరీఫిన్, రాజా పేద, విచిత్రవ్యక్తి నవలలతో ఆంధ్రపాఠకలోకానికి మార్క్‌ట్వేన్‌ను పరిచయంచేసిన ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక మరొక మార్క్‌ట్వేన్ నవలను తెలుగులోకి అనువదించి అర్పిస్తున్నది. ఈకథ టామ్‌సాయర్, హాకల్ బెరీఫిన్ నవలలకు తరువాయి కథ. టామ్, హాక్, నీగ్రోజిమ్ ముగ్గురూ ఈసారి ప్రపంచయాత్రకు బయల్దేరుతారు. వేలకొలది మైళ్ళు అవలీలగా ప్రయాణంచేసి, ఎన్నో వింతలు విశేషాలుచూసి, ఎన్నో అద్భుతాలు చేస్తారు. అడుగడుగునా వారు ఎన్నోప్రమాదాలు ఎదుర్కొంటారు. ప్రతిప్రమాదమూ చివరికి హాస్యంగా మారి నవ్విస్తుంది. ఈ హాస్యం ద్వారా అమెరికన్ గ్రామీణ మనస్తత్వాన్ని చిత్రించి వేళాకోళం చేయడం మార్క్‌ట్వేన్ ఆశయం.

"టామ్‌సాయర్ ప్రపంచయాత్ర" ప్రతివారూ చదివి ఆనందించదగిన సీరియల్.

★ మఘుల్ మెఘేరి ★

(41-వ పేజీ తరువాయి)

తున్న భవనానికి తీసుకువెళ్ళింది. ఏం జరిగేదీ చూడడానికి ఆమె భవనం వెలుపలే నిలబడింది.

ఆ భవనంలోనే మఘుల్ మెఘేరీ నివసిస్తోంది. ఆ రాత్రే ఆమె ఘర్దూన్‌కే భార్య అవుతుంది. ఘర్దూన్‌కే తన బంధువులతోనూ, స్నేహితులతోనూ కలిసి విందారగించి కబుర్లు చెబుతున్నాడు. మఘుల్ మెఘేరీ మరొక చోట కొంత

క్యత చెప్పుకుంటూ వరహాలు. "మంచి పనిచేశావులే పిన్నీ! ఒకరు బాగుపడితే చూడలేదీ ప్రపంచం" అన్నాడు కృష్ణారావు. కోడలు పిలుస్తుండటంవల్ల యింక మాట్లాడ్డానికి అవకాశంలేక వెళ్ళిపోయింది వరహాలు.

(ఇంకావుంది)

దూరంలోకూర్చుని, చెలికత్తెలతో సంభాషిస్తోంది. ఒక చేతిలో విషపాత్ర, మరొక చేతిలో ఒక బాకు పట్టుకుని ఉన్నది. ఘర్దూన్‌కేను విధిగా పెండ్లాడవలసివస్తే ఆరాత్రే ఆత్మహత్య చేసుకుంటానని ఆమె శపథం చేసింది.

ఇంతలో ఎవరో నూతనయువకుడు భవనంలోకి వచ్చాడని ఆమె విన్నది.

అషిక్ లోనికివచ్చి "సలాం అలేకుం! మీరు విందారగించి ఆనందిస్తున్నారు. నేనొక బీదయాత్రికుణ్ణి. పాటలు పాడి మిమ్మల్ని ఆనందింపజేస్తాను. అనుమతిస్తారా?" అన్నాడు.

ఘర్దూన్‌కే అలాగేనన్నాడు. అషిక్ కరిబ్ వాద్యాన్ని చిత్రంగా మీటుతూ మధురంగా పాడాడు:

"ఖలాఫ్‌నగరంలో మిస్సిరియన్ ద్రాక్షరసం త్రాగాను. కాని దేవుడు నాకు రెక్కలిచ్చాడు. మూడురోజుల్లో ఇక్కడికెగిరివచ్చాను."

ఘర్దూన్‌కే తమ్ముడీపాట విని మండిపడ్డాడు. బాకుదూసి "అబద్ధం! ఖలాఫ్ నుండి ఇక్కడికిమూడురోజుల్లోవచ్చావా?" అన్నాడు.

"నామీద ఎందుకు కోపగిస్తావు? నేను నిన్ను సొమ్ము అడగడంలేదు. నమ్మునమ్మకపో. ఇది నిజం," అన్నాడు అషిక్.

"పాడనియ్యి" అని పెళ్ళికొడుకు ఆజ్ఞాపించాడు. అషిక్ పాడసాగాడు.

"ఉదయం నమాజు అర్జినియన్ లోయలో చేశాను. మధ్యాహ్నం నమాజు అర్జిరూమ్‌లో, ఆ స్తమయంముందు నమాజు కార్స్‌లో, సాయంత్రం నమాజు టైఫ్లిస్‌లో చేశాను. అల్లా నాకు రెక్కలిచ్చాడు. నేను ఎగిరివచ్చాను. నేను అబద్ధం ఆడితే, శ్వేతాశ్వం రెక్కలకింద నలిగి చనిపోతాను. ఆ శ్వేతాశ్వం కొండ నుండి కోనకు, కోననుండి కొండకు గాలి కెరటంలాగ తేలిపోతూ ఎగిరింది. దేవుడు అషిక్ కరిబ్‌కు రెక్కలిచ్చాడు. అషిక్ మఘుల్ మెఘేరీ వివాహానికి అందుకున్నాడు."

ఈ పాటవిని మఘుల్ మెఘేరీ అషిక్ కంఠం గుర్తించింది. విషపాత్ర ఒకవైపు, బాకు మరొకవైపు విసిరేసింది.

"ఇదేనా నీ శపథం? అయితే ఘర్దూన్‌కేను పెళ్ళాడతావా?" అన్నదొక చెలికత్తె.

పాము మంత్రంలో దిట్ట

నూటఏభై సంవత్సరాల క్రిందట నిజంగా జరిగిన - విచిత్రమయిన ఒక చిన్నవిషయం:

"ఆంధ్రదేశంలో, పాడిపంటలకు ప్రఖ్యాతిపొంది, దేశానికంతకీ ధాన్యసీమని పేరుపొందిన కోనసీమలో, ముంగండ అగ్రహారం అనుపేర ఒక బ్రాహ్మణగ్రామం వుంది! ఆగ్రామాన్ని శ్రీకృష్ణదేవరాయలు, ముంగండ గ్రామకాపురస్థుడు, వేగినాటికుల బ్రాహ్మణుడు అయిన ఉపద్రష్ట కేశవభట్టుకు తన భరత విద్యానైపుణ్యానికి మెచ్చుకుని యిచ్చాడుట!

ఆ గ్రామం మంచిపండితులకు, శాస్త్రవేత్తలకు, వేదఘోషలకు నిలయమై చాలా పేరుప్రఖ్యాతులు పొందింది! ఆరోజులలో మైసూరు మొదలైన అనేక దూరదేశాల నుంచి విద్యార్థులువచ్చి, సంస్కృ

గొడవర్తి జయకుమారి

తం, వేదం, వ్యాకరణం - మొదలయిన విద్యలు నేర్చుకొని, వెళ్లేవారుట! ఈనాడు కూడా వేదపండితులు, వ్యాకరణపండితులు-చాలామంది అక్కడ వున్నారు.

అటువంటి ముంగండ అగ్రహారంలో భైరూడుగారనే ఒకాయన మంచిపాము మంత్రగాడుగా పేరు పొందారు నూటఏభై సంవత్సరాల క్రిందట! పాము మంత్రగాడంటే పాములుకరిస్తే మంత్రం వేయడమే కాదు — వెడుతున్న పామును మంత్రశక్తిచేత అక్కడికక్కడే నిలబెట్టేవారు! ఆయన దగ్గరకు పాము కరచిందని ఎవరైనా వచ్చి-తిరిగి నవ్వుతూ వెళ్లవలసిందే కాని - ఏ ఒక్కరూ చనిపోవడమనేది జరగలేదు! భైరూడుగారు మంచి నిష్ఠపరుడు: ఏమాత్రం తన నిష్ఠకు లోటువచ్చినా, మంత్రబలిమి పోతుందని, చాలా జాగ్రత్తగా, ఆచార వ్యవహారాలను పాటిస్తూ వుండేవారు!

అదేకాదు! మంత్రంవేయించుకుని - సంతోషంగా ఎవరైనా ఏ మామిడిపళ్లో, జాంపళ్లో పంపిస్తే- మంత్రమహిమ పోతుందని, ఒక్కపండునైనా తీసుకోకుండా "మంత్రం వేసినందుకు బహుమానాలు పంపకండి" అని చెప్పేవారు. ఒక్క దమ్మిడీఅయినా పుచ్చుకోకుండా - ధర్మంగా యిలా అందరికీ మంత్రం వేసి ప్రాణభిక్షపెడుతూన్న భైరూడు గారిని అందరూ ఎంతో గొప్పగా చెప్పుకొనేవారు!

ఒకరోజు సాయంకాలం భైరూడుగారు కోటి మెరకతోటకు తోటపనుల కోసం వెళ్లివున్నారు! సాయంత్రం ఏడుగంట లయినా యింకా రాలేదు. భైరూడుగారికి

★ మఘుల్ మెఘేరి ★

"కాదే పిచ్చిదానా! ఇంకా నువ్వు గుర్తించలేదా అత డెవరో?" అంటూ మఘుల్ మెఘేరీ అషిక్‌ను పరీక్షగా చూసింది. అతడేనని నిశ్చయించుకున్నది. సంతోషంలో ముందుకు పరిగెత్తి అషిక్‌ను కౌగలించుకుంది. ఇద్దరూ స్మృతితప్పి నేల కొరిగారు. ఖుర్దూష్‌ఖే తమ్ముడు కోపోద్రిక్తుడై బాకు దూసి ఇద్దర్నీ చంపడానికి ఉద్యుక్తుడయ్యాడు. కాని ఖుర్దూష్ అతన్ని వారించాడు.

"శాంతించు తమ్ముడా! నుదుట వ్రాసిన రాత వృధాపోదు. జరిగేది జరక్కమానదు," అన్నాడు.

స్మృతి రాగానే మఘుల్ మెఘేరీ సిగ్గుపడిపోయి పరదాచాటుకు పారిపోయింది.

"నువ్వు అషిక్ కెరిబ్‌వే నని మాకు నమ్మకం కలిగింది. కాని ఇంతదూరం ఇంత శీఘ్రకాలంలో ఎలా రాగలిగావు?" అని అడిగాడు ఖే.

"మీకు నిదర్శనం చూపిస్తాను. నా శక్తితో ఒక్కవేటున బండరాతిని బద్దలు చేస్తాను. అబద్ధమైతే నామెడ నరుక్కుంటాను. కాని ఇంకొక మంచినిదర్శనం చూపిస్తాను. ఏళ్లనుంచీ అంధురాలైవున్న ఏ స్త్రీనైనా తీసుకురండి. నేను ఆమెకు దృష్టి కలిగిస్తాను," అన్నాడు అషిక్.

ద్వారంవద్ద నుంచున్న అతని సోదరి ఈ మాటలు వినగానే ఇంటికి పరిగెత్తింది.

"అమ్మా! నిజంగా అతడు నా అన్న అషిక్ కెరిబే నని తేలిపోయింది," అని చెబుతూ ముసలి తల్లిని వెంటబెట్టుకుని వివాహప్రదేశానికి తిరిగి వచ్చింది. అషిక్ తన జేబులో దాచిన మట్టిపెళ్ళను తీసి నీళ్ళలో కరిగించి ఆ నీటిని తన తల్లి కళ్లకు రాశాడు. "హాదిరిలియాజ్ ఎంత మహిమాన్వితుడో చూడండి" అన్నాడు. అతని తల్లి కళ్లు తెరిచి చూసింది. అప్పుడతని మాటలు అందరూ విశ్వసించారు. ఖుర్దూష్‌ఖే అతిలోకలావణ్యవతియైన మఘుల్ మెఘేరీని అషిక్ కెరిబ్‌కు అప్పగించాడు.

ఆనందంలో పొంగిపోతూ అషిక్ ఇలాగన్నాడు:

"ఖుర్దూష్‌ఖే! నామాట విను. నా చెల్లెలు మఘుల్ మెఘేరీకి ఎందులోనూ తీసిపోదు. నే నిప్పుడు లక్షాధికారిని. మఘుల్ మెఘేరీకి ఎంత వెండిబంగారం ఉన్నదో అంతా ఈమెకిస్తాను. కనుక నీవీమెను వివాహం చేసుకొని సుఖపడు." ★

ఒక్కతే కూతురువుంది—మిగిలిన వారందరూ మొగపిల్లలే! అందులో పెద్ద ఆయనకు వివాహమయింది! కోడలు కాపురానికి కూడా వచ్చింది!

భైరూడుగారి కూతురు, కోడలు ఏపనికి వెళ్లాలన్నా, ఏం చేయాలన్నా—యిద్దరూ కలిసే, వంతులువోతూ చెడుతూండేవారు. ఆ రోజు సాయంత్రం భైరూడుగారి కూతురుకు కడుపునొప్పిగా వుందని చెంబుతో నీళ్ళు పుచ్చుకుని సంపెంగ పెరట్లోకి వెళ్ళింది— ఆమెతో పాటు భైరూడుగారి పెద్దకోడలూ వెళ్లింది! మంచి వెన్నెలకాస్తూంది. వీధులు యింకా జనసంచారంతో కిటకిట లాడుతూనే వున్నాయి!

భైరూడుగారికూతురు కూర్చున్న చోట ఒక పుల్లను చేత్తోతీసి—ఆ సంపెంగ పొదలో గుచ్చుతూ కూర్చుంది!

ఇంతలో— కొంతసేపటికి ఒక రెండుగజాలపొడుగు, రోకలిఅంత లావూ కలిగిన గోధుమవర్ణం త్రాచుపాము "బుస్" మంటూ పడగ విప్పి పైకివచ్చింది. అంతే! ఎలాగ తప్పించుకుని బయటపడినారో—యిద్దరూ ఒణికిపోతూ ఒక్క గెంతులో యింట్లోకివచ్చి పడ్డారు! ఇంట్లోవున్న తల్లితో సంగతిఅంతా చెప్పింది కూతురు-- హడలిపోయింది తల్లి!

"సరే! ఎటూ వెళ్లకండి! పాము పగ—చాలా ప్రమాదమయినది సుమా, నాన్న తోటనుంచి వచ్చాక, విషయం చెపుదాంలెండి" అని పిల్లలని ఓదార్చింది.

భైరూడుగారి మండువా సావడి చాలా పెద్దది! మండువా చిల్లులోంచి వెన్నెల మండువా సావిట్లో పడుతూంది! ఏదో పనిమీద భైరూడుగారి పెద్దకోడలు సావిట్లోకి వచ్చింది! మండువాలో ఒకమూల జల్లెడులాగ చుట్టచుట్టుకుని—ఆ తెల్లని వెన్నెలలో మెరుస్తూ ఆ దే పాము పడుకునివుంది— కోడలు చూసి హడలిపోయింది. ఒక్కసారి "బాబోయ్!"—అని గొంతెత్తి అరచింది. పడమటింట్లో వున్న అత్తగారూ, ఆడబిడ్డా ఈ కేకకి ఏమిటో అని యివతలకు వచ్చారు! పెద్దకోడలు భయంతో ఒణికిపోతూ వుంది. తీరా చూసేటప్పటికి రెండుబారల త్రాచుపాము చుట్టచుట్టుకుని మెరుస్తూంది! ఆ పాముని చూసిన అత్తగారు' ఆడబిడ్డా భయపడిపోతూ— గుమ్మంలోనే భైరూడుగారి రాకకోసం ఎదురు చూస్తూ నుంచునివుండిపోయారు!

ఇంతలో కోటిమెరకతోటనుంచి యింటికి తిరిగివచ్చారు భైరూడు గారు! గుమ్మంలో భయంతో ఒణికిపోతూనుంచున్న భార్యను, కూతుర్ని చూసి అసలుసంగతి ఏమిటని అడిగి తెలుసుకున్నారు!

భయంతో జరిగిన కథనంతనూ చెప్పింది కూతురు!

"అదిగో! మండువా సావిట్లో తిష్ఠవేసుకు వుంది సర్పరాజు"— అంటూ వేలెట్టి చూపింది భర్తకు భార్య!

ఈ మాటలను విన్న భైరూడు గారు ఏమనుకున్నారో మరి— వెంటనే చేతిలోవున్న తోటసామానులను అక్కడనే పడేసి "ఏడీ! సుబ్రహ్మణ్యేశ్వరుడేడీ?—" అంటూ మండువా సావిట్లోకి గబగబా పరుగెత్తారు.

ఇంతలో "ఈపాము సామ్మా, నన్ను సంపెంగపెరటినుంచి తరు

★ పాముమంత్రంలో దిట్ట ★

ముకువచ్చింది"—అంటూ కూతురు ఏడుపు మొదలుపెట్టింది!

ఈ మాటలువిన్న భైరూడు గారికి చాలా బాధ కలిగింది— మండిపడిపోయారు!

భైరూడు సంతానంమీదనే సర్పరాజు దాడిచేయ తలపెట్టాడా! ఏనాడూ యింటివైపుకైనా రాని యీ సర్పరాజుకు ఈనాడు ఏం అవసరమయిందో! భైరూడంటే పాములనే గిరిగీసి నిల్పగల శక్తి వున్నవాడని తెలియదు కాబోసును?"—సరే! చూస్తాను. అంటూ తిన్నగా పెరట్లోకివెళ్ళి, నూతివద్ద స్నానంచేసి, శుభ్రంగా మడికట్టుకుని, చేతిలో యింతసుక పట్టుకుని తిరిగి సావిట్లోకివచ్చి నిలుచున్నారు.

కొంతసేపు ఏదో మంత్రోచ్చారణచేశారు! అంతే! పడుకున్న సర్పరాజు నెమ్మదిగా,

"ఎందుకమ్మాయి ఏడుస్తున్నావ్?"

"మా అన్నయ్యకు సెలవలు ఇచ్చారు. నాకు ఇయ్యలేదు."

"నీకెందు కివ్వలేదు."

"నేనింకా బడిలో చేరలేదుగా."

—ముక్కామల మధుసూదనరావు. రాజమండ్రి.

భయంతో వచ్చినదారినే వెళ్ళిపోవడం ప్రారంభించింది! అయినా భైరూడుగారికి కోపంచల్లారలేదు. "మంత్రశక్తిగల భైరూడువున్నాడని తెలిసికూడా, నా సంతానం మీద ఎందుకు యిలా ప్రవర్తించావు?"—అని గట్టిగా అరుస్తూ వెళ్ళిపోతూన్న సర్పాన్ని తిరిగి ఒక మంత్ర పఠనంతో అక్కడనే నిలిపివేసి—చేతులతో తీసిపట్టుకుని "ఈరోజు మొదలెట్టుకుని భైరూడు వంశం జోలికి నీవు, నీజాతి రాకూడదు. నీజోలికిగాని, నీజాతి జోలికిగాని మావంశంలో ఎవరూ రారు. నీదారి నీది. మాదారి మాది— వెళ్లు"—అని హెచ్చరించిపాముని విడిచేశారు!

వెంటనే తలఅయినా ఎత్తకుండా సర్పరాజు వెళ్లిపోయింది! ఆనాటి నుంచీ భైరూడుగారి వంశంజోలికి పాములుగాని, పాములజోలికి వీరుగాని పోవడం అనేది జరగలేదు! నాటినుంచీ భైరూడుగారి వంశంలో పాము మంత్రం వారసత్వవిద్య అయింది.

చూశారా! చాలులా !!

ఆంధ్రులలో ఎటువంటి మంత్రశక్తి కలిగినవారు వుండేవారో!! ★

విజ్ఞాన వీధులు

వై. యస్. శర్మ, అనంతపురం.

—స్త్రీ పురుషుల కామవాంఛ సృష్టిని ముందుకు సాగించే అమరజ్యోతి. ఈ అమరజ్యోతి దావాగ్నిలై సంఘాన్ని మింగకుండా రక్షించడానికే వివాహసంస్థ యేర్పడింది.

—భూమి ఏర్పడకముందు సూర్యుడిలో కలిసి ఉండేది. భూమి మాత్రమే కాదు. గ్రహాలన్నీని.

కె. సరళాదేవి, పోడవరం.

—విత్తనాలనుంచి కొత్తగా బయల్దేరిన మొక్క ఆకులు దళసరిగా ఉంటాయి. చింతగింజ చిక్కుడు గింజ పాతినప్పుడు వేరు క్రిందికి దిగి ఈ గింజల బద్దలు పైకి వచ్చేస్తాయి. అవి ఆకులు కావు. ఈ బద్దల లోంచి మొక్క ఆహారాన్ని గ్రహించుకుంటుంది.

—సిగరెట్టుపెట్టెలలోని ముచ్చి రేకు తగరమూ సీసముల మిశ్రమము. ఇవి సున్నములోని ఆమ్లజనితో కలిసినప్పుడు—అనగా రాసాయనిక క్రియ జరిగినప్పుడు వేడి పుట్టును. సున్నమూ బెల్లమూ, సున్నమూ చింతపండురసమూ కలిసినా యిల్లే.

భాస్కర శంకరనారాయణగారు,
గూడూరు.

—శుక్రగ్రహానికి కూడా భూమికి లాగే మబ్బుల ఆవరణ కలదు. అందువల్ల శుక్రగ్రహముయొక్క ముఖతలము ఎట్లున్నదో తెలియడము లేదు.

జాస్తి జవహర్లాలు, గుంటూరు.

—వెల్తురూ, వేడిమీ తరంగరూపమున ప్రసరించునన్నది విజ్ఞానశాస్త్ర విద్యార్థుల కందరికీ తెలియును. అయితే సూక్ష్మరంగములో మాత్రము ఇవి గుళికల వర్షమువలె కనపడునన్నది క్వాంటం (అనగా గుళికా) వాదము. ఈ గుళికల బలమూ గతి బలమూ, ఆవేగము, ఒత్తిడీ—మొదలగు గుణములను పరామర్శించునది క్వాంటం మెకానిక్సు. దాని ముఖ్య ఫలితము $J = \sqrt{J(J+1)}$ అన్న సూత్రము సూచిస్తుంది.—సాపేక్ష సిద్ధాంతాన్ని అయిన్‌స్టీన్ తరవాత చాలా మంది "జీర్ణము" చేసుకున్నారు.

పొడవూ, కాలమూ, ఇత్యాదులు 'ఇంత' అన్న స్థిరనిశ్చయము లేదనీ, కొలిచే వారి గమనపరిస్థితులను బట్టి ఉంటాయనీ అన్నది సాపేక్ష సిద్ధాంతపు మూల సూత్రము.

జె. వి. సూర్యకుమారి, రాజగంగపూర్.

—రేడియో తరంగాలు, కాంతి తరంగాలూ ఉష్ణతరంగాలూ వంటివే. (అయితే వీటి తరంగాయతి హెచ్చు.) భూమిని అంటి, గాలిపొరలపైన, అయానుల ఆవరణమున్నది. రేడియోతరంగాలు ఈ అయనావరణమును తాకి మళ్లీ భూమివైపు—అద్దమును తాకి వెల్తురు మళ్లినట్లే—మళ్లుతాయి. మళ్లీ భూమికి తాకి పైకి మళ్లుతాయి. ఇలాగు పరావర్తమైన రేడియో తరంగాలవల్లనే భూమికి ఒకప్రక్క ప్రసారమయే సంకేతాలను భూమికి మరోక పక్క నుంచి వినగలుగుతున్నాము.

కదిరి దండాసిగారు, సోంపేట.

—పంటిని రాయితో కొట్టినట్లయిన నొప్పి కలుగునని అందరికీ తెలిసిన విషయమే. కొట్టినప్పుడు పంటికిగట్టి ఒత్తిడి కలిగి నరాలకు అంది, నొప్పి కలిగించును.

అదేరీతిగా పళ్లమధ్యన పడిన రాతిని నొక్కినప్పుడు పంటికి ఒత్తిడి కలిగి తద్వారా నొప్పి కలుగును. పంటికి అడుగు భాగములో ఒత్తిడి కలుగుట అసామాన్య అనుభవము. అందుకే అంత బాధ. ★

మంకు

(12-వ పేజీ తరువాయి)

రానందుకు చప్రాసి కోప్పడ్డడు. మల్లిగానికి కళ్లు మండుతున్నాయి. కాళ్లు గుంజుతున్నాయి. కని చప్రాసి అనితోటి ఎనిమిది గజాల లోతు బాయిల మంచినీల్లు జేదపెట్టిండు. ఆ సోపల పంతులు నెలుకు నాలుగు మాట్ల పాటాలు జెప్తె మా ఎక్కువ. సోపచుట్టు కూరగాయల చెట్లు. కాసిన కూరగాయలు పంతులు తను దిని, తనూరికి పంపిచ్చుకుంటడు. మల్లిగాని చేతులు లేక్కపోతున్నాయి. నీల్లు గుంజలేక గుంజలేక బొక్కెన బాయిల పడేసిండు. తాను బాయికాడ గూలబడ్డడు. బొక్కెన బాయి లేసినందుకు మల్లిగాన్ని చప్రాసి కోప్పడ్డడు. సోపతి గాన్నచ్చి లేపట్టి కూకుండపెట్టిండు. మల్లిగాని పెయ్యి గాల్తుంది. సోపలకు దీస్కపోయి తల్లేసి పండపెట్టిండు సోపతిగాన్లు.

పొద్దంగంగ ఇంటికచ్చి సూస్తే మల్లిగాడింటికి రానేలేదని తెలిసిందాళ్లయ్యకు. మళ్ల సంకల కర్ర బెట్టుకోని, బయలెల్లిండు పెద్దమనిసి. సోపలకు గిన వోయిండేమోనని తిరిగితిరిగి అడికే చేరిండు. తల్లిమీద సొమ్మసిలి పన్న తన కొడుకును జూసెటాల్లకు బొద్దట్నుంచున్న కోపమంత కరిగింది పెద్దమనిసికి. 'మల్లిగా' అన్నడు గార్వంగ. ఆ మాటల ఎంత గార్వం ఒలకబోయాల్నన్నా చాతగాలేదు పెద్దమనిసికి. 'నీ కస్సలుకు దొరుకనని!' లేచి పురుకబోయిండు మల్లిగాడు. కని చాతగాలే. లెవ్వబోయిండు గని మల్ల గూలబడ్డడు. పెద్దమనిసి కన్లు గిల్లున దిరిగినయి. యాన్నుంచో ఎండిపోయిన చెర్ల చెలిమె బడ్డట్టు, కన్లల్ల నీల్లూరినయి. సలసల కాగుతున్న రొట్టె పెంక మీద పడ్డట్టు మల్లిగాని పెయిమీద అల్లయ్య కన్ల నీల్లు పడి సుర్రుమని ఆరిపోయినయి. మల్లిగాన్ని బుజానేసుకోని యింటికి బయలెల్లిండు పెద్దమనిసి. 'నే నింటికి రాను వో, నన్ను నువ్వు గొడ్తవ్' అనుకుంట, కాల్లూ చేతులూ గొడ్తుండు అనయ్యకు. ఇన్నాల్ల గొట్టిన కసి దీర్చుకుంటుండేమో! పెద్దమనిసి ఊపు సున్నం సున్నమయింది.

ఇంటికి వోయి పక్క మంచం వాల్చి, గొంగడేసి మల్లిగాన్నందుల పండేసిదాంక కంప తెచ్చె మోసుకచ్చినట్టున్న దాల్లయ్యకు. అల్లవ్వచ్చి ఆని పక్కాల గూకుండి, ఏడ్చింది. మల్లిగానికి ఏడుపచ్చింది. 'ఇంత మంకు బనికిరాదురా' అని బుదరగిచ్చిందాల్లవ్వ. తనదా మంకు? ఆ మాటనే అల్లయ్యకు జెప్పడు చాతగాదేంది అల్లవ్వకు? అని అందామనుకున్నడు కని మాట్లాడె చాతనైతేగద! బోర్లబొక్కల పండి మొకం మలుసుకోని గోడుగోడుమని ఏడ్చిండు పోరడు పాపం. 'అని మంకుతనంతోటి ఆడే మంచాన బడ్డడు. మందుల మల్లయ్యను బిల్సుకత్తానని అల్లయ్య అవుతలబడ్డడు. ★




ప్రకాష్ వారి "అంతే కావాలి"లో జి. వరలక్ష్మి


సాహిణీవారి సంగీతచిత్రం "అమర సందేశం" ఇటీవల విడుదలై ప్రేక్షకుల దృష్టిని బాగా ఆకర్షిస్తోంది.

పాశ్చాత్య దేశాల్లోలాగ మనకి సంగీత చిత్రాలంటూ ప్రత్యేకంగా లేవు. మన చిత్రాలన్నీ సంగీత చిత్రాలే. సంగీతమే కాదు, వీలైనంతవరకూ అన్నిరకాల వినోదాలనీ, నృత్యం, నాటకం, సర్కసు, గారడీ వగైరాలన్నిటినీ చేర్చి చిత్రాలు తయారుచేయడం మన నిర్మాతల కలవాటు. కాని ఈ "అమరసందేశం" మాత్రం సంగీత చిత్రమనే పేరుకు తగివున్నది. ఇతివృత్తం సంగీతంమీదనే ఆధారపడివున్నది కావడంచేత, ఇందులో సంగీతాన్ని వేరే కారణాలు చెప్పి సమర్థించుకోనవసరం లేదు. ఈమాదిరి ఇతివృత్తాలు కలవి హిందీలో కొన్ని వచ్చాయి, తెలుగులో ఇది కొంతవరకూ కొత్తదిగానే కనిపిస్తుంది. నిర్మాతలు కూడా ఈ ఇతివృత్తాన్ని ప్రజారంజకంగా తీయడానికి ప్రయత్నించి కృతకృత్యులయ్యారు. దీనికి దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు; మాటలు, పాటలు శ్రీశ్రీ, ఆరుద్ర వ్రాశారు; సంగీతం ప్రసాదరావు, కేల్కర్, కెమెరా కె. యల్. రాయ్ నిర్వహించారు. అమరనాథ్, శ్రీరంజని, పద్మిని, రేలంగి, మిక్కిలినేని, వంగర, పెరుమాళ్ళు, కె. వి. యస్. శర్మ, మోహన్ మున్నగువారు నటించారు.

సంగీతప్రియుడైన విక్రమకేసరి రాజు ఆస్థానంలో సంగీతానికి ప్రత్యేకంగా శారదాపీఠం ఒకటి ఉన్నది. దాన్ని అధిరోహించడానికి ఎవరూ అర్హులు దొరకనందున రాజుగారు చింతిస్తూ ఉంటారు. సుధాకరసూరి అనే సంగీతవిద్వాంసుడు విద్యానాథ్ అనే గాయకుణ్ణి చేరదీసి సంగీతశాస్త్రం బాగా నేర్పి ప్రవీణుణ్ణి చేస్తాడు. తన కుమార్తె శారదనిచ్చి పెళ్లి చేస్తాడు. శారదాపీఠాన్ని అలంకరించవలసిందిగా కోరి తన కుత లేఖ తెస్తాడు. విద్యానాథ్ ఆకోరికను నిర్లక్ష్యం చేసినస్థితిలో, అతని భార్య శారద తను బతికుంటే అతనికి సంగీతసాధనపై దృష్టి ఉండదని గ్రహించి, ఇల్లు వదలిపోతుంది. అతను ఆమె మరణించిందని అనుకుని, దుఃఖించి, రాజాస్థానం చేరుకుని గానప్రతిభతో శారదాపీఠం అలంకరిస్తాడు. ఇల్లు వదలి వెళ్ళేసమయంలో గర్భిణిగావున్న శారద, దొంగలచేతుల్లో పడి, పాతివ్రత్యం కాపాడుకుంటూనే కొడుకును కంటుంది. దొంగల్ని పట్టుకోడానికి వచ్చిన రాజభటులద్వారా, రాజాస్థానానికి వెళ్ళి, భర్తను కలుసుకొని అతనిచేత శంకింపబడి, తిరిగి స్వగ్రామానికి వెళ్ళిపోతుంది. ఆమె కొడుకు పెద్దవాడై, గాయకుడవుతాడు. ఈలోగా విద్యానాథ్ మధురసంగీతంలో మైమరచి, రాజా, రాజోద్యోగులూ దేశాన్ని పాడు పెడతారు.



వాహినీవారి "బంగారు పాప"లో ఒక సన్నివేశం.



త్వరలో విడుదలకానున్న పారమౌంట్ వారి "సీక్రెట్ ఆఫ్ ఇన్‌కాస్" చిత్రంలో ఒక దృశ్యం. ఈ చిత్రంలో ఛార్ల్‌టన్ హెస్టన్, రాబర్ట్‌యంగ్, నైమాసుమాక్ అనే కొత్తనటి నటించారు.

ఆ సమయంలో విద్యానాథ్ కుమారుడు ప్రజల్ని వెంటబెట్టుకునివచ్చి రాజుకూ, తనతండ్రికీ కర్తవ్యబోధచేసి సంగీతంలో తన తండ్రిని ఓడిస్తాడు. విద్యానాథ్ తన తప్పిదాలకు పశ్చాత్తాపపడి భార్యనూ, కుమారుణ్ణీ స్వీకరిస్తాడు.

'సంగీతం కర్తవ్యాన్ని మరిచిపోయేట్టు చేయగూడదు, జ్ఞాపకం చెయ్యాలి' అనేది ఈ చిత్రంలోని సందేశం.

ఈసందేశానికి కథాంతంలో ప్రాముఖ్యం వచ్చిందిగాని, మొదటినుంచీ దాని ప్రమేయం లేదు. కథ మొదలుకావడం శారదాపీఠానికి సంబంధించిన సమస్యతో. విద్యానాథ్ శారదాపీఠం అధిరోహించడంతో ఆ సమస్య పరిష్కారమవుతుంది. ఆ తరవాత భార్య శారదను విద్యానాథ్ శంకించి పొమ్మనడంతో ఇంకో సమస్య ఏర్పడుతుంది. చివర చివర, సంగీతంలోపడి రాజూ, విద్యానాథ్ మొదలైనవారు తమ కర్తవ్యాల్ని విస్మరించడంతో ఇంకో సమస్య కలుగుతుంది. ఈ రెండింటిని విద్యానాథ్ కుమారుడు వచ్చి పరిష్కరిస్తాడు. ఈవిధంగా కథ జరుగుతున్న కొద్దీ వేర్వేరు అంశాలకు ప్రాముఖ్యం వచ్చి కథైక్యానికి భంగం కలుగుతుంది.

మొదటినుంచీ ఉన్నతస్థాయిలోఉన్న విద్యానాథ్ పాత్ర భార్య శీలాన్ని శంకించడందగ్గిర పల్టీకొట్టినట్టు కనిపిస్తుంది. భార్యశీలాన్ని అంత తేలికగా శంకించగలిగినవాడిమీద ప్రేక్షకులకు సానుభూతి కలగదు. అంతకంటే, శ్రీరాముడు ప్రపంచానికి వెరచి సీతను త్యజించినట్టు, దుష్యంతుడు శకుంతలను తిరస్కరించినట్టు, తనకు భార్యపై నమ్మకం ఉన్నప్పటికీ ప్రపంచానికి సత్యం నిరూపించడానికై ఆమెను తిరస్కరించినట్టు చూపిస్తే ఇంకా బాగుండేది. అలాగే అఖరున కొడుకుసంగీతం విని భార్యను స్వీకరించడంకూడా బాగాలేదు. అంతకంటే దొంగల నాయకునిచేత శారద పాతివ్రత్యానికి సాక్ష్యం ఇప్పించి, దాన్ని విద్యానాథ్ పాటించినట్లు చూపితే బాగుండేది.

కథలో కొన్నికొన్ని లోపాలున్నప్పటికీ, ప్రేక్షకులను రంజింపజేయగలిగేటట్లు కథను నడిపించిన కొత్త దర్శకుడు ఆదుర్తి అభినందనీయులు. ఈయన కొన్ని సన్నివేశాలను మరేదర్శకునికీ తీసిపోనివిధంగా చిత్రించారు. విద్యానాథ్ పాట విని రాజనర్తకి గాయంసంగతి మరిచి నృత్యంచేస్తూ అతని పాదాలమీద వాలిపోవడం, విద్యానాథ్ శారదాపీఠం మెట్లు ఒకొక్కటే ఎక్కుతూ ఒకొక్క చరణం గానం చేయడం, అంతంలో విద్యానాథ్‌కూ, అతని కుమారుడికీ జరిగిన సంగీతపు పోటీ, విద్యానాథ్ కుమారుడు

రాజుకూ, తండ్రికీ కర్తవ్యబోధ చేయడం మొదలైన దృశ్యాలు బాగా రక్తికట్టాయి.

సాధారణంగా మన చిత్రాల్లో వాతావరణసృష్టికి అంతగా శ్రద్ధ తీసుకోరు. జమీందారు భవనం, మహారాజ సౌధం అని అంటారుగాని అక్కడ రాజుగారుతప్ప మరో పిట్ట కనిపించదు. ఈ చిత్రంలో అలాకాకుండా రాజాస్థానానికి సహజమైన వాతావరణం కలిగించడంలో స్క్రిప్టు విచయితలు, దర్శకుడు శ్రద్ధ తీసుకున్నారు. కళాప్రియుడైన రాజుగారివద్ద రాజనర్తకి, విదూషకుడు, మంత్రి, భిషగ్వరులు, దైవజ్ఞులు, ఇతర ఉద్యోగులు ఉండడంవల్ల ఒక నిండుదనం కలిగింది. ఒక రాణినికూడా ప్రవేశపెడితే ఇంకా బాగుండేది.

అన్నిటికంటే ఈ చిత్రానికి బలం చేకూర్చినది సంగీతం. ఇతివృత్తంలోనే సంగీతానికి ప్రాధాన్యం ఉన్నందున, పాటలు చాలవరకూ సందర్భోచితంగా ఉన్నాయి. విద్యానాథ్ పాత్రను రూపకల్పన చేయడంలో అమరనాథ్ ఎంత నేర్పు చూపాడో, ప్లేబాక్ పాడిన రాజా కూడా అంత నేర్పూ చూపాడు.

విద్యానాథ్‌గా అమరనాథ్ ఆ పాత్రకు అర్హుడనిపించుకున్నాడు. శ్రీరంజని, పద్మిని, రేలంగి, మిక్కిలినేని మొదలైనవారంతా చక్కగా నటించి చిత్రం రక్తికట్టడానికి తోడ్పడ్డారు. తాపీ, శ్రీశ్రీ, ఆరుద్రగార్లు స్వతహాగా మంచి సాహితీపరులు కావడంవల్ల సంభాషణలు, పాటల సాహిత్యస్థాయి ఉత్తమంగా ఉన్నది.

ఈ చిత్రంలో చెప్పుకోదగిన మరోక మంచిసంగతి సినిమా శృంగారానికి ఇందులో తావియ్యకపోవడం. నిర్మాతలు కొంచెం మెత్తబడితే, తేలిగ్గా విద్యానాథ్‌కూ, రాజనర్తకికీ గాని, రాజుగారికీ రాజనర్తకికీగాని శృంగారసంబంధం కల్పించి ఆయా పాత్రల ఉదాత్తతను ఖూనీ చేసేవారు. కాని అలాంటిదేమీ లేకుండా, విద్యానాథ్‌ను కేవలం సంగీతమే ఆదర్శంగా కలిగిన గాయకుడుగాను, రాజుగార్ని పూర్తిగా సంగీతప్రియుడుగాను, రాజనర్తకిని కేవలం రాజనర్తకిగానూ చిత్రించి ఇతివృత్తపు గాంభీర్యాన్ని కాపాడారు. రేలంగి విషాద సన్నివేశాల్లో కూడా హాస్యధోరణిలోనే నటించడం మినహాయిస్తే, ఎక్కడా హద్దులు దాటకుండా ప్రేక్షకులకు వినోదం కలిగించాడు.

మొత్తంమీద ఈ ఏడాది తెలుగు సినిమా పరిశ్రమనుండివచ్చిన చెప్పుకోదగ్గ చిత్రాల్లో సాహిణీ వారి "అమరసందేశం" నిస్సందేహంగా ఒకటి. ఇందుకు సాహిణీ నిర్మాతలను అభినందిస్తున్నాము. వీరిసంస్థ మంచి చిత్రాలను ఇంకా తీసి ప్రజలమన్ననలు పొందగలదని ఆశిస్తున్నాము. ★



పారమౌంట్ వారి మొదటి విస్టావిజన్ చిత్రం "వైట్ క్రిస్టమస్"లో హాస్యనటుడు డానీకేయీ, వేరాఎలెన్.

ప్రేక్షకుల అభిప్రాయాలు

“అమరసందేశము”


చిత్రం నిడివి 16 వేలకు మించినప్పటికీ ప్రేక్షకులకు విసుగు పుట్టలేదు. వాలకుట్టుకు “బైజుబావరా”కు అనుకరణగా కన్పించింది. కొద్దిలోపో అన్నప్పటికీ, ఆదుర్తివారి డైరక్షన్ ఫరవాలేదనిపించింది. మాటలకన్నా పాటలే రక్తికట్టాయి. ముఖ్యంగా “సరిగమ”లతో కూడిన “పదసత్కళా, శ్రీరజల” అనే పద్యం వ్రాసినవారికి ధన్యవాదాలు. రాజా, మాధవపెద్ది సత్యం పాటలు చాల బాగున్నయ్.

కథ చారిత్రాత్మకంగా కన్పించినప్పటికీ, చిత్రంలో రాజదర్బారు మినహా తక్కినసీన్లు అనేకం సాంఘికచిత్రం పోకడలో ఉన్నాయి. దొంగలముఠా, వారికి శారద చిక్కుపడటం – ఇవన్నీ కేవలము శారద విద్యానాథ్‌ల కలయిక కోసమే సృష్టించినట్లు తోస్తుంది. తరువాత నిండు రాజసభలో తన కొడుకు కాదని తిరస్కరించిన సుధను సంగీతం పోటీలో తన్ను ఓడించినంతమాత్రాన మళ్ళీ కుమారునిగా స్వీకరిస్తాడు విద్యానాథ్. రాజనర్తకి హేమాంగినికి మహారాణి కివ్వవలసిన ప్రాముఖ్యం ఇచ్చారు. ఇటువంటివి అనేకం ఉన్నప్పటికి అవి ప్రేక్షకుల తృప్తికి అడ్డురాలేదు.

ఫొటోగ్రఫీ మున్నగునవి మామూలుగానే ఉన్నవి. నటీనటుల్లో అమర్‌నాథ్ విద్యానాథ్‌గాను, శ్రీరంజని శారదగాను తమ పాత్రలను బాగా పోషించారు. భజగోవిందంగా రేలంగి బాగానే నటించాడు. మొత్తంమీద “అమరసందేశం” పండిత పామరులను రంజింపచేస్తుందనే చెప్పాలి.

కె. ఎస్. ప్రకాష్,
—విజయవాడ.

మొదటినుండి పిక్చర్ స్టిల్సు చూస్తున్నా, వాల్ పోస్టర్లు చూచినా చిత్రం సంగీత చిత్రమని, హిందీ “బైజూ బావరా”ని అనుసరించి యుండవచ్చని అనుకున్నట్లుగానే అయింది. సాహిణీవారి “అమరసందేశం” గొప్ప సంగీతమయ చిత్రం. తెలుగు సినీరంగంలో ఇప్పటికైనా మనం ఈమాత్రం సంగీత చిత్రాన్ని చూడగలిగామంటే డైరెక్టరు ఆదుర్తిగారిని మెచ్చుకోవలసిందే. చిత్రానికి అమరనాథ్, రేలంగి, మాస్టర్ మోహన్, విజయలక్ష్మి జీవం పోశారు. రాజా పాడిన ప్లేబాక్ పాటలు చాలా బాగున్నవి. శ్రీరంజని, పద్మినీల నటన ఫరవాలేదు. పెరుమాళ్ళు, మిక్కిలినేని పెద్దగా మెప్పించలేకపోయారనే చెప్పవచ్చు. మాస్టర్ మోహన్, చి|| విజయలక్ష్మిల నటన అద్భుతంగా ఉంది. ఫొటోగ్రఫీ, సంగీతం బాగున్నవి. చిత్రం నిడివి తగ్గించే అవకాశాలు చాలా వున్నవి. చిత్రం సగంనుండి బాగా రక్తికట్టింది. ఆఖరి ఘట్టంలో సుధ బీదలను తనవెంట తీసుకుని అంతఃపురంలోకి వచ్చినపుడు రాజుగారి ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాలు



విజయావారి “మిస్సమ్మ”లో ఎన్. టి. రామారావు, సావిత్రి.

ప్రతిఒక్క ప్రేక్షకుని మనస్సు కదల్చి వేస్తవి. ఈ రోజుల్లో చిత్రాలు రాణించుటకు పెద్ద హీరోలకన్న 15 సం|| లోపల పిల్లలే కారకులని ఇప్పటికైనా డైరక్టర్లు గుర్తించుట మేలు.

అంకెం కృష్ణారావు,
—తెనాలి.

*　　*　　*

"మధురం మధురం మనోహరం" అన్న యిరవుసాంపైన పాటను ఆధరణంగా కలిగిన 'అమరసందేశం' సందేహం లేకుండా 'మధురం మధురం మనోహరమే! తెలుగు చిత్రరంగంలో ఒక గొప్ప సంగీతమయ చిత్రం నిర్మించినందుకు సాహిణీవారు అభినందనీయులు. ఉత్తమస్థాయినంతా గుత్త పుచ్చుకున్న చిత్రం అమరసందేశం.

రచయితలు తాపీ, శ్రీశ్రీ, ఆరుద్రగార్లు మాటలూ పాటలూ ఉత్తమస్థాయిలో నుండేటట్లు కష్టించి సృష్టించారు. రచనా రమణిని ప్రాసలనెడి కాసులపేర్లతో అందంగా అలంకరించారు. కొన్ని పాటలలో సాహిత్యం సన్నగిల్లింది.

బైజూబావరా చిత్రంలోని కొన్ని ఘట్టాలను కొట్టేసినా వాటికన్నా బాగా చిత్రించారు.

'ఆదుర్తి'దర్శకత్వం అమోఘంగా వుంది. క్రొత్తవారైనా సిద్ధహస్తునిలా ప్రవీణత చూపారు. ప్రతి చిన్న విషయాన్ని కూడా గుర్తులో పెట్టుకొని జాగ్రత్తగా నిర్వహించారు. ఆదుర్తిని మంచి దర్శకుల జాబితాలో చేరుస్తూ అభినందించాలి.

ఈ చిత్రానికి సంగీతం ప్రాణప్రదమైంది. సంగీతదర్శకులు కేల్కర్, ప్రసాదరావుగార్లు అమోఘ కృషిచేసి, వుత్తమస్థాయిలో సంగీతాన్నిచ్చారు.

నిర్మాతలు నారాయణద్వయం అభినందనీయులు.

సాహిణీసంస్థ శాశ్వతమై సాహిణీలా రాణించి, ఉత్తమచిత్రాలింకా ఎన్నో అందజేయగలదని ఆశిస్తున్నాను.

వాడ్రేవు గవర్రాజు,
—రాజమండ్రి.

*　　*　　*

'సంగీతం మానవుల కర్తవ్యాన్ని మరపించడానికి గాదు; గుర్తుకు తేవడానికి - అన్నది నిజంగా 'అమరసందేశం.' మాటలు, కొన్ని పాటలు, చాల బావున్నాయి. కొన్నిచోట్ల పేలవంగావున్నా సంగీతం బాగానే వుంది. ఫొటోగ్రఫీ ముచ్చటగా వుంది. తెరమీద తరాలు మారిపోతున్నా, మేకప్ మాత్రం మారకపోవడం ఆశ్చర్యంగానే వుంది.

విక్రమదేవరాయలుగా మిక్కిలినేని యేమాత్రం రాణించలేకపోయాడు. రేలంగి హాస్యం, పద్మిని నృత్యాలు లేకపోయినట్లయితే, కథావస్తువు బలపడి, చిత్రం పూర్తిగా రక్తికట్టేది. దర్శకునికి యింకా పూర్వపు వాసనలు పోయినటు లేదు. 'బైజూ బావరా' తో పోటీ జేయలేకపోయినా పరాసరిన చిత్రం బాగానే వుంది.

కె. మారుతిరామిరెడ్డి,
—చీరాల.

*　　*　　*

ఆదుర్తివారి దర్శకత్వంతో తయారయిన యీ "అమరసందేశం" ప్రజలకుగూడా ఓక సందేశాన్ని అందివ్వగలదనుటలో సందేహం లేదు. చిత్రం ఫరవాలేదు. విక్రమ దేవరాయలు పాత్ర ధరించిన మిక్కిలినేని రాధాకృష్ణమూర్తిగారి నటన ప్రశంసనీయంగా వుంది. విద్యానాథ్‌గా అమర్‌నాథ్ నటించాడేగాని జీవించలేకపోయాడు. హేమాంగినిగా పద్మిని, శారదగా శ్రీరంజనిల నటన బాగావున్నది. కమల్‌ఘోష్‌గారి ఫొటోగ్రఫీ చిత్రానికి ఒక హైలైట్. ప్రసాదరావు, కేల్కర్‌ల మ్యూజిక్ వినసొంపుగా వున్నది. 'ఆదుర్తి' దర్శకులలో ఒక వుత్తమదర్శకుడు కాగలరని ఆశించవచ్చు.

డేగా రాధాకృష్ణనాయుడు,
—నెల్లూర్.

*　　*　　*

సాహిణీవారి "అమరసందేశం" చిత్రం కథ శ్రేష్ఠమైనది. చిత్రం మొదటినుంచీ చివరివరకు విసుగులేకుండా యీ చిత్రాన్ని సృష్టించిన దర్శకులు ఆదుర్తి సుబ్బారావుగారభినందనీయులు. అమరనాథ్ నటనా చాతుర్యాన్ని యీ చిత్రం యినుమడింపజేస్తూంది. భుజగోవిందంగా రేలంగి నటన వర్ణనాతీతం. శారదగా శ్రీరంజని బాగానే నటించింది. మిక్కిలినేని రాజు పాత్రకు అనర్హుడని చెప్పితీరాలి. సూర్యకుమారి, విజయలక్ష్మి చక్కగా నటించారు. "దయామయి శారదా," "ఎరీ నా శరీ మాతాశరీ", "ఝనఝన నీ అడుగుల తాళం", అను పాటలు బాగున్నవి. ఫొటోగ్రఫీ అంతగా బాగులేదు.

కావిపల్లి సత్యేశ్వరరావు,
—పులాపురం.

*　　*　　*

ఇది సంగీత ప్రాముఖ్యము గల చిత్రం. "మల్లీశ్వరి" తరువాత యిటువంటి చిత్రము రాలేదు. చిత్రము చాలా బాగున్నది. అమర్‌నాథ్, పద్మిని, శ్రీరంజని బాగా నటించారు. రేలంగి హాస్యము చక్కగా పోషించాడు. ఛాయాగ్రహణం ఫరవాలేదు. ముఖ్యంగా ఎ. ఎమ్. రాజా పాడిన పాటలు, చెవుల కింపుగా నున్నవి. ఆదుర్తి దర్శకత్వము షుమారుగా వున్నది. మొత్తమునకు యిదియొక ఉత్తమ సంగీత చిత్రమని చెప్పవచ్చు.

కాటి పరంధామ్,
—విశాఖపట్టణం.

★

★ ఉన్నతుని ఆదర్శలోకం ★

(30వ పేజీతరువాయి)

మీద ఛళ్ళుఛళ్ళున రెండుదెబ్బలు వేశాడు నన్ను. నాకు నవ్వాగటంలేదు, ఏమిటో ఈమనిషి ఇంతఅర్థం కాకుండా వున్నాడూ అని. విపరీతంగా నవ్వాను. ఇప్పటిదాకా ఇంకేం కొంపమీదకు వస్తుందో అని బెదిరిపోతూ చూస్తున్న ఆ అమ్మాయి అంది:

"ఏమిటి నాన్నా, అలా తొందరపడతావు? ఇప్పుడాయ నేమన్నాడని, అనవసరంగా దెబ్బలాటకి మన దారిన మనం పోక" అని నావంక జాలిగాను, ప్రార్థనాపూర్వకంగానూ తిరిగి "మీ రెవరో మేమెవరో తెలియకుండానే ఇంత జరిగింది. ఏమనుకోకండి. మరిక పోయొస్తాము" అంది.

"అల్లాగే, యేం ఫర్వాలేదులెండి" అని ఇంకా నవ్వుతూనే వున్నాన్నేను. కొత్తగా ఇప్పటివరకూ నవ్వుతున్న నన్ను చూసి గాబోలు, వెళ్లబోతున్న ఆ పెద్దమనిషి అన్నాడు:

"ఆ, అసలెవడో పిచ్చాడులాగుంది, ఆ నవ్వూ అదీ చూస్తే. అనవసరంగా వాడు లోకి దిగాం. ఇకరా అమ్మాయిపోదాం"

ఆమె నావంక అదోరకంగా, నన్నిహితులు విడిపోతున్నట్టు బరువుగా కళ్ళెత్తి చూసి మెల్లిగా తండ్రి ననుసరించింది.

పగలంతా గమించిన ఆ నిరంతరపథికుడు, సూర్యుడు అలసి ప్రయాణాన్ని పుచేసి విశ్రమించబోయే వైపుకు లోయలో చరచరా సాగిపోతున్న ఆ యిద్దర్నీ కనుచూపు దాటిపోయేవరకూ చూస్తూ అలా వుండిపోయాను. ఈలోపల ఆయువతి నాలుగైదుసార్లు వెనుదిరిగి చూడటం నేను గమనించాను.

★



“కాళహస్తిమహాత్మ్యం”లో మాలతి.

నేషనల్ ఫిలింబోర్డు

నేషనల్ ఫిలిం బోర్డును స్థాపించడానికి గాను భారతప్రభుత్వం ఈసారి పార్లమెంటులో ఒక బిల్లును ప్రవేశపెట్టగలదని తెలుస్తోంది. ఫిలిం పరిశ్రమ విషయంలో ప్రభుత్వవిధానాన్ని అమలుచేయడానికి ఈ బోర్డు సహాయం చేస్తుంది. ప్రస్తుతం ప్రభుత్వానికి ప్రైవేటు నిర్మాతలతో ఉన్న సంబంధమల్లా సెన్సార్‌షిప్ విషయంలో మాత్రమే ఉంటోంది. నేషనల్ ఫిలిం బోర్డు స్థాపించబడినప్పుడు, అది చిత్ర నిర్మాణంలో సలహా ఇవ్వడానికొక ఫిలిం ప్రొడక్షన్ బ్యూరోను, టెక్నికల్ తర్ఫీదు ఇవ్వడానికొక ఫిలిం ఇన్స్టిట్యూట్‌నూ ఏర్పరుస్తుంది.

“కాళరాత్రి” నాటక ప్రదర్శనం

నవంబరు 7వ తేదీని బందరు మినర్వా హాలులో శ్రీ నవ్యకళామండలి, విజయవాడవారిచే కాళరాత్రి అనే నాటకం ప్రదర్శించబడింది. ప్రఖ్యాత శ్రీ రామమూర్తిగారు రచించిన ఈ నాటకం కొంతకాలం క్రితం ఆంధ్ర వారపత్రికలో సీరియలుగా ప్రచురింపబడినది. సుమారు 2 గంటలసేపు చివరవరకు బిగిమీద నడుస్తుంది.

సరదాగా మిత్రులంతా భైరవలంకలో నాల్గుదినాలు గడపబోగా, నరహరి భార్య కమల, నారాయణతో ప్రేమకలాపాలాడటము, అది గమనించిన నరహరి రాజారావు సరదాకు సృష్టించిన నక హాస్య సన్నివేశాన్ని అవకాశంగా తీసుకుని, నారాయణను రూపుమాపి ఆ నేరాన్ని రాజారావు మీదకు నెట్టడము చివరకు నరహరి నేరం బయటపడటం, నరహరి ఆవేశంతో తన భార్యని అంతంచెయ్యడంతో నాటకం ముగుస్తుంది.

రాజారావుగా నటించిన రమణమూర్తిగారి నటన ప్రత్యేకించి శ్లాఘనీయంగా వుంది. నాటకం విజయం సాధించడంలో రమణమూర్తిగారి వాచికం, అభినయమూ మిన్నగా తోడ్పడ్డాయనడం అతిశయోక్తి కాబోదు.

రామానుజంగా నటించిన కె. వెంకటేశ్వరరావుగారి నటన చివరవరకు ఉన్నత స్థాయిలో నడిచింది. ‘నాటకం’ అనే నాటకంలో రఘుపతిగాను, ‘మావూరు’లో శంకరంగాను, ‘ఈనాడు’లో పురుషోత్తంగాను, విశ్వశాంతిలో అమరయ్యగాను ప్రేక్షకుల హృదయాల్లో నిలిచి, ‘నా బాబు’ నాటికలో ఉత్తమ నటుడుగా కళాపరిషత్తుచేత బహూకరింపబడిన వెంకటేశ్వరరావుగారి నటనాప్రావీణ్యానికి యిది మరొక క్రొత్తవిజయం.

నరహరిగా డి. జగన్నాధరావు, సుకుమార్‌గా ప్రసాద్, నారాయణగా పి. శ్రీరామమూర్తి, వెంకన్నగా బలపతిరావు, మోహన్‌గా శ్రీరాములు, కమలగా జయశ్రీ తృప్తికరంగా నటించారు.

నళినిగా నటించిన శ్రీమతి నిర్మల నటన ప్రేక్షకుల మన్ననల నందిందని ప్రత్యేకించి చెప్పాలి.

పోతే విషాదసన్నివేశాలలో కూడా సుకుమార్ హాస్యాన్ని పోషించడంమాత్రం జుగుప్సాకరంగా వుంది.

డైరక్టరుగా కె. వెంకటేశ్వరరావుగారి ప్రతిభ, పట్టుదల, ప్రతిసీనులోను కన్పిస్తున్నది. నటులలోవున్న స్వల్పలోపాలను ముందు ప్రదర్శనలలో సర్దుకుంటే నాటకం ఆంధ్రదేశమంతటా ప్రదర్శించవచ్చును.

సుకుమార్ పాత్ర హాస్యంకొరకు వున్నదనుకున్నా, నాటకానికి మోహన్‌పాత్ర ఏవిధంగాసాయపడిందో, ఆపాత్రయొక్క ప్రయోజనమేమిటో ఎంత ఆలోచించినా అర్థం కావటంలేదు.

రచయిత ఈ నాటకంలోని ‘డైలాగ్’లను, చిన్నవిగా అమర్చినట్లయితే నాటకం యింకా బాగా వుండవచ్చునని ఆశ.


“శివం”

—విజయవాడ.

★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press. 7, Thambu Chetty St, Madras

సిద్ధముగానున్నది.



మూలం:

రాబర్ట్ లూయీ స్టీవెన్సన్

★

అనువాదం:

దాసు వామనరావు

★

డాక్టర్ జెకిల్ ఎండ్ మిస్టర్ హైడ్ **(Dr Jekyll And Mr Hyde)**
"మనిషిలో మనిషి" గ్రంథరూపంలో వెలువడినది
ప్రతులు కావలసినవారు తెప్పించుకొనుడు.

★

ప్రతి వెల రూ. **1-4-0**

ఆంధ్ర గ్రంథమాల

7, తంబుచెట్టి వీధి, : : మద్రాసు **1.**

ప్రసిద్ధిగాంచిన పాండ్స్ క్రీములతో

మీ ముఖమును మృదువుగ నిర్మలముగ ఉంచుకోండి



ప్రతి ఒక్కరి చర్మ స్వభావమునకు సరిపోయేలా రెండు ప్రఖ్యాతియైన క్రీములు

స్త్రీలు సౌందర్యమును కోరుట సహజమే। ఆ ఉద్దేశముతోనే పాండ్స్ క్రీములు తయారుచేయువారు మీ ముఖమును మృదువుగ నిష్కళంకముగ ఉంచుకొనుటకు సహాయముగ రెండు సౌందర్య సాధనలు యిస్తున్నారు. పాండ్స్ క్రీములు వేడి లేక చెమ్మగల ఏ ప్రదేశములోనైనా మీ చర్మమునకు రక్షణనిచ్చేలా తయారుచేయబడినవి. మరియు ప్రతి ఒక్కరి చర్మమునకు అది పొడిగానున్నా సరే లేక సహజముగ జిడ్డుగానున్నా సరే తగినట్లు ఉంటాయి. ప్రపంచమంతటా సౌందర్యవతుల వలె మీరూ వానిని ప్రతిరోజు వాడండి!



మీ ముఖ కాంతిని పాడుచేయు పొడిగాలిగల ప్రదేశములో — పాండ్స్ కోల్డ్ క్రీమ్ మీకు అవసరము. దానిలోనున్న విశేష నూనెలు మీ చర్మమునకు ఉపశమనమునిచ్చి తీక్షణమైన ఎండ, వడగాడ్పులతో అది వాడి పోకుండా కాపాడును.



వేడి, చెమ్మగల ప్రదేశములో లేక మీ చర్మము సహజముగ జిడ్డుగా యుంటే — పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్ వాడండి. ఎంతో తేలికగా మరియు మంచువలెనున్న యీ క్రీమ్ రోమరంధ్రాలను అడ్డిన జిగటను, నిర్జీవమైన రక్తకణములను అద్దము తీసి మీ ముఖమునకు సౌమ్యరక్షణ నిచ్చును.

మీ అభిమానపు పాండ్స్ క్రీమును ప్రతి దినము తప్పక వాడండి. కొన్ని రోజులలో మీ ముఖము నవవికసిత పుష్పమువలె నిర్మలముగ, మృదువుగ, మనోహరముగ ఉండుట మీరు చూడగలరు — అనుభవించగలరు కూడ!

ప్రపంచములో సౌందర్యరాణులు వాడే క్రీములు

పాండ్స్

కోల్డ్ క్రీమ్

వ్యానిషింగ్ క్రీమ్



P. 9946